

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 48

బుధవారం 10-5-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'బెస్ట్' మెస్సీ, షెల్లీ ఫ్రేజర్

లారియస్ గ్లోబల్ స్పోర్ట్స్ అవార్డుల్లో ఉత్తమ క్రీడాకారులుగా ఎంపిక. - 12లో



అండమాన్‌కు ఆమే నర్సు

'గ్లోబల్ నర్సింగ్ అవార్డు' షార్ట్‌లిస్ట్‌లో చోటు సంపాదించిన శాంతి తెరెసా లక్రా - 11లో



రష్యాపై 'రియల్ వార్'

స్వప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి పశ్చిమ దేశాలు రష్యాపై అసలైన యుద్ధం (రియల్ వార్) ప్రారంభించాయని పుతిన్ ఆరోపించారు.

- వివరాలు 6లో



జనం మనసుల్లోకి సుప్రీంకోర్టు

ప్రత్యక్ష ప్రసారాల ద్వారా సుప్రీంకోర్టు ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకుందని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ వ్యాఖ్యానించారు.

- వివరాలు 6లో

'బొగ్గు' స్కామ్‌లో ఈడీ దూకుడు

ఛత్తీస్‌గఢ్‌లో బొగ్గుపై పన్ను అక్రమాల కేసులో తాజాగా రూ.51.4 కోట్లకుపైగా ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది.

- వివరాలు 6లో



బస్సు నదిలో పడి 24 మంది మృతి

మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్ జిల్లాలో ప్రైవేట్ బస్సు అదుపుతప్పి నదిలో పడింది. ఈ ప్రమాదంలో 24 మంది ప్రాణాలు కోల్పోయారు.

- వివరాలు 6లో

ఇమ్రాన్ అరెస్ట్..

పాక్ మాజీ ప్రధానమంత్రి వాహనం అద్దాలు బద్దలు కొట్టి, కాలర్ పట్టుకొని లాక్కెళ్లి..

ఇస్లామాబాద్ హైకోర్టు ఎదుట అదుపులోకి తీసుకున్న పారామిలటరీ రేంజర్లు

సొంత ట్రస్టుకు భూమి బదిలీ కేసులో అరెస్టు చేసినట్లు అధికారుల ప్రకటన

కస్టడీలో ఇమ్రాన్‌ను హింసిస్తున్నారని పీటీఐ నేతల ఆరోపణలు

- అధికారంలో ఉన్నప్పుడు భారీగా అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పాకిస్తాన్ మాజీ ప్రధాని, పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్(పీటీఐ) పార్టీ చైర్మన్ ఇమ్రాన్ ఖాన్ ను పారామిలటరీ రేంజర్లు మంగళవారం అరెస్టు చేశారు. ఇదే కేసులో ఇస్లామాబాద్ హైకోర్టులో విచారణకు హాజరైన ఆయనను న్యాయస్థానం ఎదుటే అదుపులోకి తీసుకున్నారు. తనను హత్య చేసేందుకు పాకిస్తాన్ సైన్యం కుట్ర పన్నుతోందంటూ ఆరోపించిన మరుసటి రోజే ఇమ్రాన్‌ను అరెస్టు చేయడం గమనార్హం.





6 లో

ఇమ్రాన్ వాహనం అద్దాలు పగులగొట్టి ఆయనను అదుపులోకి తీసుకుంటున్న పారామిలటరీ రేంజర్లు. అనంతరం బలవంతంగా పోలీసు వాహనంలోకి ఎక్కిస్తున్న దృశ్యం

అమ్మాయిలదే హవా

ఇంటర్ రెండేళ్ల ఫలితాల్లోనూ బాలుర కంటే అధిక ఉత్తీర్ణత నమోదు

ఫలితాలను విడుదల చేసిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి

- ఫస్టియర్‌లో 61.68%, సెకండియర్‌లో 63.49% పాస్
- ఫస్టియర్‌లో మేడ్చల్.. సెకండియర్‌లో ములుగు టాప్
- జూన్ 4 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ
- ఎంసెట్‌లో ఇంటర్‌కు వెయిటేజ్ ఉండదని స్పష్టత
- ఫెయిలైన వారు ఆందోళన పడొద్దని సూచన

నేటి నుంచి రీకౌంటింగ్, రీవెరిఫికేషన్..

16వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంటర్మీడియట్ ఫలితాల్లో మరోసారి బాలికలు సత్తా చాటారు. మొదటి, రెండో సంవత్సరం రెండింటిలోనూ బాలురను మించి ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేశారు. ఫస్టియర్‌లో బాలురు 54.66 శాతం పాసయితే, బాలికలు 68.68% ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్‌లో బాలురు 55.60% ఉత్తీర్ణులైతే, బాలికలు 71.57 శాతం పాస్ కావడం గమనార్హం. మంగళవారం మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఇంటర్ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. ఇంటర్ రెండేళ్ల పరీక్షలు కలిపి మొత్తంగా 9,48,153 మంది హాజరయ్యారని తెలిపారు. ఫస్టియర్‌లో 61.68 శాతం, సెకండియర్‌లో 63.49 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు వెల్లడించారు. ఫస్టియర్‌లో 1,75,505 మంది, సెకండియర్‌లో 1,91,698 మంది ఏ గ్రేడ్ (75శాతంపైన మార్కులతో)లో ఉత్తీర్ణులైనట్టు వివరించారు. ఫస్టియర్ ఫలితాల్లో మేడ్చల్ (75% పాస్) మొదటి స్థానంలో, రంగారెడ్డి (73% పాస్) ద్వితీయ స్థానంలో నిలిచా యని మంత్రి తెలిపారు. సెకండియర్‌లో ములుగు (85% పాస్) మొదటి స్థానంలో, కొమురం భీం (81 శాతం పాస్) రెండో స్థానంలో నిలిచినట్టు స్పష్టం చేశారు.

ఫెయిలైతే ఆందోళన పడొద్దు

ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ రాసి పాసవ్వాలని మంత్రి సూచించారు. ఎంసెట్‌లో ఈ ఏడాది ఇంటర్ మార్కులకు వెయిటేజీ లేదని, అందువల్ల ఇంటర్ మార్కులు తక్కువ వచ్చినా ఆందోళన పడొద్దని చెప్పారు.

నేటి నుంచి రీవెరిఫికేషన్..

ఇంటర్ జవాబు పత్రాల రీవెరిఫికేషన్, రీవాల్యూయేషన్ ప్రక్రియను ఈ నెల 10 నుంచి 16 వరకు చేపడుతున్నామని.. విద్యార్థులు సంబంధిత

మిగతా 2వ పేజీలో ▶



గురుకులాలు భేష్.. ప్రభుత్వ కాలేజీలు డౌన్

- 92 శాతం ఉత్తీర్ణతతో ముందు వరుసలో టీఆర్ఈఐఎస్
- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సెకండియర్ ఉత్తీర్ణత 54 శాతం

- 2లో

నేడు టెన్త్ ఫలితాలు

మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేయనున్న మంత్రి సబిత

- పదో తరగతి పరీక్షల ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హైదరాబాద్‌లో ఫలితాలను ప్రకటించనున్నారు.

'సాక్షి'లో ఫలితాలు..

టెన్త్ పరీక్ష ఫలితాలను త్వరితగతిన తెలుసుకునేందుకు సాక్షి దినపత్రిక ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. www.sakshieducation.com వెబ్‌సైట్‌కు లాగిన్ అయి, ఫలితాలు పొందవచ్చు.

ఉగ్ర ముఠాపై పంజా!

రాష్ట్ర నిఘా వర్గాలతో కలసి హైదరాబాద్‌లో మధ్యప్రదేశ్ ఏటీఎస్ దాడులు

హిజ్బ్ ఉత్ తహరీర్ సంస్థ సానుభూతిపరుల ఇళ్లలో సోదాలు

ఐదుగురిని అదుపులోకి తీసుకున్న అధికారులు.. పరారీలో మరొకరు

- పట్టుబడినవారిలో ఓ మెడికల్ కాలేజీ విభాగాధిపతి, డెంటిస్ట్, క్లౌడ్ సర్వీస్ ఇంజనీర్
- కత్తులు, గొడ్డళ్లు, ఎయిర్ పిస్టల్స్, ఉగ్రవాద సాహిత్యం స్వాధీనం
- యువతను ఆకర్షించి ఉగ్రవాదం వైపు మళ్లిస్తున్న హెచ్‌యూటీ సంస్థ
- మతం మార్చుకుని మరీ సంస్థ కార్యకలాపాల్లో భాగమైన కొందరు..
- 'లోన్ వూల్ఫ్' దాడులకు ప్లాన్.. రసాయన, జీవాయుధాలపైనా శిక్షణ
- ఇటీవలే హైదరాబాద్‌లో డ్రోన్లతో రెక్కీ చేసినట్టు గుర్తించిన అధికారులు



-10లో

వారు మంచి ఉద్యోగాలు, వృత్తుల్లో ఉన్నవారు.. అందరి మధ్య ఉంటూనే అవసరమైనప్పుడు దాడి చేసి, కలకలం సృష్టించి.. మళ్లీ ఏమీ తెలియనట్టు ఉండిపోయేలా ఉగ్రవాద శిక్షణ పొందుతున్నవారు.. ఇంకా అవసరమైతే బాంబులతో విధ్వంసానికీ వెనకాడనివారు.. హైదరాబాద్‌లో దాడులకు సిద్ధమై చాప కింద నీరులా ప్లాన్ అమలుకు సిద్ధమయ్యారు. మధ్యప్రదేశ్ ఏటీఎస్, రాష్ట్ర నిఘా విభాగం కలసి ఈ కుట్రను భగ్నం చేశాయి.

నేడే కర్ణాటకలో పోలింగ్..

పూర్తి ఏర్పాట్లు, భద్రతతో సర్వం సిద్ధం

ఇక నుంచి మీ కలే నా కల

- ఉమ్మడి లక్ష్యంగా ముందుకెళ్తే ప్రపంచంలో ఆపేవారే లేరు.. కన్నడ ప్రజలకు రాసిన లేఖలో ప్రధాని మోదీ

- వివరాలు 6లో

సీఎం ప్రధాన సలహాదారుగా సోమేశ్‌కుమార్



- మాజీ సీఎస్‌కు కేబినెట్ హోదాతో కూడిన కీలక పదవి
- మూడేళ్లపాటు పదవిలో ఉండేలా ఉత్తర్వులు

- వివరాలు 3లో



రోబోటిక్ ఫ్రేమ్‌వర్క్‌పై బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

రోబో పార్కు రాష్ట్రంగా తెలంగాణ

- రోబోటిక్ టెక్నాలజీ గేమ్ చేంజర్ అవుతుంది: మంత్రి కేటీఆర్
- టీహబ్‌లో 'తెలంగాణ స్టేట్ రోబోటిక్స్ ఫ్రేమ్‌వర్క్'ఆవిష్కరించిన కేటీఆర్

రాయదుర్గం: దేశంలో రోబోటిక్ టెక్నాలజీ గేమ్ చేంజర్ అవుతుందని ఐటీ శాఖ మంత్రి కేటీ రామారావు చెప్పారు. తెలంగాణ రోబోటిక్స్ ఇన్నోవేషన్ సెంటర్ (టీఆర్ఐసీ)ను రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రోబోటిక్స్ రంగంలో అగ్రగామిగా నిలుస్తామని, రోబో పార్కు రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు పొందడం ఖాయమన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షించడానికి వచ్చే జూలైలో 'గ్లోబల్ రోబోటిక్స్ సమిట్'ను నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. మంగళవారం హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో 'తెలంగాణ రోబోటిక్ ఫ్రేమ్‌వర్క్'ను ఆవిష్కరించిన అనంతరం కేటీఆర్ మాట్లాడారు. ఇది ఫ్రేమ్‌వర్క్ కింద అన్ని కార్యక్రమాలకు నాయకత్వం వహించడానికి నోడల్ బాడీగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో స్థిరమైన రోబోటిక్స్ పర్యావరణ వ్యవస్థను

మిగతా 2వ పేజీలో ▶

ఇవాళ్టి నేత



క్లుప్తంగా...

నీరాపై కావాలనే విషప్రచారం: శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: ప్రకృతి సిద్ధమైన, ఎన్నో ఔషధ గుణాలున్న నీరాపై ఉద్దేశపూర్వకంగా కొందరు సోషల్ మీడియాలో విష ప్రచారం చేస్తున్నారని మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నెక్లెస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన నీరా కేఫ్ స్టాల్స్, తెలంగాణ పిండి, మాంసాహార వంటకాలు, నీరా ప్రాసెసింగ్ యూనిట్లను మంత్రి మంగళవారం రాత్రి పరిశీలించారు. నీరా కేఫ్‌కు వచ్చిన వారిని కలిసి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కేఫ్‌లో వంటకాలను రుచి చూశారు. నాణ్యమైన వంటకాలను ప్రజలకు అందించాలని మంత్రి నిర్వాహకులకు సూచించారు. గీత కార్మికులు ప్రాణాలకు తెగించి క్యాన్సర్‌తో పాటు అనేక జబ్బులను నివారించే ఔషధ గుణాలున్న నీరాను అందిస్తున్నారని తెలిపారు.

టీఎస్‌పీఎస్సీ లీకేజ్ వ్యవహారంలో మరో నలుగురి అరెస్టు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) పరీక్ష పేపర్ల లీకేజ్ కేసులో మరో నలుగురిని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మంగళవారం అరెస్టు చేసింది. ఈ నలుగురు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ), అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పరీక్ష పత్రాలు ఖరీదు చేసిన అభ్యర్థులని అధికారులు చెప్తున్నారు. పులిదిండి ప్రవీణ్‌కుమార్ నుంచి ఈ పేపర్లు తీసుకున్న దళారులు వరంగల్‌కు చెందిన మనోజ్‌కుమార్ రెడ్డి, హైదరా బాద్ వాసి మురళీధర్‌రెడ్డి వాటిని ఏడుగురికి విక్రయించారు. ఒక్కొక్కరితో రూ.10 లక్షలకు ఒప్పందం చేసుకుని రూ.1 లక్ష నుంచి రూ. 1.5 లక్షల వరకు అడ్వాన్సులు తీసుకుని పేపర్లు అందించారు. దళారులను సోమవారం అరెస్టు చేసిన సిట్ వారిచ్చిన సమాచారంతో నాగర్‌కర్నూల్‌కు చెందిన ఆది సాయిబాబు, ముడావత్ శివకుమార్, నాగార్జునసాగర్‌కు చెందిన రమావత్ మహేశ్, ఖమ్మంకు చెందిన పొన్నం వరుణ్‌లను మంగళవారం అరెస్టు చేశారు. వీరిని కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఈ నలుగురి అరెస్టుతో ఈ కేసులో నిందితుల సంఖ్య 28కి చేరింది.

నిమ్స్‌మేలో ఎంబీఏ ఎంఎస్‌ఎంఈ మేనేజ్‌మెంట్ కోర్సు

పంజగుట్ట (హైదరాబాద్): భారత ప్రభుత్వ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎంఎస్‌ఎంఈ (నిమ్స్‌మే) ఆధ్వర్యంలో దేశంలోనే తొలిసారిగా ఏఎస్‌బీఎం యూనివర్సిటీ సహకారంతో ఎంబీఏ ఎంఎస్‌ఎంఈ మేనేజ్‌మెంట్ కోర్సును ప్రారంభిస్తున్నట్లు నిమ్స్‌మే డైరెక్టర్ జనరల్ ఎస్.గ్లోరీ స్వప్న తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం కోర్సు కరపత్రాన్ని ఏఎస్‌బీఎమ్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు బిస్వజిత్ పట్నాయక్, నిమ్స్‌మే ఫ్యాకల్టీ మెంబర్ దిబ్యందు చౌదరి, యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నిరంజనలతో కలిసి ఆవిష్కరించారు. దరఖాస్తుల గడువు మే 30వ తేదీ అని, ఆగస్టు 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

లైబ్రరీల్లో పోస్టుల భర్తీ... ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్, ఉన్నత విద్యాశాఖ నియంత్రణలో ఉన్న గ్రంథాలయాల్లోని ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నేటి నుంచి హాల్‌టికెట్ https://tspsce.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని టీఎస్‌పీఎస్సీ తెలిపింది. కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(సీబీఆర్‌టీ)తో నిర్వహించనున్న లైబ్రేరియన్ పరీక్ష ఈనెల 17న ఉదయం 10 గంటల నుంచి 12-30 వరకు, తిరిగి మధ్యాహ్నం 2-30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి 45 నిమిషాల ముందే రావాలని పేర్కొంది. పరీక్ష విధానంపై మాక్ టెస్టు కోసం https://www..digialm. com:443//onlineassessment/index.html?1222@m2ను చూడాలని విద్యార్థులకు సూచించింది.

నోటిఫికేషన్ తర్వాతే ఇంటర్ అడ్మిషన్లు

ప్రైవేటు కాలేజీలకు ఇంటర్ బోర్డ్ కార్యదర్శి వార్నింగ్

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ బోర్డ్ అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాతే ఇంటర్ కాలేజీల్లో ప్రవేశాలు చేపట్టాలని బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ స్పష్టం చేశారు. ఇందుకు విరుద్ధంగా ఏ ప్రైవేటు కాలేజీ అడ్మిషన్లు తీసుకున్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలోనే నోటిఫికేషన్ ఇస్తామన్నారు. ఇంటర్ రిజల్ట్స్ నేపథ్యంలో మిత్తల్ మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. ఇంటర్ ఫలితాలపై పత్రికా ప్రకటన ఇచ్చే ముందు కాలేజీలు విధిగా బోర్డ్ అనుమతి తీసుకోవాల్సిందేనన్నారు. వాళ్ళు దరఖాస్తు చేసిన రోజే పరిశీలించి అనుమతి ఇచ్చేందుకు యంత్రాంగం ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థి తమ కాలేజీలో చదివి ఉంటే మాత్రమే దాన్ని ప్రకటించుకోవాలని, వేరే చోట చదివితే, దాన్ని ప్రచారం కోసం వాడుకుంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అనుబంధ గుర్తింపు ప్రక్రియ చాలా వరకూ పూర్తయిందని, ప్రభుత్వ కాలేజీలకు అఫ్లియేషన్ ఇచ్చామని తెలిపారు. అఫ్లియేషన్ లేని కాలేజీల వివరాలు తెలుసుకున్న తర్వాతే విద్యార్థులను ప్రైవేటు కాలేజీల్లో చేర్చాలని ఆయన సూచించారు.

ఇంటర్‌లో అమ్మాయిలదే హవా



ఇంటర్ ఫలితాలను విడుదల చేస్తున్న మంత్రి సబిత, నవీన్ మిత్తల్

▶ మొదటి పేజీ తరువాయి

కాలేజీల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ తెలిపారు. రీవెరిఫికేషన్‌కు రూ.100, రీవ్యాల్యుయేషన్‌కు రూ.600 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఫెయిలైన విద్యార్థులతోపాటు పాసైనా ఇంప్రూవ్‌మెంట్ కోరుకునే విద్యార్థులు ఈ నెల 16 లోగా ఫీజు చెల్లించాలని సూచించారు. మార్కుల మెమోలు, కలర్ ప్రింట్లను ఇంటర్ బోర్డ్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. మానసిక ఆందోళనకు గురైన విద్యార్థులు 14416 టోల్ ఫ్రీనంబర్‌కు కాల్ చేసి నిపుణుల ద్వారా కౌన్సెలింగ్ పొందవచ్చని తెలిపారు. వీలైనంత త్వరగా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు వెల్లడిస్తామన్నారు. ఇంటర్ బోర్డ్ అడ్మిషన్ నోటిఫికేషన్ ఇచ్చే వరకు కూడా.. ఏ కాలేజీలోనూ అడ్మిషన్లు చేపట్టడానికి వీల్లేదని స్పష్టం చేశారు.

ఇంటర్ ఫలితాల సరళి ఇదీ..

అంశం	ఫస్టియర్	సెకండియర్
పరీక్ష రాసిన అభ్యర్థులు	4,82,675	4,65,478
ఉత్తీర్ణులైన వారు	1,97,741	2,95,550
ఉత్తీర్ణత శాతం	61.68	63.49
పరీక్ష రాసిన బాలురు	2,41,002	2,35,520
ఉత్తీర్ణులైన బాలురు	1,31,747	1,30,952
బాలుర ఉత్తీర్ణత శాతం	54.66	55.60
పరీక్ష రాసిన బాలికలు	2,41,673	2,29,958
ఉత్తీర్ణులైన బాలికలు	1,65,994	1,64,598
బాలికల ఉత్తీర్ణత శాతం	68.68	71.57
ఎ గ్రేడ్ ఉత్తీర్ణులు (75% పైన)	1,75,505	1,91,698
బి గ్రేడ్ ఉత్తీర్ణులు (60-75%)	75,820	64,385
సి గ్రేడ్ ఉత్తీర్ణులు (50-60%)	31,659	21,166
డి గ్రేడ్ ఉత్తీర్ణులు (35-50%)	14,757	7,784

ఎంపీసీలో అత్యధిక ఉత్తీర్ణత.. రెండో స్థానంలో బైపీసీ

హెచ్‌ఈసీ, సీఈసీ కోర్సుల్లో 50 శాతంలోపే పాస్

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా సైన్స్ గ్రూపుల్లోనే అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదైంది. ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెండింటిలోనూ ఎంపీసీ (మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ) గ్రూపులో ఎక్కువ మంది పాసయ్యారు. తర్వాత స్థానంలో బైపీసీ ఉండగా.. సీఈసీ, హెచ్‌ఈసీ వంటి సంప్రదాయ గ్రూపుల్లో తక్కువ ఉత్తీర్ణత నమోదైంది.

ఇంటర్ గ్రూప్‌ల వారీగా ఉత్తీర్ణత తీరు..

గ్రూపు	ఫస్టియర్ పరీక్షరాసినది	ఫస్టియర్ ఉత్తీర్ణులు (శాతం)	సెకండియర్ పరీక్షరాసినది	సెకండియర్ ఉత్తీర్ణులు (శాతం)
ఎంపీసీ	2,07,752	1,57,773 (75.94%)	1,65,708	1,20,515 (72.73%)
బైపీసీ	1,00,336	64,358 (64.14%)	1,11,275	75,040 (67.44%)
సీఈసీ	98,600	37,449 (37.98%)	1,11,765	52,807 (47.25%)
హెచ్‌ఈసీ	11,298	3,408 (30.18%)	10,263	4,792 (46.69%)
ఎంఈసీ	14,674	8,927 (60.84%)	19,557	11,729 (59.97%)

తగ్గిన ఉత్తీర్ణత శాతం

సాక్షి, హైదరాబాద్: ఇంటర్‌లో గతేడాదితో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం తగ్గింది. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు రెండింటి ఫలితాలూ ఇలాగే ఉన్నాయి. కోవిడ్ కారణంగా 2021లో పరీక్షలు నిర్వహించకుండానే అందరినీ పాస్ చేశారు. 2022లోనూ 75% సిలబస్‌తో పరీక్షలు జరిగాయి. ఈ ఏడాది వంద శాతం సిలబస్‌తో పరీక్షలు పెట్టారు. పూర్తి సిలబస్ నేపథ్యంలోనే ఇంటర్ జనరల్ విభాగంలో ఉత్తీర్ణత తగ్గిందని నిపుణులు చెప్తున్నారు.

కొన్నేళ్లుగా ఇంటర్ ఉత్తీర్ణత శాతం

ఏడాది	ఫస్టియర్	సెకండియర్
2018-19	60.60	64.94
2019-20	61.07	69.61
2020-21	100	100
2021-22	64.85	68.68
2022-23	62.85	67.27

ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థుల వివరాలను ఇంటర్ బోర్డ్ వెల్లడించింది. గ్రూపుల వారీగా టాపర్ల వివరాలివీ..

ఫస్టియర్‌లో..

గ్రూపు	విద్యార్థి	జిల్లా	మార్కులు
హెచ్‌ఈసీ	కల్లా సందేశ్	హనుమకొండ	487
సీఈసీ	సానియా	హైదరాబాద్	481
సీఈసీ	మిషా మహవీన్	కరీంనగర్	479
బైపీసీ	రాధారపు శ్రీనిధి	పెద్దపల్లి	434
బైపీసీ	యు.సుచరిత	మహబూబాబాద్	432
బైపీసీ	సైదాఆసీఫాహష్మీ	వికారాబాద్	432
ఎంపీసీ	యు.సాయిఅమూల్య	పెద్దపల్లి	465
ఎంపీసీ	పట్టి అనన్య	జగిత్యాల	464

సెకండియర్‌లో..

గ్రూపు	విద్యార్థి	జిల్లా	మార్కులు
ఎంపీసీ	సీఎస్‌వీ వైష్ణవిదేవి	సూర్యాపేట	991
ఎంపీసీ	జె. ఫిరదౌసస్షభ	నిర్మల్	990
బైపీసీ	తప్పెట రోహిణి	ఖమ్మం	990
బైపీసీ	ఎన్.సౌమ్య	నిజామాబాద్	989
బైపీసీ	భవాని హాన్సి	నిర్మల్	987
సీఈసీ	మంగియా చౌహాన్	రంగారెడ్డి	973
హెచ్‌ఈసీ	దర్శి సిరి	ఖమ్మం	972
సీఈసీ	షిరాన్ ఫాతిమా	సంగారెడ్డి	972

గురుకులాలు భేష్.. ప్రభుత్వ కాలేజీలు డౌన్

- 92 శాతం ఉత్తీర్ణతతో ముందు వరుసలో టీఆర్‌ఈఐఎస్
- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సెకండియర్ ఉత్తీర్ణత 54 శాతం
- ప్రైవేటు కాలేజీల్లో 63 శాతమే రిజల్ట్
- జూనియర్ కాలేజీలు, మోడల్ స్కూళ్లపై దృష్టి పెట్టాల్సి ఉందన్న మంత్రి

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో సంక్షేమ గురుకుల సొసైటీలు సత్తా చాటాయి. కార్పొరేట్ కాలేజీల కంటే దీటైన మార్కులను సొంతం చేసుకున్నాయి. రాష్ట్రంలో అత్యంత ఎక్కువ సంఖ్యలో ఉన్న మహాత్మా జ్యోతిభా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్) నుంచి ఫస్టియర్, సెకండియర్‌లో అత్యధిక మార్కులు సొంతం చేసుకున్నారు. టాప్ 10లో సగం ర్యాంకులు ఈ సొసైటీకే సొంతమయ్యాయి. మేనేజ్‌మెంట్ల వారీగా చూస్తే.. గురుకుల కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం పెరిగితే.. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మాత్రం తగ్గిపోయింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఫస్టియర్ కేవలం 40 శాతమే ఉత్తీర్ణత నమోదైంది. రెండో ఏడాది కూడా 54 శాతమే పాసయ్యారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న తెలంగాణ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఆర్‌ఈఐఎస్) 92శాతం ఉత్తీర్ణతతో ముందు వరుసలో నిలబడింది. వివిధ వర్గాలకు చెందిన గురుకుల కాలేజీల్లోనూ విద్యార్థులు ఎక్కువ మంది పాసయ్యారు. కానీ మోడల్ స్కూళ్లలో మాత్రం ఫ్యాకల్టీ లోపం వల్ల ఉత్తీర్ణత శాతం 66కు మించలేదు. ప్రైవేటు కాలేజీల్లోనూ ఈసారి 63 శాతమే ఉత్తీర్ణత నమోదైంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, మోడల్ స్కూల్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఫలితాల విడుదల సందర్భంగా పేర్కొనడం గమనార్హం. రెసిడెన్షియల్ కాలేజీల తరహాలో ఉత్తీర్ణత సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టాలని అధికారులకు మంత్రి సూచించారు.

కార్పొరేట్‌కు దీటైన ఫలితాలివి: మంత్రి గంగుల కమలాకర్

ప్రైవేటు కాలేజీలు, కార్పొరేట్ కాలేజీలకు దీటైన ఫలితాలను గురుకుల పాఠశాలలు సాధించాయి. బీసీ గురుకుల సొసైటీ నుంచి అద్భుతమైన ర్యాంకులు రావడం ఆనందకరం. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో మందమర్రికి చెందిన హరిత 468 మార్కులు సాధించి ఫస్ట్ ర్యాంకు కొట్టింది. ఇక సికింద్రాబాద్‌కు చెందిన భూమిక 467 మార్కులతో రెండో ర్యాంకు సాధించింది. ఇంతటి అద్భుత ఫలితాలు సాధించిన సొసైటీ కార్యదర్శి మల్లయ్య బట్టు, బోధన, బోధనేతర సిబ్బందికి ప్రత్యేక అభినందనలు.

సొసైటీల వారీగా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత శాతం ఇలా...

సొసైటీ	ఉత్తీర్ణత
టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్	89%
టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	84%
ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	87%
టీఎంఆర్‌ఈఐఎస్	83%
టీఆర్‌ఈఐఎస్	92%

ఉన్నత అవకాశాల్లోనూ ముందే..: మంత్రి కొప్పుల

ఉత్తమ ఫలితాల్లోనే కాకుండా ఉన్నత ఉద్యోగాలను చేజిక్కించుకుంటున్న వారిలో గురుకుల విద్యార్థులుంటున్నారు. ఈసారి ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాల్లో గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని గురుకులాలను నిర్వహిస్తున్నందున మంచి ఫలితాలు వచ్చాయి.

పేదల విద్యకు ప్రాధాన్యత: మంత్రి సత్యవతి రాథోడ్

రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గురుకుల పాఠశాలలను పెద్ద సంఖ్యలో తెరిచి పేదలకు కేజీ టు పీజీ విద్య అందించే లక్ష్యాన్ని మొదలుపెట్టారు. ఇందులోభాగంగా గురుకులాలు రికార్డులు సాధిస్తున్నాయి. ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నందునే గురుకులాల విద్యార్థులు కార్పొరేట్ కాలేజీల కంటే మెరుగైన ఫలితాలను సాధిస్తున్నారు.

నేటి నుంచి తెలంగాణ ఎంసెట్

- 10, 11 తేదీల్లో అగ్రి, మెడికల్
- 12 నుంచి 14 వరకు ఇంజనీరింగ్ ఎంసెట్
- తెలంగాణలో 104, ఏపీలో 33 పరీక్ష కేంద్రాలు
- నిమిషం ఆలస్యం నిబంధన అమలు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, వైద్య, వ్యవసాయ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష టీఎస్ ఎంసెట్-2023 బుధవారం నుంచి జరగనున్నాయి. 10, 11 తేదీల్లో అగ్రి, మెడికల్, 12 నుంచి 14 వరకూ ఇంజనీరింగ్ ఎంసెట్ నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఒక దఫా, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకూ రెండో సెషన్ పరీక్ష ఉంటుంది. ఈ సారి మొత్తం మూడు లక్షలకుపైగా విద్యార్థులు ఎంసెట్ రాయనుండగా...ఇందుకోసం తెలంగాణలో 104, ఏపీలో 33 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షల కోసం ప్రత్యేక రవాణా సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు. నిర్ణీత సమయానికి ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాలులోకి అనుమతించరని అధికారులు స్పష్టం చేశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని, విజయం సాధించాలని జేఎన్‌టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి విద్యార్థులను కోరారు.

రోబో పార్కు రాష్ట్రంగా తెలంగాణ

▶ మొదటి పేజీ తరువాయి

సృష్టించడం, ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధిలో రాష్ట్రాన్ని కేంద్రంగా చేయడం వంటి లక్ష్యాలతో 'స్టేట్ రోబోటిక్స్ ఫ్రేమ్‌వర్క్'ను ప్రారంభించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, పారిశ్రామిక ఆటోమేషన్, కన్స్యూమర్ రంగాల్లో మరింత అభివృద్ధిని సాధించడానికి ఈ ఫ్రేమ్‌వర్క్ దోహదపడుతుందని చెప్పారు. రాష్ట్రంలోని స్టార్టప్‌లకు అవసరమైన ఇంక్యుబేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆథరైజేషన్ సపోర్ట్, మార్కెట్ ఇన్‌సైట్‌లు, ఇన్వెస్టర్ కనెక్షన్లు తదితరాల కోసం ప్రపంచస్థాయి రోబోటిక్స్ యాక్సిలరేటర్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. రోబోటిక్ టెక్నాలజీ వినియోగంలో చైనా, జపాన్, అమెరికా తర్వాత పదో దేశంగా భారత్ గుర్తింపు పొందుతోందన్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడానికి, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా ఐఐటీ హైదరాబాద్, ఆర్ట్ పార్కు ఐఐఎస్‌సీ, జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, ఏజీహబ్, ఆలిండియా రోబోటిక్స్ అసోసియేషన్ వంటి సంస్థలతో ప్రభుత్వం ఎంఓయూ కుదుర్చుకుంది. కార్యక్రమంలో ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, ఎమర్జింగ్ టెక్నాలజీస్ డైరెక్టర్ రమాదేవిలంకా, పలుసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



వైష్ణవిదేవి (991/1000)



ఫిర్దోస్ నబా (990/1000)



రోహిణి (990/1000)



శిరీష (495/500)

చదువుకు పేదరికం అడ్డుకాదని..

ఇంటర్‌లో అద్భుత ఫలితాలు సాధించిన ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు

హుజూర్‌నగర్/మంచిర్యాల అర్బన్/సాక్షి, హైదరాబాద్: రెక్కాడితే గానీ కడుపునిండని పేదరికం. అయినా వారి చదువుకు పేదరికం అడ్డుకాలేదు. కష్టాలను దిగమింగి మొక్కవోని ఆత్మవిశ్వాసంతో ఇంటర్మీడియట్ పరీక్షల్లో సత్తా చాటారు. సంపదకు, సరస్వతీ కటాక్షానికి సంబంధం లేదని నిరూపించారు. ప్రభుత్వ కాలేజీలో చదివి ప్రతిభాపాటవాలను కనబర్చిన ఈ విద్యార్థులను పలువురు అభినందించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన సీఎస్‌వీ వైష్ణవిదేవి ఎంపీసీలో 1000 మార్కులకు 991 మార్కులు సాధించి ఔరా అనిపించింది. వైష్ణవి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివింది. వైష్ణవి తండ్రి సీఎస్ సురేంద్ర కుమార్ పెయింటర్ కాగా, తల్లి రాజమణి గృహిణి. ఐఏఎస్ కావాలన్నదే తన లక్ష్యమని ఆమె చెప్పింది.

కూలీ బిడ్డ...

మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా క్రిష్ణాకాలనీలో ఓ చిన్న గదిలో ఆకుల లక్ష్మీ.. కుతూరు శిరీష, కుమారుడు శివసాయికుమార్‌తో కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. శిరీష మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో మల్టీ పర్పస్‌హెల్త్ వర్కర్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ) కోర్సులో చేరింది. ఇంకోవైపు బ్రిడ్జి కోర్సు బైపీసీ కూడా చదువుతుంది. ఇంటర్ ఫలితాల్లో ఎంపీహెచ్‌డబ్ల్యూలో 500 మార్కులకుగాను 495 సాధించింది. బైపీసీ తర్వాత బీకాం చేసి సీఏ కావాలన్నదే లక్ష్యమని శిరీష తెలిపింది.

అత్యధికం 994!

ఇంటర్‌లో 994 మార్కులు టాప్‌ర్యాంక్‌గా నమోదైనట్టు తెలిసింది. బాన్సువాడకు చెందిన అక్రమ హబీన్ అనే విద్యార్థిని 994 మార్కులు సాధించింది. ఎంపీసీలో వరంగల్‌కు చెందిన పూజా, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోల్‌కు చెందిన పి.రాజేశ్ కూడా 994 మార్కులు సాధించాడు. వీరు ప్రైవేటు కాలేజీల్లో చదివారు. ఈసారి ఇంటర్ బోర్డ్ కేవలం ప్రభుత్వ కాలేజీల్లో అత్యధిక మార్కులు సాధించిన టాపర్ల జాబితాను మాత్రమే విడుదల చేసింది. ప్రైవేటు కాలేజీలతో కలుపుకుని రాష్ట్రంలో టాపర్లు ఎవరన్నది ప్రకటించలేదు.

- నిజామాబాద్‌కు చెందిన ఆరెపల్లి దీక్షిత ఎంపీసీలో 992 మార్కులు సాధించింది. ఆమె తల్లిదండ్రులు రమేశ్, భాగ్య ముంబైలో రజక వృత్తిలో ఉండగా, దీక్షిత స్థానికంగా బంధువుల వద్ద ఉంటూ చదుకుంటోంది.
- జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన పాటిల్ వర్ష (బైపీసీ), సీహెచ్ రష్మిత (ఎంపీసీ) 992 మార్కులు సాధించారు.
- ఖమ్మంలోని ఏఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ చదువుతున్న తప్పెట రోహిణి 990 మార్కులు సాధించింది.
- సత్తుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరం హెచ్‌ఈసీ విద్యార్థిని దాసరి సిరి వెయ్యి మార్కులకు గాను 972 మార్కులు సాధించింది. ఆమె తండ్రి దాసరి ధర్మయ్య లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, తల్లి స్వప్న గృహిణి.
- నిర్మల్ జిల్లా భైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉర్దూ మీడియం విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సెకండియర్ ఎంపీసీలో జవేరియా ఫిర్దోస్ నబా 990/1000 మార్కులు సాధించగా, ఫస్టియర్‌కు చెందిన అదీబానాజ్ 462/470 మార్కులు సాధించింది.

కేటీఆర్‌తో ఆస్ట్రేలియా, బెల్జియం ప్రతినిధుల భేటీ

సాక్షి, హైదరాబాద్: ఆస్ట్రేలియా, బెల్జియం దేశాలకు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాలు మంగళవారం రాష్ట్ర ఐటీ పరిశ్రమల మంత్రి కేటీఆర్ తో భేటీ అయ్యాయి. భారత్ లో ఆస్ట్రేలియన్ హై కమిషనర్ బేరి ఓ ఫారెల్, బెల్జియం రాయబారి డిడియర్ వ్యాండెర్ హాస్లెట్ తమ ప్రతినిధి బృందాలతో కేటీఆర్‌ను కలిశారు.

'చైతన్య' ప్రతిభ

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్టు ఆ విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ, అధినేత డాక్టర్ బీఎస్ రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 993 మార్కులతో నలుగురు, 992 మార్కులతో 26 మంది, 991పైన 52 మంది 990 పైన 109, 980పైన మార్కులతో 1893 మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 468 మార్కులతో పాటు, 467 ఆపైన 57 మంది, 466పైన 274 మంది, 465 పైన 581 మంది, 460పైన 2999 మంది, బైపీసీలో 438 మంది ఇద్దరికి, 437పైన 14, 436 పైన 64 మంది, 435పైన 138 మంది, 430పైన 795 మంది సాధించినట్టు తెలిపారు.

'నారాయణ' విజయవిహారం

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు సత్తా చాటారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను 993 మార్కులు ఇద్దరు, 9 మంది 992, 17 మంది 991 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో 1000 మార్కులకుగాను 991 మార్కులు ఒకరు సాధించగా, 990 ఆపై మార్కులను ఇద్దరు, 989 ఆపై మార్కులను ఆరుగురు సాధించారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను ఏడుగురు 468 మార్కులు, 96 మంది 467 మార్కులు, 269 మంది 466 మార్కులు, 439 మంది 465 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో 440 మార్కులకు 437, 436 మార్కులను పది మంది, 435 మార్కులు 13 మంది సాధించినట్లు విద్యాసంస్థల డైరెక్టర్స్ డా।।పి. సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు.

రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్-దానాపూర్ (07419/07420) స్పెషల్ ట్రైన్ ఈ నెల 13, 20, తేదీల్లో మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11.15 గంటలకు దానాపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 15, 22, 29 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటలకు దానాపూర్ నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11.50 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. సికింద్రాబాద్-డిబ్రూగఢ్(07046/07047) స్పెషల్ ట్రైన్ ఈ నెల 15, 22, 29 తేదీల్లో ఉదయం 11 గంటలకు బయలుదేరి రెండోరోజు రాత్రి 8.50 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 18, 25, జూన్ 1 తేదీల్లో ఉదయం 9.20 గంటలకు బయలుదేరి రెండోరోజు సాయంత్రం 4.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

ముంబై నుంచి హైదరాబాద్..

సీఎస్‌టీ ముంబై-హైదరాబాద్ (01137) స్పెషల్ ట్రైన్ ఈ నెల 10వ తేదీ రాత్రి 12.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 6.30కు హైదరాబాద్ చేరుకోనుంది. హైదరాబాద్-పుణే (01138) స్పెషల్ ట్రైన్ ఈనెల 10వ తేదీ రాత్రి 8.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.05 గంటలకు పుణే చేరుకుంటుంది.

తిరుపతి వందేభారత్‌కు ఇక 16 కోచ్‌లు

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ -తిరుపతి మధ్య నడుస్తున్న వందేభారత్ రైలు కోచ్‌ల సంఖ్య పెంచాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. ప్రస్తుతం 8 కోచ్‌లతో నడుస్తున్న రైలును 16 కోచ్‌లతో నడిపించబోతోంది. 2 ఎగ్జిక్యూటివ్, 14 ఎకానమీ కోచ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ వారంలో ఆ మేరకు మార్పులు చేయనున్నారు. ఏప్రిల్ ఎనిమిదో తేదీన ప్రారంభించిన రోజు నుంచి ఇప్పటి వరకు ఈ రైలు కిటకిటలాడుతూ ప్రయాణిస్తోంది. ఆక్యుపెన్సీ రేషియో 130 శాతానికి మించి నమోదవుతుండటంతో రైలు కోచ్‌ల సంఖ్య పెంచాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులు చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన రైల్వే బోర్డు ఆ మేరకు అనుమతించింది. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి కేవలం 8 గంటల్లోనే ఇది చేరుకుంటోంది. ఉదయం ఆరు గంటలకు బయలు దేరి మధ్యాహ్నం 2గంటల వరకు వెళ్తుండటంతో ప్రయాణికులు దీనివైపు మొగ్గు చూపుతున్నారు.

నేటి నుంచి భగభగలు..

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బుధవారం నుంచి పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని వాతా వరణ శాఖ తెలిపింది. దీనివల్ల గరిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతా యని పేర్కొంది. కొన్నిచోట్ల 40 డిగ్రీల సెల్సియస్ నుండి 43 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో 40 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది.

నేడు బంగాళాఖాతంలో తుపాను: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మంగళవారం సాయంత్రానికి వాయుగుండంగా బలపడింది. ఇది బుధవారం నాటికి అండమాన్ సముద్రానికి ఆనుకుని ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారనుంది. ఇది 11వ తేదీ వరకు ఉత్తర వాయవ్య దిశగా పయనిస్తుంది. ఆ తర్వాత దిశ మార్చుకుని ఉత్తర ఈశాన్య దిశగా కదులుతూ మరింత బలపడి బంగ్లాదేశ్, మయన్మార్ తీరాల వైపు పయనిస్తుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రత్యేక బులెటిన్‌లో వెల్లడించింది. అదే సమయంలో పశ్చిమ మధ్య బంగాళాఖాతం నుంచి వాయుగుండం ప్రాంతం వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది.

ఏపీలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు: ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మంగళవారం అన్నమయ్య జిల్లా సంబేపల్లి, సత్యసాయి జిల్లా నల్లమడ, మడకశిరలో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అనేక ప్రాంతాల్లో 40 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవడంతో వేడి తాళలేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బుధవారం నుంచి ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. సాధారణ ఉష్ణోగ్రతల కంటే 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని పేర్కొంది. కాగా రాష్ట్రంలోని 28 మండలాల్లో బుధవారం వడగాడ్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు.

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం
నల్లగొండ	40.5
ఆదిలాబాద్	40.0
రామగుండం	39.6
ఖమ్మం	39.4
భద్రాచలం	38.2
హనుమకొండ	38.0
మెదక్	37.8
నిజామాబాద్	37.4
హైదరాబాద్	36.7
మహబూబ్‌నగర్	35.8

క్లుప్తంగా...

14న కరీంనగర్‌లో హిందూ ఏక్తా యాత్ర



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో హిందూ సంఘటిత శక్తిని చాటేలా ఈనెల 14న కరీంనగర్‌లో 'హిందూ ఏక్తా యాత్ర'నిర్వహిస్తున్నట్టు బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ వెల్లడించారు. బజరంగ్ దళ్ ను నిషేధిస్తామంటూ కర్ణాటకలో కాంగ్రెస్ ప్రకటించిన నేపథ్యంలో తెలంగాణలోనూ హిందువుల సత్తా తెలిపేందుకు.. రాష్ట్ర వ్యాప్తంగా హిందుత్వ వాతావరణం వెల్లివిరిసేలా ఈ ఏక్తా యాత్ర నిర్వహిస్తున్నామని చెప్పారు. దాదాపు లక్ష మందికిపైగా ఈ యాత్రకు హాజరయ్యే అవకాశముందన్నారు. మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఇంచార్జిలు, అసెంబ్లీ కన్వీనర్లు, కో కన్వీనర్లతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సంజయ్ మాట్లాడుతూ ''రాజకీయాలకు అతీతంగా పార్టీ బ్యానర్లు, ఫ్లెక్సీల్లేకుండా దీనిని నిర్వహించబోతున్నాం. అసోం సీఎం హిమంత బిశ్వశర్మ, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ చుగ్ హాజరవుతారు. ప్రతి ఒక్క కార్యకర్తతోపాటు, హిందూ ధర్మ రక్షకులంతా ఈ యాత్రలో పాల్గొని హిందూ సంఘటిత శక్తిని చాటాలి'అని కోరారు. అలాగే ఈనెల 11న సంగారెడ్డిలో నిర్వహించే 'నిరుద్యోగ మార్చ్'లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాగా, తమ డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు(జేపీఎస్) రాష్ట్ర వ్యాప్తంగా అండగా నిలవాలని పార్టీ శ్రేణులకు బండి సంజయ్ పిలుపునిచ్చారు. సమ్మె చేస్తున్న జేపీఎస్, ఓపీఎస్‌ల ఇళ్ల వద్దకు, సమ్మె చేస్తున్న ప్రాంతాలకు వెళ్లి సంఘీభావం తెలపాలని ఆదేశించారు.

ఉద్యమకారుల మరణానికి కాంగ్రెసే కారణం: దూదిమెట్ల

మన్సూరాబాద్: తెలంగాణ ఉద్యమకారుల మరణానికి కాంగ్రెస్ పార్టీనే కారణమని, ఉద్యమకారుల కుటుంబాలకు తాము అండగా ఉంటామని రాష్ట్ర షీప్ అండ్ గోట్ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాల్‌రాజ్‌యాదవ్ స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన ద్రోహులు సోమవారం ఎల్బీనగర్‌లోని కాసోజు శ్రీకాంతాచారి విగ్రహానికి నివాళులర్పించి దానిని అపవిత్రం చేశారని మండిపడ్డారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శ్రీధర్, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ మేడి రాజీవ్‌సాగర్, రాష్ట్ర బేవరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవి శ్రీప్రసాద్‌తో కలసి బాలరాజ్ మంగళవారం శ్రీకాంతాచారి విగ్రహాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర సాధనకు కేసీఆర్ నాయకత్వంలో సబ్బండ వర్గాలు పోరాటం చేస్తున్న తరుణంలో కాంగ్రెస్ చేస్తున్న జాప్యంతో శ్రీకాంతాచారి తన ప్రాణాలను బలిచేశారని గుర్తుచేశారు. అలాంటి పార్టీకి చెందిన నాయకులు నేడు శ్రీకాంతాచారి విగ్రహానికి దండలు వేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరమళ్ల రాంనర్సింహ్మగౌడ్, ఉదయ్‌గౌడ్, గౌరి, వెంకటేశ్ పాల్గొన్నారు.

రైతుల బాధలు చూడండి
బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ గడీని వీడి బయటకు వచ్చి.. రైతుల సమస్యలను పట్టించుకోవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. అన్నదాతలు తమ సమస్యలను పట్టించుకునే నాథుడు లేక రోడ్లపైకి వచ్చారని, పోలీసు అధికారుల కాళ్లు మొక్కుతున్నారని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. 'అబ్ కి బార్ – కిసాన్‌కి సర్కార్'అంటే ఇదేనా అని విమర్శించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం పాడైపోతే ప్రభుత్వం నుంచి రైతులకు లభించిన సహకారం ఏదని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలులో జాప్యం జరుగుతోందని, క్వింటాల్‌కు 11 కిలోల తరుగు తీస్తున్నారని ఆరోపించారు. రైతులు మార్కెట్‌లోనే పడిగాపులు పడుతున్నారని, వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదం లేదని విచారం వ్యక్తం చేశారు. కాగా, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సమ్మె చేస్తుంటే, ప్రభుత్వం బెదిరించి పని చేయించుకోవాలని చూస్తోందని విమర్శించారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా రెగ్యులరైజేషన్ చేయాలని కోరితే ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా అమెరికాలో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో మరణించిన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ప్రాంతానికి చెందిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ ఐశ్వర్య కుటుంబాన్ని ప్రవీణ్‌కుమార్ మంగళవారం పరామర్శించారు.

రాష్ట్రాన్ని వెంటాడుతున్న సమస్యలు: కూనంనేని

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రాన్ని అనేక సమస్యలు వెంటాడుతున్నాయని, మతస్వేచ్ఛ ఉన్నప్పటికీ ఇతర అంశాలు ఇబ్బందికరంగా ఉన్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మగ్దూం భవన్‌లో మంగళవారం ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓట్ల రాజకీయాల కోసం శ్రీరామున్ని, హిందూమతాన్ని బీజేపీ అడ్డం పెట్టుకుందని విమర్శించారు. కర్నాటక ఎన్నికల్లో సాక్షాత్తు ప్రధాని మోదీ 'జై బజరంగ్ భళి' పేరుతో ఓట్లు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటకలో బీజేపీ ఓటమి తప్పదని అన్ని సర్వేలు చెబుతున్నాయని స్పష్టం చేశారు. సీపీఐ ప్రజాగర్జన పేరుతో జూన్ 4న కొత్తగూడెంలో 'ఇంటింటికీ సీపీఐ'ముగింపు సభను నిర్వహించనున్నట్టు కూనంనేని వెల్లడించారు.

ఐటీ జాబ్.. పది నెలలుగా వెయిటింగే..!

క్యాంపస్ నియామకాల్లో గందరగోళం
- గతేడాది ఆగస్టులో 25 వేల మందికి ఆఫర్ లెటర్లు.. ఇప్పటివరకు 2,300 మందికే అపాయింట్‌మెంట్ ఆర్డర్లు
- ఫ్రెషర్స్‌ను వెంటాడుతున్న ఆర్థిక మాంద్యం పరిస్థితులు.. బీటెక్ అయ్యాక ఏదైనా కొత్త కోర్సు చేయడమే దిక్కు
- రిక్రూటైన విద్యార్థుల్లో పెరుగుతున్న ఆందోళన

సాక్షి, హైదరాబాద్: కొత్తగా ఐటీ కోర్సులు చేసిన విద్యార్థులకు ఉద్యోగాల అంశం కలవరపెడుతోంది. క్యాంపస్ నియామకాల్లో ఎంపికై ఆఫర్ లెటర్లు వచ్చినా.. ఉద్యోగాల్లో చేరడానికి ఇంకా ఎదురుచూపులు తప్పడం లేదు. చిన్న సంస్థల నుంచి ఐటీ దిగ్గజాల దాకా ఇలాగే వ్యవహరిస్తుండటం.. ఆఫర్ లెటర్లు ఇచ్చి ఏడాది దాటిపోతున్నా ఉద్యోగాల్లో చేర్చుకోకపోవడం తీవ్ర ఆందోళన రేపుతోంది. పారిశ్రామిక వర్గాల లెక్కల ప్రకారం.. గత ఏడాది ఆగస్టులో తెలంగాణలో బహుళజాతి సంస్థలు, అంకుర సంస్థలు, చిన్న ఐటీ కంపెనీలు కలిపి 24,500 మందిని క్యాంపస్ నియామకాల ద్వారా ఎంపిక చేసుకున్నాయి. కానీ ఇందులో ఇప్పటివరకు 2,300 మందికి మాత్రమే నియామక ఉత్తర్వులు వచ్చినట్టు అంచనా. రాష్ట్రంలోని టాప్ టెన్ ఇంజనీరింగ్ కాలేజీల్లో జరిగిన నియామకాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఉద్యోగం వచ్చేసినట్టేనని ఆనందపడ్డ విద్యార్థులు.. క్రమంగా ధైర్యం కోల్పోతున్నారు. గత ఏడాది ఆగస్టులో సాఫ్ట్‌వేర్ కంపెనీలు దేశంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీల్లో క్యాంపస్ నియామకాలు చేపట్టాయని.. పలురకాల పరీక్షల తర్వాత ఆఫర్ లెటర్లు కూడా ఇచ్చాయని, ఆ తర్వాత మరే స్పందనా లేదని ఎంపికైన విద్యార్థులు వాపోతున్నారు.

అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు

నన్ను బీటెక్ 4వ సంవత్సరం మొదటి సెమిస్టర్‌లోనే ఓ కంపెనీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి ఎంపిక చేసింది. రెండో సెమిస్టర్ కాగానే అపాయింట్‌మెంట్ ఆర్డర్ వస్తుందని.. అప్పట్నుంచే శిక్షణ మొదలవుతుందని, వేతనం కూడా ఇస్తామని చెప్పారు. కానీ 10 నెలలు గడిచింది. ఇంతవరకు అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు.

– ప్రవీణ్ వర్మ, హైదరాబాద్, క్యాంపస్ రిక్రూటీ



అంకుర సంస్థలు, చిన్న కంపెనీలు మాత్రం క్యాంపస్ నియామకాల్లో ఎంపిక చేసుకున్నవారిని ఉద్యోగాల్లోకి ఆహ్వానిస్తున్నాయి. కానీ అవసరమైన మేర తక్కువ సంఖ్యలోనే సిబ్బందిని తీసుకుంటున్నాయి. కోవిడ్ తర్వాత ఆశించిన మేర ప్రాజెక్టులు రావడం లేదని.. అందుకే

చిన్న కంపెనీలు తీసుకుంటున్నా..

ఆఫర్ లెటర్ ఇచ్చినా ఉద్యోగాల్లోకి పిలవలేకపోతున్నామని కొన్ని కంపెనీల నిర్వాహకులు చెప్తున్నారు. మరికొన్ని కంపెనీలు కొత్తగా నియామకాలను నిలిపేయడమేగాక.. ఉన్న ఉద్యోగుల వేతనాలు తగ్గించుకుంటున్నాయని అంటున్నారు. గత ఏడాది కాలంలో ప్రపంచవ్యాప్తంగా 570 కంపెనీలు 1.70 లక్షల మంది ఐటీ ఉద్యోగులను తొలగించినట్టు లేఆఫ్స్ ఎఫ్‌వైఐ సంస్థ తమ నివేదికలో వెల్లడించింది.

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనం కొనసాగుతోంది. దీనితో ఐటీ కంపెనీలు కొత్త నియామకాల విషయంలో వెనుకాడుతున్నాయి. అమెరికాలో అత్యధిక ద్రవోల్బణం, స్థిరాస్తి, బ్యాంకింగ్ సంక్షోభం నేపథ్యం

మాంద్యం ప్రభావంతోనే!

లో.. అక్కడ ఆర్థిక వ్యవస్థ గాడిన పడటానికి కనీసం రెండేళ్లు పడుతుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యూరప్ దేశాలు, జపాన్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే దిగ్గజ కంపెనీలు కూడా ఇటీవల ఉద్యోగులను తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. కొత్త నియామకాలు వాయిదా వేస్తూ వస్తున్నాయి.

ఏం చేయాలో అర్థం కావట్లే.

మాది వరంగల్. ఓ ప్రముఖ కాలేజీలో ఇంజనీరింగ్ చేశాను. చివరి సెమిస్టర్‌లో ఉండగా.. మల్టీ నేషనల్ కంపెనీ ఉద్యోగానికి ఆఫర్ లెటర్ ఇచ్చింది. ఇప్పటికీ అపాయింట్‌మెంట్ రాలేదు. ఎన్ని మెయిల్స్ చేసినా స్పందన లేదు. బంధువులకు ముఖం చూపించలేక.. హైదరాబాద్‌లోనే ఉండి కోర్సులు నేర్చుకుంటున్నాను.

– అఖిలేశ్ గౌడ్, క్యాంపస్ రిక్రూటీ, హైదరాబాద్

స్పెషల్ స్కిల్స్ ముఖ్యం

ఇంకో ఏడాది పాటు ఇంజనీరింగ్ విద్యార్థులు క్యాంపస్ నియామకాలపై ఆశలు పెట్టుకోవద్దు. ఎందుకంటే ఆఫర్ లెటర్స్ ఇచ్చిన వారికే నియామకాలు జరగలేదు. ఏఐ, ఎంబెడ్డెడ్ సిస్టమ్స్, మెషీన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్ వంటి నైపుణ్యాలు అభివృద్ధి చేసుకున్న వారికి మాత్రం మార్కెట్ బాగానే ఉంటోంది.

– మిత్రాసేథ్, ఓ ఎంఎన్‌సీ కంపెనీలో ఉన్నతస్థాయి ఉద్యోగి

పర్సనాలిటీ గింత..

పిసికితే ప్రాణం పోద్ది

రేవంత్‌రెడ్డిపై తలసాని తీవ్ర విమర్శలు
- మంత్రి అని లేదు.. ఎమ్మెల్యే అని లేదంటూ మండిపాటు
- ప్రియాంకా గాంధీపైనా విసుర్లు
- కులమతాల మధ్య చిచ్చు పెట్టడం తప్ప బీజేపీ వాళ్లకు వేరే పనిలేదని ధ్వజం

సనత్‌నగర్ (హైదరాబాద్): 'ప్రియాంకా గాంధీ సభలో డిక్లరేషన్ గురించి మాట్లాడతాడు. ఎమ్మెల్యే అని లేదు.. మంత్రి అని లేదు.. వాడు.. వీడు అని మాట్లాడతాడు.. ఉన్న పర్సనాలిటీ గింత.. పిసికితే ప్రాణం పోద్ది.. పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నడు..' అంటూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తీవ్రస్థాయిలో దూషించారు. ప్రియాంకా గాంధీపై కూడా విమర్శలు కురిపించారు. 'మా తాత ఇదుండే..మా అమ్మమ్మ అదుండే.. మా నాయన అది అని ప్రియాంకా గాంధీ చెబుతుంది. మరి 40 సంవత్సరాల పాటు దేశాన్ని, రాష్ట్రాన్ని మీరే పరిపాలించారు కదా..పేద వాళ్ళకు రూ.2 వేల పెన్షన్ ఇవ్వాలని, 24 గంటల కరెంటు, ఇంటింటికీ తాగునీరు ఇవ్వాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వచ్చిన ఆలోచన..మీకు ఎందుకు రాలేదు?..'అని నిలదీశారు. మంగళవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ధనియాలగుట్ట వైకుంఠ ధామం ప్రారంభోత్సవ కార్యక్రమంలో తలసాని పాల్గొని మాట్లాడారు.

ఎక్కడైనా ఇళ్లు మునిగిన పరిస్థితి ఉందా?

'వరదల ఇబ్బందులు గతంలో పరిపాలన చేసిన కాంగ్రెస్ పాపం కాదా? ఎక్కడపడితే అక్కడ



ఆక్రమణలు, నాలాలు మూసుకుపోయిన పరిస్థితులు ఉండేవి. కేసీఆర్ హయాంలో.. వరదలు వచ్చినప్పుడు ప్రజలు ఇబ్బందులు పడకుండా వ్యూహాత్మక నాలా అభివృద్ధి కార్యక్రమం తీసుకోవడం జరిగింది. ఆ తర్వాత గతంలో కంటే ఎక్కువగా వర్షాలు వచ్చాయి. ఎక్కడైనా ఇళ్లు మునిగిన పరిస్థితి ఉందా?..'అని మంత్రి ప్రశ్నించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ముందు వరదలు వస్తే ముఖ్యమంత్రి ఇంటికి పది వేల రూపాయలు చొప్పున ఇచ్చారని తెలిపారు.

నాకు బొట్టు పెట్టడం బీజేపీ వాళ్లు నేర్పిస్తారా?

'ప్రైమ్ మినిస్టర్, వీళ్ల హైదరాబాద్ సిటీలో శ్రీనివాస్‌యాదవ్‌కు కొత్తగా బొట్టు పెట్టడం నేర్పిస్తారా? నేను చిన్నప్పటి నుంచి బొట్టు పెట్టుకుంటున్నా. ప్రధానమంత్రి గానీ, దేశంలో పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు గానీ ఇక్కడి వైకుంఠధామం లాంటిది ఒక్కటైనా కట్టారా? ఎంతకూ కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టాలి.. వైషమ్యాలు, లేనిపోని సమస్యలు సృష్టించాలి. ఇదే పని. జై హనుమాన్, జై బజరంగ్ అంటూ దేవుళ్ల పేర్లు చెప్పడమే తప్ప బీజేపీ నాయకులు ఎక్కడైనా ఒక్క దేవాలయం కట్టారా? అద్భుతమైన యాదాద్రిని నిర్మించిన కేసీఆర్ లాంటి గొప్ప నాయకుడు దేశంలో ఎవరైనా ఉన్నారా?. కాళేశ్వరం ప్రాజెక్టు వస్తుందని ఎవరూ ఊహించలేదు. ఒకప్పుడు నేను రాను బిడ్డో సర్కార్ దవాఖానాకు అనే పరిస్థితి ఉండేది. కేసీఆర్ వచ్చాక నేను పోతాను బిడ్డో సర్కార్ దవాఖానాకు అన్న పరిస్థితి రాష్ట్రంలో వచ్చింది..'అని చెప్పారు.

ప్రజల ప్రభుత్వాన్ని కాపాడుకోవాలి

'చూస్తే అమెరికాలో వైట్‌హౌస్ చూడాలి..లేదా తెలంగాణలో సెక్రటేరియట్ చూడాలి. దేశంలోని నాయకులందరూ అంబేడ్కర్ పేరు చెప్పుకుని ఓట్లు దండుకోవాలని చూస్తారు..కానీ నిజమైన నాయకుడు కేసీఆర్ 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టారు..'అని తలసాని తెలిపారు. ప్రజల కోసం ఆలోచించే ప్రభుత్వాన్ని, నాయకులను కాపాడుకోవాలని అన్నారు. ఎన్నికలు దగ్గరకు వస్తున్నాయి..కొత్త బిచ్చగాళ్లు వస్తుంటారు..ఒక్కసారి అవకాశం ఇవ్వమని అడుగుతుంటారు..పనిచేయని వాడు మనకు అవసరం లేదు. ఎవరైతే మనకు పనిచేస్తారో వారి గురించే ఆలోచన చేయాలని తలసాని విజ్ఞప్తి చేశారు.

నా వ్యాఖ్యలు ఉపసంహరించుకుంటున్నా: తలసాని

ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత విమర్శలు సరికాదని, రాజకీయ పార్టీల నాయకులు విమర్శలు చేసేటప్పుడు హుందాతనంతో వ్యవహరించాలని తలసాని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు, వ్యక్తిగత విమర్శలు చేయడం సమంజసమేనా? అని ప్రశ్నించారు. రేవంత్ అసభ్యకర భాషతో చేసిన విమర్శలతో తాను ఆవేదన చెందానని, ఆ ఆవేదన నేపథ్యంలో చేసిన వ్యాఖ్యలను బాధ్యత కలిగిన మంత్రిగా ఉపసంహరించుకుంటున్నానని చెప్పారు. వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేయడం సరికాదని, ఇకనైనా బాధ్యతగా మాట్లాడదామని సూచించారు.

సమ్మె కొనసాగిస్తాం

- టీపీఎస్ఎఫ్ నిర్ణయం.. జేపీఎస్‌లు విధుల్లో చేరాల్సిందేనంటున్న పీఆర్ శాఖ అధికారులు
- సర్వీసులు రెగ్యులరైజ్ చేస్తేనే వస్తామంటున్న జేపీఎస్‌లు

సాక్షి, హైదరాబాద్: అటు ప్రభుత్వం, ఇటు జూనియర్ పంచాయతీ సెక్రెటరీలు (జేపీఎస్) పట్టువిడుపులు ప్రదర్శించడం లేదు. సమ్మె విరమించి కచ్చితంగా విధుల్లో చేరాల్సిందేనని పంచాయతీరాజ్ (పీఆర్)శాఖ ఉన్నతాధికారులు పట్టుబడుతుండగా, తమ సర్వీసులు రెగ్యులరైజ్ చేసి, తాము పని చేసిన నాలుగేళ్లను ప్రొబేషనరీ పీరియడ్‌గా పరిగణిస్తామని హామీనిస్తే విధుల్లో చేరతామని జేపీఎస్‌లు స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జేపీఎస్‌లు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారానికి 13వ రోజుకు చేరుకోనుంది. మంగళవారం సాయంత్రం 5 గంటలలోగా విధుల్లో చేరకపోతే ఉద్యోగాల్లోంచి తొలగిస్తామని పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి ప్రకటించినా తెలంగాణ పంచాయత్ సెక్రెటరీ ఫెడరేషన్ (టీపీఎస్ఎఫ్) సమ్మె కొనసాగించాలని నిర్ణయించింది. మంగళవారం కూడా దాదాపుగా అన్ని జిల్లాల్లో పలువురు జేపీఎస్‌లు, ఔట్‌సోర్సింగ్ సెక్రెటరీలు నిరసనల్లో పాల్గొన్నారు. ప్రభుత్వం విధించిన గడువు ముగిసే సమయానికి దాదాపు 400 మంది వరకు జేపీఎస్‌లు విధుల్లో చేరారని అధికార వర్గాలు అంచనా వేస్తుండగా, తమకున్న సమాచారం ప్రకారం దాదాపు 200 మంది సమ్మె విరమించారని టీపీఎస్ఎఫ్ వర్గాలు చెబుతున్నాయి. జిల్లాల వారీగా జేపీఎస్‌ల చేరికలకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించి పీఆర్ కమిషనరేట్‌కు పంపించే బాధ్యతను జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. జేపీఎస్‌లు విధుల్లో చేరేలా పలు జిల్లాల కలెక్టర్లు తమ వంతు ప్రయత్నాలు చేశారు. మంగళవారం అర్ధరాత్రి వరకు విధుల్లో చేరే వారికి కూడా అవకాశం కల్పించినట్టు తెలుస్తోంది. విధుల్లో చేరినవారి సంఖ్యపై బుధవారం స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు. మరో పక్క ప్రభుత్వపరంగా తొలగింపు ఉత్తర్వులు ఇవ్వడమో, ఇతరత్రా ఆదేశాలు ఇవ్వడం మొదలు పెట్టడం, లేదా దీనికి సంబంధించిన ఏవైనా ఉత్తర్వులు జారీ కావడాన్ని బట్టి తమ తదుపరి కార్యాచరణ ఉంటుందని టీపీఎస్ఎఫ్ ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఏవైనా నోటీసులు అందిన పక్షంలో వాటిపై ఎలా స్పందించాలనేది ఆలోచిస్తామని వారు చెప్పారు. కాగా, విధుల్లో చేరాలని జేపీఎస్‌లను ఒప్పించేందుకు ప్రయత్నిస్తున్నందున, మరికొంత సమయం ఇవ్వాలని కొన్ని జిల్లాల నుంచి కమిషనరేట్‌కు విజ్ఞప్తులు చేసినట్టు చెబుతున్నారు. ఇదిలా ఉంటే కొన్ని జిల్లాల్లో మంగళవారం నిరసన శిబిరానికి వచ్చి సమ్మెలో పాల్గొన్న వారి పేర్లను కూడా అధికారులు విధుల్లో చేరిన వారి జాబితాలో చేరుస్తున్నారని జేపీఎస్‌లు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు.

బానిసల కంటే దారుణంగా జేపీఎస్‌ల పరిస్థితి

- సీఎం కేసీఆర్‌కు రేవంత్ లేఖ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి బానిసల కంటే హీనంగా తయారైందని, వారితో గొడ్డు చాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వం వారి హక్కులను రక్షించడంలో మాత్రం విఫలమైందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి విమర్శించారు. గత 12 రోజులుగా జేపీఎస్‌లు సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు మంగళవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. కేవలం జేపీఎస్‌ల కష్టంతోనే రాష్ట్రంలోని గ్రామపంచాయతీలకు 79 అవార్డులు వచ్చాయనే విషయాన్ని మర్చిపోవద్దని, వారి సర్వీసులను రెగ్యులరైజ్ చేయకుండా ఉద్యోగాల నుంచి తీసేస్తామని అంటున్నారని, వారికి మీరిచ్చే రివార్డు ఇదేనా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని, లేదంటే కాంగ్రెస్ వారి పోరాటానికి మద్దతుగా ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమవుతుందని సీఎం కేసీఆర్‌కు రాసిన బహిరంగలేఖలో రేవంత్ వెల్లడించారు.

జేపీఎస్‌లు వెంటనే విధుల్లో చేరండి : ఎర్రబెల్లి



తొర్రూరు: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె విరమించకుండా ఉద్యోగాలు కోల్పోయి జీవితాలు పాడు చేసుకోవద్దని, వెంటనే విధుల్లో చేరాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆయన జేపీఎస్‌ల సమ్మెపై స్పందించారు. జేపీఎస్‌లు ఉద్యోగంలో చేరే సమయంలోనే సమ్మెలో పాల్గొనబోమని, యూనియన్లు పెట్టబోమని బాండు రాసిచ్చారని తెలిపారు. పని చేసుకుంటూ పోతే ప్రభుత్వమే వారిని క్రమబద్ధీకరించేదని, అది వినకుండా సమ్మెకు దిగారన్నారు. కోర్టుకు వెళ్లేందుకు సైతం జూనియర్ కార్యదర్శులకు అవకాశం లేదన్నారు. వారి సమస్యలను పెద్ద మనసుతో సీఎం కేసీఆర్ పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

సీఎం ప్రధాన సలహాదారుగా సోమేశ్‌కుమార్

- మాజీ సీఎస్‌కు కేబినెట్ హోదాతో కూడిన కీలక పదవి
- మూడేళ్లపాటు పదవిలో ఉండేలా ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కీలక పదవి అప్పగించారు. ఆయనను సీఎం ప్రధాన సలహాదారుగా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేబినెట్ హోదాతో కూడిన ఈ ప్రధాన సలహాదారు పదవిలో ఆయన మూడేళ్లపాటు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దాదాపు మూడేళ్లపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన సోమేశ్‌కుమార్, హైకోర్టు ఆదేశాల మేరకు గత జనవరి 12న ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు బదిలీ అయ్యారు. ఆయన అక్కడ జాయిన్ అయినా.. ఆ తరువాత స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారు. ఏపీతోపాటు కేంద్ర ప్రభుత్వం దానిని ఆమోదించింది. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ చైర్మన్‌గా నియమితులవుతారని, ఆయన ఆ పదవికి దరఖాస్తు కూడా చేసుకున్నట్లు ప్రచారం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా సోమేశ్‌కుమార్ పనిచేసిన సమయంలో చేపట్టిన పలు కార్యక్రమాలను సీఎం కేసీఆర్ పలుమార్లు బహిరంగ వేదికలపైనే ప్రశంసించారు. ఈ నేపథ్యంలోనే సోమేశ్ కుమార్‌కు కీలకమైన బాధ్యతలు అప్పగించారు.



బడంగ్‌పేటలో భట్టి విక్రమార్క పాదయాత్ర

ప్రశ్నిస్తే కేసులు.. నిలదీస్తే నిర్బంధాలు

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- మహేశ్వరం నియోజకవర్గంలో కొనసాగిన పాదయాత్ర

సాక్షి రంగారెడ్డి జిల్లా: బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రశ్నిస్తే కేసులు.. నిలదీస్తే నిర్బంధాలు అమలు చేస్తున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మండిపడ్డారు. రాజధాని నడిబొడ్డున భయంకరమైన రాజ్యహింసను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ధ్వజమెత్తారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని మీర్‌పేట, బడంగ్‌పేట మీదుగా ఆయన చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర కొనసాగింది. బడంగ్‌పేట్‌లో భట్టి మీడియాతో మాట్లాడుతూ.. కోరి తెచ్చుకున్న తెలంగాణలో నిశ్శబ్దంగా రాజ్యహింస అమలు చేయడం దురదృష్టకరమన్నారు. ఈ విషయమై మేధావులు గొంతెత్తాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో పేదలకు భూములు పంపిణీ చేస్తే.. బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని లాక్కొంటోందని ఆరోపించారు. గత ప్రభుత్వాలు పంపిణీ చేసిన భూములను లాక్కునే హక్కు ఈ ప్రభుత్వానికి లేదన్నారు. సామాజిక బాధ్యత కలిగిన రాజకీయ పార్టీలు నోరు మెదపకపోవడం బాధాకరమని చెప్పారు. ఒక్క ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోనే 5 లక్షల కోట్ల విలువైన 10 వేల ఎకరాలను, హైదరాబాద్ చుట్టూ 25 లక్షల కోట్ల విలువైన పేదల భూములను ఈ ప్రభుత్వం లాక్కుందని ఆరోపించారు. కందుకూరు మండలంలో ఫార్మాసిటీ కంపెనీ పేరుతో ఐదొందల ఎకరాలు, మరో 4 వందల ఎకరాలు బఫర్ జోన్‌లో ఈ ప్రభుత్వం తన వద్ద ఉంచుకుందన్నారు. 'మేము అధికారంలోకి వచ్చాక బలవంతంగా లాక్కున్న భూముల్లో లబ్ధిదారులతో దున్నిస్తాం. ఇంటి స్థలాలను పంపిణీ చేస్తాం. కట్టిన ఇళ్లు పంపిణీ చేయకుండా ఉంటే గృహప్రవేశం చేయిస్తాం'అని భట్టి చెప్పారు.

భూములను కొల్లగొట్టడానికే ధరణి: గద్దర్

పేదల భూములను కొల్లగొట్టడానికే సీఎంకేసీఆర్ ధరణి పోర్టల్‌ను తెచ్చారని ప్రజా గాయకుడు గద్దర్ ఆరోపించారు. కేసీఆర్ పాలనలో కట్టింది కూలగొట్టు, కమీషన్లు కొట్టు, ఎన్నికల్లో పంచు, గద్దెనెక్కు అన్న చందంగా నడుస్తోందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రశ్నించేవారు లేరని, ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని హెచ్చరించారు.

దురహంకారానికి నిదర్శనం

- తలసానిపై కాంగ్రెస్ నేతల ఫైర్
- వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిలనుద్దేశించి రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. మంత్రి చేసిన వ్యాఖ్యలు ఆయన దురహంకారానికి నిదర్శనమని, వెంటనే తన వ్యాఖ్యలు ఉపసంహరించుకుని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌నుద్దేశించి తలసాని చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలు ఆయన చేతగాని, చేవ లేనితనానికి నిదర్శనమని అన్నారు. రేవంత్ విమర్శల నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో చెప్పకుండా వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారంటేనే వారు ఏమీ చేయనట్టు అర్థమవుతోందని ఎద్దేవా చేశారు.

తల బిరుసుతనానికి తగిన బుద్ధి చెప్తారు: మల్లు రవి



గాంధీ కుటుంబంపై, రేవంత్‌రెడ్డిపై తలసాని చేసిన వ్యాఖ్యలను మాజీ ఎంపీ మల్లు రవి ఖండించారు. చెప్పుకోవడానికి ఏమీ లేని వాళ్లే వ్యక్తిగత విమర్శలు చేస్తారన్నారు. తలసాని తల బిరుసుతనానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని, దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబానికి చెందిన ప్రియాంక గాంధీని విమర్శించడం ఆకాశం మీద ఉమ్మివేయడమేనని పేర్కొన్నారు.

తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుంది: బల్మూరి వెంకట్



'మంత్రి తలసాని ఏరోజైనా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాడా? భరోసా కల్పించకుండా మోసం చేసినందుకే యువత మాతో కలిసి ఉద్యమిస్తోంది. మా నాయకులను తిడితే తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుంది..'అని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ హెచ్చరించారు. తలసాని, కేటీఆర్ చేసిన ప్రకటనలు ఉపసంహరించుకుని బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, లేదంటే ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు అడుగడుగునా వారిని అడ్డుకుంటారని తెలిపారు.

ఎవరి దమ్ము ఏంటో రాబోయే రోజుల్లో తెలుస్తుంది: సునీతారావు

రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి ఆ విధంగా మాట్లాడడం సరికాదని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు హితవు పలికారు. రాబోయే రోజుల్లో ఎవరి దమ్ము ఏంటో తెలుస్తుందని, ముందు ప్రియాంక, రేవంత్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ నేతలను బెదిరించాలని చూస్తే ఊరుకోబోమని టీపీసీసీ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు.

నా కూతురును అడ్డం పెట్టుకుని కుట్రలు : ముత్తిరెడ్డి



జనగామ: 'నా కూతురు ఎక్కడా భూములను కబ్జా చేయలేదు.. కేవలం లీజు అగ్రిమెంటు మార్చుకున్నారు. చేర్యాల భూమి విషయంలో కొందరు కావాలనే బద్‌నాం చేస్తున్నారు'అని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. హైదరాబాద్ ఉప్పల్ పీఎస్‌లో తమ కూతురు తనపై ఫిర్యాదు చేసినట్లు వచ్చిన వార్తలపై ఆయన స్పందించారు. మంగళవారం జనగామలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. 2014, 2018 ఎన్నికల సమయంలో కూడా తనపై అనేక కుట్రలు, కుతంత్రాలు జరిగాయన్నారు. అయినా సీఎం కేసీఆర్ టికెట్ ఇచ్చి ఆశీర్వదించగా, ప్రజలు భారీ మెజారిటీతో అక్కున చేర్చుకున్నారన్నారు. ఈసారి కూడా ఎన్నికలు దగ్గర పడుతుండడంతో రాజకీయ ప్రత్యర్థులు తన కూతురును అడ్డం పెట్టుకుని ఈ రకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఉప్పల్ పీఎస్‌లో కూతురు తనపై ఫిర్యాదు చేసిన మాటవాస్తవమే అన్నారు. హబ్సిగూడలోని స్వాగత్ గ్రాండ్ భవనం తన కూతురు పేరిటనే ఉందని, కిన్నెర గ్రాండ్ అని పేరు మారడంతో.. లీజు అగ్రిమెంటు మాత్రమే మార్చుకున్నట్లు తెలిపారు. ఆ భవనం తన కూతురు పేరిటనే ఉందని, ఇందులో ఎటువంటి అపోహలు, సందేహాలు అవసరం లేదన్నారు. లీజు అగ్రిమెంటు సమయంలో తనకు సమాచారం లేకుండా చేశారని తమ కూతురు ఫిర్యాదు చేస్తే, భూమిని కబ్జా చేసినట్లు రాజకీయ ప్రత్యర్థులు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు.



కోపాన్ని శాంతంతో జయించాలి. చెడ్డతనాన్ని మంచితనంతో జయించాలి. అల్పత్వాన్ని ఉదారగుణంతో జయించాలి. నిజాయితీలేమిని సత్యంతో జయించాలి.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 10 మే 2023

పాక్ సైన్యం ఆగడం

రాజకీయంగా తానే పెంచి పోషించి ప్రధానిగా చేసిన ఇమ్రాన్‌ఖాన్ తనపైనే తిరుగుబాటు చేయడాన్ని జీర్ణించుకోలేక నిరుడు ఏప్రిల్‌లో పదవీభ్రష్టుణ్ణి చేసిన సైన్యం చివరకు మంగళవారం ఆయన్ను అరెస్టు చేసి పగ చల్లార్చుకుంది. అధికారం పోగానే అవినీతి, ఉగ్రవాదం, మత దూషణ, హత్య, హింసాకాండను ప్రోత్సహించటం వంటి 140 ఆరోపణల్లో చిక్కుకుని వీలుదొరికినప్పుడల్లా తమపై విరుచుకుపడుతున్న ఇమ్రాన్‌పై సైన్యం ఆగ్రహావేశాలతో రగిలిపోతోంది. అదును కోసం ఎదురుచూస్తోంది. కొన్ని కేసుల్లో బెయిల్ తెచ్చుకుని ఒక అవినీతి ఆరోపణ కేసులో ఇస్లామాబాద్ హైకోర్టుకు హాజరైన ఇమ్రాన్‌ను ఆ కోర్టు ప్రాంగణంలోని గది తలుపులు బద్దలుకొట్టి పారామిలిటరీ బలగాలు తీసుకుపోగలిగాయంటే సైన్యం ఎంత బరితెగించిందో అర్థమవుతుంది. 'ఇది చట్టవిరుద్ధం కాదా? ఇది న్యాయవ్యవస్థ స్వతంత్రతపైనా, న్యాయస్థానంపైనా దాడి కాదా?' అంటూ ఇస్లామాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆమర్ ఫరూక్ ఆక్రోశించటం అక్కడి పరిస్థితికి అద్దం పడుతుంది. జనరల్ ముషార్రఫ్ ఏలుబడిలో దానికి వ్యతిరేకంగా దృఢంగా నిలబడిన న్యాయవ్యవస్థ ఇప్పుడు జస్టిస్ ఫరూక్ ఆక్రోశాన్ని వింటుందా, సైన్యంతో తలపడటానికి సిద్ధపడుతుందా అన్నది చూడాలి. నిరుడు నవంబర్‌లో జరిగిన హత్యాయత్నం నుంచి ఇమ్రాన్ క్షేమంగా బయటపడగా అప్పటినుంచీ పాక్ సైన్యం తనను చంపడానికి కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపిస్తున్నారు. తన అరెస్టుకు ముందు ఆయన ఒక వీడియో కూడా విడుదల చేశారు. నిరాధారమైన ఆరోపణలు చేయొద్దని పాక్ సైన్యం హెచ్చరించిన కొన్ని గంటలకే ఇమ్రాన్ అరెస్టయిన తీరు చూస్తే ఆ దేశం ఇంకా ఆటవిక న్యాయంలోనే బతుకీడుస్తోందని తెలుస్తుంది.

అధికారంలో ఉన్నవారిని కూలదోయటం, నచ్చినవారిని అందలం ఎక్కించటం సైన్యానికి కొత్తగాదు. అలాగే తమ బద్ధ శత్రువులుగా మారినవారిని అంతమొందించేందుకు కూడా వెనకాడదు. ఇందుకు మాజీ ప్రధానులు జుల్ఫికర్ అలీ భుట్టో, ఆయన కుమార్తె బేనజీర్ భుట్టో ఉదాహరణలు. భుట్టోను ఒక హత్యకేసులో ఇరికించి విచారణ తంతు నడిపించి 'చట్టబద్ధంగా' ఉరితీస్తే, బేనజీర్‌ను ఎన్నికల ర్యాలీలో ఉండగా కాల్చిచంపారు. పాకిస్తాన్ ఏర్పడ్డాక దాదాపు పదేళ్లు ఏదోమేరకు సవ్యంగానే గడిచింది. కానీ ఎన్నికైన ప్రభుత్వంపై 1958లో తొలిసారి అప్పటి సైనిక దళాల చీఫ్ జనరల్ అయూబ్ ఖాన్ తిరుగుబాటు చేసి అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడు. ఆ తర్వాత జనరల్ యాహ్యాఖాన్, జనరల్ జియావుల్ హక్, జనరల్ పర్వేజ్ ముషార్రఫ్‌లు ఆ తోవనే పోయారు. మధ్య మధ్య పౌర ప్రభుత్వాలు ఏర్పడినా అవన్నీ అల్పాయుష్షు సర్కారులే. బేనజీర్ భుట్టో మూడు దఫాలు ప్రధానిగా చేసినా ఎప్పుడూ పూర్తి కాలం కొనసాగలేకపోయారు. ఆమాటకొస్తే నవాజ్ షరీఫ్ ఎంతోకొంత నయం. ఆయన తొలిసారి ప్రధాని అయిన కొంతకాలానికే ముషార్రఫ్ సైనిక తిరుగుబాటు జరిపి ప్రభుత్వాన్ని కూలదోశారు. చివరకు అంతర్జాతీయంగా ఒత్తిళ్లు పెరగటంతో 2008లో ఎన్నికలు నిర్వహించక తప్పలేదు. అప్పటినుంచీ సైన్యం పంథా మార్చుకుంది. అందువల్లే ఆ సంవత్సరం జరిగిన ఎన్నికల్లో అధికారంలోకొచ్చిన పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ అయిదేళ్లూ నిరాటంకంగా పాలించింది. అనంతరం 2013 ఎన్నికల్లో నెగ్గిన నవాజ్ షరీఫ్ సైతం పూర్తికాలం అధికారంలో కొనసాగారు. అలాగని ఆయన నిర్భయంగా పాలించారనడానికి లేదు. సైన్యం నీడలోనే పాలన సాగింది. భారత్‌తో చెలిమికి ఆయన ప్రయత్నించినప్పుడల్లా చొరబాటుదార్లను మన దేశంలో ప్రవేశపెట్టి విధ్వంసాలకు దిగటం, అధీనరేఖ వద్ద కాల్పులు జరపటం సైన్యానికి పరిపాటయింది. జనంలో అంతగా పలుకుబడిలేని ఇమ్రాన్ నేతృత్వంలోని పాకిస్తాన్ తెహ్రీకే ఇన్సాఫ్(పీటీఐ)కు అండదండలందించి 2018 ఎన్నికల్లో ఆ పార్టీ విజయానికి దోహదపడింది. ఆ ఎన్నికల్లో సైన్యం జరిపిన రిగ్గింగ్ వల్లే అదంతా సాధ్యమైందని ఆరోపణలొచ్చాయి. కానీ మూడేళ్లు గడిచేసరికే ఇద్దరికీ చెడింది. నిరుడు ఏప్రిల్‌లో తెరవెనక తతంగం నడిపి విపక్షాలను ఏకంచేసి ఇమ్రాన్‌పై జాతీయ అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానం నెగ్గేలా చేసి ఆయన్ను పదవి నుంచి దించగలిగింది.

సైన్యం సాగించిన దౌష్ట్యాన్ని సామాజిక మాధ్యమాల్లో, కొన్ని చానెళ్లలో చూసిన పాక్ భగ్గుమంటోంది. పలు నగరాలు, పట్టణాలు నిరసనలతో హోరెత్తుతున్నాయి. లాహోర్‌లోని సైనిక కోర్ కమాండర్ నివాసంపై ఆందోళనకారులు దాడి చేయగా, అనేకచోట్ల విధ్వంసం చోటుచేసుకుంది. సైనిక తిరుగుబాటులో అధికారం చేజిక్కించుకుని, బూటకపు ఎన్నికల్లో దేశాధ్యక్షుడైన జియా తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవటానికి మతోన్మాదాన్ని ప్రోత్సహించిన నాటినుంచీ పాక్‌లో మతానిది పైచేయి అయింది. ఆ తర్వాత అధికారంలోకొచ్చినవారు సైతం ఆ బాటనే పోతున్నారు. మరోపక్క దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఐఎంఎఫ్ నుంచి రావాల్సిన 650 కోట్ల డాలర్ల రుణం గత నవంబర్‌నుంచి పెండింగ్‌లో పడింది. వచ్చే నెలలో అది మురిగిపోతుంది. ఇక విదేశీ మారక ద్రవ్యం నిల్వలు పాక్ వద్ద 445 కోట్ల డాలర్లు మించి లేవు. ఆ మొత్తం మహా అయితే ఒక నెల దిగుమతులకు సరిపోతుంది. ఈ సంక్షోభాన్ని అధిగమించడ మెలాగో తెలియక ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్ అయోమయంలో కూరుకుపోగా, సైన్యం ఇమ్రాన్ జోలికిపోయి చేజేతులా మంట రాజేసింది. తాజా పరిణామాల పర్యవసానంగా అది సైనిక పాలనలోకి జారుకున్నా ఆశ్చర్యం లేదు. మన పొరుగునున్న దేశం కనుక మనం అత్యంత అప్రమత్తంగా ఉండకతప్పదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: బ.పంచమి ప.3.24 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: పూర్వాషాఢ సా.5.34 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: రా.1.22 నుండి 2.54 వరకు, దుర్ముహూర్తం: ప.11.31 నుండి 12.21 వరకు, అమృతఘడియలు: ప.1.22 నుండి 2.52 వరకు

సూర్యోదయం : 5.35
సూర్యాస్తమయం : 6.17
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

చర్చకు తావిచ్చే బోధన లేకపోతే...

విశ్లేషణ



అవిజిత్ పాఠక్

ఎంపిక చేసిన అధ్యాయాలను, పేరాలను, చిత్రణలను ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల నుంచి తొలగించడానికి జ్ఞాన రాజకీయాలే దారి తీశాయి. కానీ అసలు సమస్యను విస్మరిస్తున్నాం. తరగతి గదులు ప్రేరణారహితంగా ఉండిపోవడాన్ని మనం విస్మరిస్తున్నాం. పాఠంలో పొందుపర్చిన జ్ఞాన గుళికను విద్యార్థులకు అందించడం కంటే మించిన పాత్ర టీచర్‌కి ఏమీ ఉండటం లేదు. ఘనీభవించిన పదాలను కంఠస్థం చేసే కళలో విద్యార్థులు నైపుణ్యం సాధించేలా చేయాలని టీచర్లను కోరుతున్నారు. కమలా దాస్ కవిత్వం, ఆర్కే లక్ష్మణ్ కార్టూన్ వంటి వాటిని బోధనా సాధనంగా చేసినప్పటికీ అవి కేవలం రెండు మార్కుల ప్రశ్నగా మాత్రమే కుదించబడతాయి. అర్థవంతమైన విద్య అంటే పాఠ్యపుస్తకాన్ని దాటి విద్యార్థిని ఎదిగేలా చేయాలి.

భావజాలం, కరిక్యులమ్‌కి చెందిన గతిశాస్త్రం గురించి ఇప్పటికే చాలా చాలా చర్చ జరిగింది. ఎంపిక చేసిన అధ్యాయాలను, పేరాలను, చిత్రణలను, సమాచారాన్ని ఎన్‌సీఈఆర్టీ స్కూల్ పాఠ్యపుస్తకాల నుంచి తొలగించడానికి జ్ఞాన రాజకీయాలే దారి తీశాయి. రాజకీయంగా చేపట్టిన ఈ తొలగింపుపై ఉదారవాద వామపక్ష అకడెమిక్ సమాజం తన ఆగ్రహాన్ని, విచారాన్ని వ్యక్తం చేయగా, ఈ విషపూరిత సమయాల్లో ఎన్‌సీఈఆర్టీని నడుపుతున్న విద్యావిషయకమైన ఉన్నతాధికార వర్గం... హేతుబద్ధీకరణ పేరిట లేదా విద్యాపరమైన భారాన్ని తగ్గించడం, తీవ్ర ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులకు కాస్త ఉపశమనం కలిగించడం పేరిట ఈ చర్యను చట్టబద్ధం చేసింది.

అయితే, ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలపై చర్చ తరగతి గది కమ్యూనికేషన్ నిజవాస్తవికతను మర్చిపోతున్నట్లు కనిపిస్తోంది. అవును, ఈ చర్చలో, జ్ఞాన విషయాలను నిర్వచించి, తీర్చిదిద్దడానికి హిందుత్వం దాని ఆధిపత్యపు త్వరిత లక్షణం వేగంగా పెరుగుతుండటంలోని ఆసక్తికరమైన ప్రతిఫలనాలను చూశాం. వీటన్నింటికి మించి, మన పిల్లలు ఏది నేర్చుకోవాలి, ఏది నేర్చుకోకూడదు అనే అంశాన్ని కొత్త బాస్‌లు నిర్ణయించే అధికారం కలిగి ఉన్నందున, అతి జాతీయవాద సిద్ధాంతకర్తలు ఉదారవాద వామపక్ష చరిత్రకారులను, సామాజిక శాస్త్రజ్ఞులను పక్కకు పెడుతున్న అధికార మార్పిడి పర్యవసానాలను కూడా అనుభూతి చెందాం.

తమతమ రాజకీయ దృక్పథాలు ఏవైనప్పటికీ మన అకడమిక్ బాస్‌లు కిక్కిరిసిపోయిన తరగతి గదుల్లో బోధన, అభ్యాసానికి చెందిన మూసపోత చర్యపై తగినంత శ్రద్ధ పెట్టలేదని అంగీకరించడానికి తగినంత నిజాయితీని మనం కలిగివుండాలి. నిజానికి, పాఠశాల అధ్యాపకులు కేవలం మధ్యవర్తుల పాత్రకు పరిమితమయ్యారు. టీచర్లు చెప్పేదేమీ ఉండదు, వారి విద్యార్థులు కూడా ఖాళీ పాత్రల్లాగ ఉండిపోతున్నారు. పైగా, పాఠ్యపుస్తకాల స్వభావాన్ని ప్రతిఫలించే కరిక్యులమ్ రూపకల్పనలో లేదా తగిన బోధనా కళను వికసింప చేయడంలో ఎలాంటి కీలకపాత్రను పోషించడానికి కూడా వారిని ప్రోత్సహించడం లేదు. యూనివర్సిటీ ప్రొఫెసర్లు, స్కాలర్లు, ఉదార వాద మేధావులు వంటి పెద్ద హోదాకలిగిన వారు లేదా వర్తమాన భారత్‌లో మితవాద సిద్ధాంతకర్తలు పాఠశాల కరిక్యులమ్‌లో దేనిని పొందుపర్చాలనే విషయాన్ని నిర్ణయిస్తున్నారు.

పాఠంలో పొందుపర్చిన జ్ఞాన గుళికను విద్యార్థులకు అందించడం కంటే మించిన పాత్ర టీచర్‌కి ఏమీ లేదని భావిస్తున్నారంటే ఆశ్చర్యపడాల్సింది ఏమీ లేదు. ఘనీభవించిపోయిన పదాలను కంఠస్థం చేసే కళలో విద్యార్థులు నైపుణ్యం సాధించేలా చేయాలని టీచర్లను కోరుతున్నారు. వల్లె వేయడం కంటే మరే ప్రాధాన్యతా లేని, ఏమాత్రం కల్పనాశక్తి లేని సమాధానాలను వారిచేత రాయించాలని



మాత్రమే సూచిస్తున్నారు. పైగా, పాఠ్యపుస్తక నిరంకుశత్వం (లేదా వ్యూహాత్మక ఎంపికలాగా, గైడ్ బుక్స్) ఏది విలువైన బోధనో నిర్వచిస్తున్నప్పుడు, సిలబస్‌కి వెలుపల మరేదీ లేనప్పుడు, అధ్యాపక సృజనాత్మక వ్యవస్థ మెల్లగా కృశించిపోవడానికే దారితీస్తుంది.

అంతకుమించి, బ్రెజిలియన్ విద్యావేత్త పౌలో ఫ్రియరీ చెప్పినట్లుగా, విద్యను ప్రధానంగా అధికారిక సిలబస్‌పై ఆధారపడిన పరీక్షలతో సమానం చేసి చూసే వ్యవస్థ... సమస్యలను ఎత్తిచూపే విద్యగా ఉంటుంది. ఇది విద్యా కళను ప్రాక్టీస్ చేసే టీచర్లను, విద్యార్థులను ప్రేరణా రహితులుగా చేస్తుంది. అందుచేత మహాత్మాగాంధీని చంపిన నాథూరాం గాడ్సే రాజకీయాలను యువ అభ్యాసకులు తెలుసుకోకూడదని మెరుగులు దిద్దిన ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకం భావిస్తున్నట్లయితే దాన్ని అలాగే చేయనివ్వండి. టీచర్, విద్యార్థి ఇరువురూ పాఠాన్ని దాటి తదుపరి విచారణ, పరిశీలనకు ప్రయత్నించి, ఆ పుస్తకం 'పవిత్రత'ను వివాదాస్పదం చేయడం, పాఠం దాచి పెట్టిన విషయం ఏమిటని చూడవలసిన అవసరం ఏమిటి? ఉదాహరణకు, ఎమర్జెన్సీ బీభత్సం, 2002 గుజరాత్ అల్లర్లు రేపిన హింసాకాండ, అభివృద్ధికీ, నిరాశ్రయులకూ సంబంధించిన సమస్య, నర్మదా బచావ్ ఆందోళన లేవనెత్తిన పర్యావరణ సమస్య వంటి సిలబస్‌కు వెలుపల ఉన్న వాటిని తెలుసుకోవడానికి వారెందుకు ఆరాటపడాలి?

పాఠ్యపుస్తకాలపై మితవాద దాడిని విమర్శించడానికి చాలా కారణాలు ఉంటున్నప్పటికీ, మన క్లాసు రూమ్‌లలో పరావర్తన రహిత, సంభాషణకు తావులేని ప్రస్తుత విద్యాభ్యాసంలో రొమిల్లా థాపర్, కృష్ణకుమార్ వంటి విద్యావేత్తల దృక్పథాలను ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో పొందుపర్చినప్పటికీ, వాటిని మౌలికంగా మార్పులకు గురిచేయవచ్చు. నిజానికి, ఎమ్‌సిక్యూ(బహుళైచ్ఛిక)–కేంద్రక ప్రామాణీకృత పరీక్షల యుగంలో లేదా బోర్డు పరీక్షల్లో 99 శాతం మార్కుల సాధనకోసం మానసిక ఒత్తిడి ఉంటున్న యుగంలో ప్రతి ఒక్కటీ తలకిందులుగా మారుతుంది. పాబ్లో నెరూడా లేక కమలా దాస్ కవిత్వం, లేదా ఆర్కే లక్ష్మణ్ కార్టూన్ వంటి వాటిని బోధనా సాధనంగా చేసినప్పటికీ అవి కేవలం రెండు మార్కుల ప్రశ్నగా మాత్రమే కుదించబడతాయి. వల్లె వేసే విద్యాభ్యాసం ద్వారా అవి సత్వరం వినియోగమయ్యే సరుకులుగా మారతాయి. ఒక విషయాన్ని అంగీకరించాలి. చింతనాపరులు, సమర్థులైన పరిశోధక విద్యార్థులు లేదా సృజనాత్మక మనస్సులతో పనిలేకుండా యాంత్రికంగా టాపర్ల ఉత్పత్తిని ఆరాధించే వ్యవస్థ ఇక్కడ ఉంది.

బోధనా వృత్తిలో, ప్రత్యేకించి పాఠశాల బోధనా వృత్తిలో నిజంగా స్ఫూర్తికలిగిన వ్యక్తులను రూపొందించడం, రిక్రూట్ చేయడం గురించి ఎవరు పట్టించుకుంటున్నారు? సృజనాత్మకంగా సూక్ష్మ విమర్శనాత్మక బోధన అభ్యాసం గురించి, గాంధీ లేదా సావర్కర్, ఔరంగజేబ్ లేదా శివాజీపై వామపక్ష లేదా మితవాద పక్ష పాఠాల విషయాలను దాటి చూడటానికి సాహసమున్న వారి గురించి ఎవరు పట్టించుకుంటున్నారు?

దీనికి బదులుగా, టీచర్స్‌ని ప్రోత్సహిస్తూ, ప్రతి పిల్లాడినీ ప్రభావితం చేసే సంభావ్యతను, ఉద్ధరణ వాద విద్యలోని సంభాషణ, సంక్లిష్ట చింతన ప్రభావాన్ని విశ్వసించే వ్యవస్థ కోసం మనం ప్రయత్నించాల్సిన అవసరం ఉంది. విద్యార్థులు, టీచర్లు సంభాషిస్తూ, చర్చించుకుంటూ, అధికారిక సిలబస్‌ను దాటి చూసేటటువంటి సజీవమైన, శక్తిమంతమైన తరగతి గదిని ఊహించుకోండి. భగత్ సింగ్ డైరీని చదవమంటూ ఎనిమిదవ తరగతి విద్యార్థులకు చెబుతున్న టీచర్‌ని, 1947–48లో గాంధీ ప్రార్థనల సమావేశాలపై వ్యాసం రాయాలని కోరే టీచర్‌ని, లేదా మాంటో రాసిన కథనాన్ని ప్రతిఫలింపజేయాలంటూ కోరుతున్న టీచర్‌ని మీరు ఊహించుకోండి. లేదా, స్కూల్ లైబ్రరీ నుంచి రస్కిన్ బాండ్, ఆర్కే నారాయణ్ పుస్తకాలను తీసుకుంటున్న 7వ తరగతి యువ విద్యార్థిని ఊహించుకోండి. తమ సాహిత్య సృజనలపై చర్చ ప్రారంభించాలంటూ హైయర్ టీచర్‌ని కోరుతున్న విద్యార్థినీ విద్యార్థినులను ఊహించుకోండి. ఇది పాఠ్య పుస్తకాన్ని (మేటి రచయితలు రాసినవైనప్పటికీ) కేవలం ఉత్ప్రేరకంగా మాత్రమే చూస్తూ, తర్వాత దాన్ని దాటి పోవడం అన్నమాట! ఈ సృజనాత్మకమైన కీలకమైన ఫ్యాకల్టీని బలోపేతం చేసిన తర్వాత ప్రశ్నించే, విచారణ చేసే, సిలబస్‌ని దాటి చూసే మేధా, జ్ఞాన సామర్థ్యాన్ని పిల్లలు సహజంగా అభివృద్ధి చేసుకుంటారు.

అర్థవంతమైన విద్య గురించి, మన పిల్లల భవిష్యత్తు గురించి మనం నిజాయితీగా ఆలోచిస్తున్నట్లయితే, ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాల అధికారంపై వామపక్షవాదుల, మితవాదుల మధ్య రాజకీయ–సైద్ధాంతిక ఘర్షణను దాటి సమస్యను చూడాల్సిన అవసరం ఉంది.

వ్యాసకర్త సోషియాలజిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ద్వంద్వ ప్రమాణాలు



పరిహాసం ఏమిటంటే– వాస్తవాల మీద ఆధారపడిన 'బీబీసీ డాక్యుమెంటరీ'ని నిషేధించాలని కోరినవాళ్లే, వాస్తవాలు లేని 'ద కేరళ స్టోరీ'ని నిషేధిస్తే బాధపడుతున్నారు.

– అర్ఫీ అల్వీ, కవయిత్రి

పాతరేశారు



పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అనాగరిక అరెస్టు వల్ల ఇదివరకే పాకిస్తాన్‌లో చచ్చిపోయివున్న ప్రజాస్వామ్యాన్ని గొయ్యితీసి పూడ్చిపెట్టినట్టయింది.

– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

దోసె దోశం



దోసె తిందామని రెస్టారెంటుకు వెళ్లాను. రెండు దోసెలకు బిల్లు ఇవ్వడం చూసి ఆశ్చర్యపోయాను. వెయిటర్‌ను అడిగితే, టేబుల్‌కు అటుపక్కన కూర్చున్న వ్యక్తి నాతో కలిసి వచ్చానని చెప్పి మసాలా దోసె తీసుకున్నాడని తెలిసింది. బిల్లు వచ్చేలోగా అతడు వెళ్లిపోయాడు.

– అరుణ్ బోత్రా, పోలీస్ అధికారి

తీవ్ర దేశం



పాకిస్తాన్‌లోని మదరసాల సంఖ్య: 40,000. విశ్వవిద్యాలయాల సంఖ్య: 218. ఫలితం: సాయుధ మతగురువులు, తీవ్రభావాల ప్రజలు, హింసాత్మక అతివాదం, మూక దాడులు, బలవంతపు మతమార్పిడులు, ప్రాణభయంలో మైనారిటీలు.

– సయ్యద్ ముజమ్మిల్ షా, రాజకీయ విశ్లేషకుడు

ఎలా దిగజారింది!



బెంగాల్ 'ద కేరళ స్టోరీ'ని నిషేధించింది. నా పాత పుస్తకం 'ద్విఖండితో'ను నిషేధించింది. ఒకప్పుడు బెంగాల్ ప్రగతిశీల రాష్ట్రం. అది ఎందరో కళాకారులు, రచయితలు, మేధావులకు జన్మనిచ్చింది. ఇప్పుడు బెంగాల్ అత్యంత ఛాందస రాష్ట్రం. అది భావస్వేచ్ఛకు వ్యతిరేకం.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

బతికే మార్గాలు



ఏ మతమూ శాస్త్రీయం కాదు. ఏ మతమూ శాస్త్రీయంగా ఉండాల్సిన పనిలేదు. హిందూయిజం, క్రైస్తవం, ఇస్లాం, బౌద్ధం, సిక్కు, జైన, జుడాయిజం– ఏవీ శాస్త్రీయం కాదు. కానీ అవి మన జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాల్లో భాగం. వాటిని అలాగే చూడాలి. ఇది అర్థం కాకపోవడానికి ఇదేమీ క్వాంటమ్ ఫిజిక్సో, రాకెట్ సైన్సో కాదు.

– రాహుల్ ఈశ్వర్, రచయిత

నమలడం ఆపాలి



చూయింగ్ గమ్ ప్రతి ఏటా లక్ష టన్నుల ప్లాస్టిక్ కాలుష్యానికి కారణం అవుతోంది. అది దంతక్షయాన్ని కూడా కలిగించవచ్చు. మా నగరం మిలాన్ (ఇటలీ) సైడ్‌వాక్స్ నమిలి ఊసిన చూయింగ్ గమ్స్ వల్ల నాశనం అయ్యాయి. వీటిని నిషేధించిన సింగపూర్‌ను మిగతా ప్రపంచం ఉదాహరణగా తీసుకోవాలి.

– అలెసాండ్రియా బొక్కి, జర్నలిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఆదర్శ వైద్యుల పరంపరలో...



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

"డాక్టర్లుగా వైద్య శిఖామణులైన భారత మహిళా వైద్యులు అనేక మంది వైజ్ఞానిక శాస్త్ర పరిజ్ఞానానికి పటువును, దిటవును అబ్బించడం ద్వారా, ఇంత వరకూ కేవలం మూఢ నమ్మకాల్లో పడి కొట్టుమిట్టాడుతూ ఉన్న స్త్రీలకు బతుకు మీద భరోసా కల్పించడానికి దోహదం చేశారు. అలాంటి వారిలో ప్లేగు వ్యాధి నిర్మూలనకు కృషి చేసిన రుక్మాబాయి, ఇబ్బందులలో ఉన్న గర్భవతులకు సుఖ ప్రసవాన్ని ప్రసాదించిన హైమవతి, ప్రత్యేక క్యాన్సర్ వార్డ్‌ను స్త్రీలకు కేటాయింప చేయడానికి నిరంతర కృషి సల్పి విజయం సాధించిన ముత్తులక్ష్మి చిరస్మరణీయులు. వీరంతా స్త్రీలను పట్టి పీడిస్తున్న అమాయకపు నీడల్ని వెంటాడుతూ విజయం సాధించుతూ వచ్చినవారు. మనం మహిళా వైద్యుల్ని గురించి మాట్లాడుకునేప్పుడు – వైజ్ఞానిక ప్రగతి కోసం, స్వేచ్ఛ కోసం సాగే వైజ్ఞానిక శాస్త్ర మహిళా శిఖా మణుల పేర్లను సదా మనం గుర్తుంచుకోవలసిందే."

– కవితారావు (కె.ఎల్. రావు కుమార్తె), 'లేడీ డాక్టర్స్' రచయిత

"జీవితంలో ప్రతి ఒక్కరు మరొకరి భుజాల మీద సవారీ చేసి బతుక్కూడదు, ఎవరికి వారు తన సొంత కాళ్లపైనే ఆధార పడాలి."

– డాక్టర్ ఆనందీబాయి జోషీ (1865–1887)

ఈ పైన వెల్లడించిన ఉద్దండులు నెలకొల్పిన సంప్రదాయ ఛాయల్లో ఎదిగివచ్చిన సుప్రసిద్ధ భారత వైద్యులలో ఒకరు డాక్టర్ రజనీ కూనమనేని. ఈమె వైద్య వృత్తి నిర్వహణలో ఎంతటి ఘనాపాటో, సామాజికులలో చైతన్య స్ఫూర్తికి దోహదం చేయడంలో కూడా అంతటివారు. పేదసాదల సముద్ధరణ కోసం, న్యాయం వైపు, సమానత్వం స్పృహ వైపు ప్రజలని దృష్టి మరల్చడం కోసం అనేక కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. 'భారత వైద్యుల సంఘం' జాతీయ కార్యదర్శిగా ఉన్న డాక్టర్ రజని... 2000 సంవత్సరం నుంచి కమ్యూనిస్టు ఉద్యమ నాయకుల్లో ఒకరైన చంద్ర రాజేశ్వర్రావు పేరిట కొండాపూర్‌లో నెలకొల్పిన వృద్ధాశ్రమానికి ప్రధాన వైద్యురాలిగా సేవలందిస్తున్నారు. జర్మనీ, సోవియెట్ యూనియన్‌లలో ఉన్నత విద్య అభ్యసించి ప్రజా సేవలో అఖండమైన ఖ్యాతి గడించిన డాక్టర్ రజనీకి పలు దక్షిణాది భాషలపైనా పట్టు ఉంది. 1975 దాకా పదేళ్ల పాటు జర్మనీలో వైద్యం నిర్వహించిన రజని... సుప్రసిద్ధ ఏంజెలా డేవిస్, పాల్ రాబ్సన్, దక్షిణాఫ్రికాలో జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన విన్నీ మండేలా వంటి వారితో కలిసి బెర్లిన్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాలలో పాల్గొన్నారు. క్యూబా సందర్శించి ఫిడెల్ కాస్ట్రోని కలుసుకుని అక్కడి ప్రజారోగ్య పథకాలను గురించి తెలుసుకున్నారు.

కాగా, 'అందరికీ ఆరోగ్యం అందాలి' అన్న నినాదాన్ని ఏళ్లూపూళ్లూ గడిచిన ఇంత కాలానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పుడు ముందుకు నెడుతోంది. ఈ నినాదం ఆచరణలో క్యూబాలో సోషలిస్టు పాలన కాస్ట్రో నాయకత్వాన ఏర్పడిన నాటి నుంచీ కార్యరూపం దాల్చింది. అంతేకాదు 40 దేశాలకు డాక్టర్లను, వలంటీర్లను పంపి వైద్య సహాయం అందజేస్తోంది క్యూబా. అందుకే డాక్టర్ రజనీ అంటారు: 'అందరికీ ఆరోగ్యం' అన్న నినాదాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది ముందుకు తీసుకు వచ్చింది కాని, 1978 లోనే 'ఆల్మా ఆటా' సభ ప్రకటన దీని గురించి నొక్కిచెప్పింది. ఇప్పుడు 30 ఏళ్ల తర్వాత మరలా ఈ నినాదం మన ముందుకు వచ్చింది. 'కరోనా' మహమ్మారి వ్యాప్తివల్ల కల్గిన విషాద ఘడియల్ని ప్రపంచ ప్రజలు అనుభవించిన తరువాతగానీ 'ప్రజలు, ప్రాథమిక ఆరోగ్య జాగ్రత్తలు' అన్న నినాదానికి విలువ రాలేదని డాక్టర్ రజని విమర్శ. ఇప్పుడుగాని 'కుటుంబ వైద్యం, కుటుంబ వైద్యుల' సదుపాయం గురించి పాలకులకు గుర్తు రాలేదని అన్నారు. అయితే ప్రస్తుతం ప్రతీ సామాజిక అంశం ప్రయివేట్ ఆస్తి, ప్రయివేట్ లాభాలు, ప్రయివేట్ ప్రయోజనా లతో ముడిపడి ఉన్నందున... దోపిడీ వ్యవస్థ నుంచి మన సమాజం, పాలనా వ్యవస్థలూ తేరుకోనంత కాలం; నిరంతర దోపిడీకి పాలకులే 'గేట్లు' ఎత్తివేస్తున్నంత కాలం ప్రయో జనకరమైన ప్రాథమిక వైద్య సదుపాయాలన్నీ ప్రజా బాహు ళ్యానికి అందజాలవని డాక్టర్ రజని నిశ్చితాభిప్రాయం!



రెండో మాట

ప్రసిద్ధ వైద్యురాలు డా॥ రజనీ కూనమనేని

వైద్య విధానాల నిర్వహణలో డాక్టర్ ఎలిజబెత్ బ్లాక్‌వెల్‌కు ముందు... నర్సింగ్ వ్యవస్థ బలపడితే తప్ప, కేవల డాక్టర్ల వ్యవస్థ వల్ల సామాజికుల ఆరోగ్య భాగ్యం కుదుటపడబోదని చాటిచెప్పి పటిష్ఠమైన ప్రపంచ నర్సింగ్ వ్యవస్థకు ప్రాణం పోసిన ఫ్లారెన్స్ నైటింగేల్ చిరస్మరణీయురాలైంది. నైటింగేల్ పాఠాన్ని డాక్టర్ రజని వంటబట్టించుకుంది కాబట్టే నర్సింగ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి సదా ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రాతిపదిక ఆధారంగానే ఆమె వ్యక్తిగత స్థాయిలోనూ, సీఆర్ ఫౌండేషన్ వైద్యశాఖ నిర్వహణలోనూ అకుంఠితమైన కృషి చేస్తున్నారు. వైద్య వృత్తి ధర్మంలో, ప్రజాసేవలో ఆనందీబాయి జోషీ, రుక్మాబాయ్ రౌత్, కాదంబినీ గంగూలీ, హైమవతీ సేన్, ముత్తులక్ష్మిరెడ్డి, మేరీ పూనెన్ లూకోజ్ వంటి తొలి భారత మహిళా వైద్యులు నెలకొల్పిన అనుపమానమైన సేవల ఒరవడిలోనే డాక్టర్ కూనమనేని రజని... ఆమెకు అంతేవాసిగా, సహజీవిగా అనుక్షణం అండదండగా నిలబడి నిత్య సేవలందించడంలో వెనుదీయని సుబ్బరామన్ సదా ధన్యులు. వేమన్న అననే అన్నాడు గదా: "భూమిలోన పుణ్య పురుషులు లేకున్న/ జగములేల నిల్చు..."

abkprasad2006@yahoo.co.in

కడుపే కైలాసం

లోక వ్యవహారంలో 'కడుపే కైలాసం' అనే సామెత ఒకటి వినిపిస్తుంది. 'మనిషికి అన్నిటికంటే ముఖ్యమైన పని వీలైనన్ని రుచికరమైన పదార్థాలతో కడుపు నింపుకోవడం. ఆధ్యాత్మికంగా కైలాసం, వైకుంఠం ఇలాంటి ధ్యాసలు అనవసరం. ఇంద్రియ చాపల్యాలను తృప్తి పరచటమే జీవన పరమార్థం. శరీర సుఖాలే సర్వస్వం' అనే సంకుచిత భావంతో, భౌతిక విషయాలలో మాత్రమే మితి మీరిన ఆసక్తి ప్రదర్శించే వాళ్ళను, 'వాళ్ళకు కడుపే కైలాసం' అన్న జాతీయంతో ఈసడించటం లోకంలో కనిపిస్తుంది.

జ్యోతిర్మయం

పూర్వకాలంలో అనేక కారణాల చేత, ఎప్పుడూ ఇంటిపనులూ, వంటపనులూ చూసుకుంటూ కాలం పుచ్చటం తప్ప తీర్థయాత్రలు వగైరాలు చేసే అవకాశాలే రాని వాళ్ళు, 'ఈ జన్మకు నేను ఎక్కడికీ వెళ్లగలిగింది లేదు. కాశీకి వెళ్లలేను, రామేశ్వరం చూడలేను. నాకు ఈ ఇల్లే వైకుంఠం, కడుపే కైలాసం. మరో తీర్థం, క్షేత్రం చూసేందుకు నేను నోచుకోలేదు' అని వాపోవటం వినిపించేది. ఇదొక వాడుక.

నిజానికి, 'ఇల్లే వైకుంఠం, కడుపే కైలాసం' అనే జాతీయానికి శతాబ్దాల తరబడి వస్తున్న వాడుకలో, ఇంతకంటే ఉన్నతమైన ఉదాత్తమైన అర్థం ఇంకొకటి ఉంది.

'కేదారాది సమస్త తీర్థముల కోర్కిన్ చూడబోనేటికిన్?– కేదారనాథ్, కాశీ ఇత్యాది సమస్త పుణ్య క్షేత్రాలకు అంత ఆరాటపడి పోవటం ఎందుకు?– అని ప్రశ్నిస్తుంది కాళహస్తీశ్వర శతకం. 'కాదా ముంగిలి వారణాసి, కడుపే కైలాస శైలంబు? మీ / పాద ధ్యానము సంభవించునపుడే... శ్రీ కాళహస్తీశ్వరా' అని ఆ పరమ శివుడిని అడుగుతుంది. "స్వామీ, భక్తి తత్పరతతో మీ పాద ధ్యానం చేసే భక్తుడు మిమ్మల్ని తన హృదయంలో సాక్షాత్కరింప జేసుకొంటాడు గదా! మీరు సాక్షాత్కరిస్తే మీ కాశీ నగరం కూడా మీతో పాటు వచ్చి అతడి ముంగిట్లో నిలిచి ఉన్నట్టే! మీతో పాటు మీ నివాసమైన కైలాస శిఖరం కూడా ఆ భక్తుడికి హృదయగతమై ఉంటుంది' అంటాడు ధూర్జటి కవి. అటువంటి భక్తుడికి ఇక ప్రత్యేకంగా పుణ్యక్షేత్రాలకు వెళ్లవలసిన పని ఉండదు.

– ఎం. మారుతి శాస్త్రి

ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై రైతుల ఆగ్రహం.. అధికారుల నిర్బంధం

ఆకారం గ్రామంలో ఘటన



ఆకారం గ్రామంలో అధికారులను గదిలో నిర్బంధించిన రైతులు

శాలిగౌరారం: ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు అధికారులను నిర్బంధించారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని ఆకారం గ్రామంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఆకారం గ్రామంలో ఆలస్యంగా ఈ నెల 3న ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కానీ, ఇంతవరకు ధాన్యం కొనుగోలు చేపట్టలేదు. దీంతో రైతులు ప్రతిరోజూ సంబంధిత జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. అయినా ధాన్యం కొనుగోలు జరగడంలేదు. ఇప్పటికే అకాల వర్షాలకు ధాన్యం తడవగా రైతులు ఇబ్బందులు పడుతూ ధాన్యం ఆరబోసుకొని కొనుగోలు కోసం ఎదురుచూస్తున్నారు. మళ్లీ వర్షాల భయంతో ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో నకిరేకల్ ఏడీఏ, మండల ప్రత్యేక అధికారి శ్రీధర్‌రెడ్డి మండల అధికారులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించేందుకు మంగళవారం వచ్చారు. అధికారులతీరుపై ఆగ్రహంతో ఉన్న రైతులు శ్రీధర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సౌమ్యశ్రుతి, ఐకేపీ ఏపీఎం జానకి, సీసీ బాలును ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గదిలోకి పంపించి గదికి తాళం వేశారు. అదే పాఠశాల ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా ప్రయత్నిస్తామని నిర్బంధంలో ఉన్న అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. దీంతో శాంతించిన రైతులు గదితాళం తీసి అధికారులను బయటకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రస్తుతం లారీల సమస్య అధికంగా ఉండటం వల్ల ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపట్టలేకపోతున్నామన్నారు. రైతులు ట్రాక్టర్ల సహాయంతో ధాన్యం రవాణా చేసేందుకు ముందుకువస్తే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అవకాశం కల్పిస్తామన్నారు.

ఇద్దరు పిల్లలు సహా తల్లి ఆత్మహత్య

- చెరువులో దూకి బలవన్మరణం
- భర్త వేధింపులే కారణమా?



చెరువు వద్ద మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

సత్తుపల్లి: ఇద్దరు పిల్లలతోపాటు ఓ తల్లి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన పాటిబండ్ల ప్రశాంత్‌కు భద్రాద్రి జిల్లా దమ్మపేటకు చెందిన మృదులతో 2009లో వివాహం జరిగింది. పెళ్లి జరిగినప్పుడు ప్రశాంత్ ఢిల్లీలో ఉద్యోగం చేసేవాడు. ఏడాదికే అమెరికాకు వెళ్లి అక్కడ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేశాడు. అయితే ప్రశాంత్ చెడు వ్యసనాలకు అలవాటు పడటంతో ఐదేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చేశారు. కరోనా సమయంలో వర్క్‌ఫ్రం హోం కింద సత్తుపల్లిలో రెండేళ్లు ఉన్నారు. ఏడాది క్రితం తిరిగి హైదరాబాద్‌కు మకాం మార్చారు. ప్రశాంత్ బెట్టింగ్‌లు కాస్తూ హైదరాబాద్‌లోని ఇల్లు అమ్మేశాడు. దమ్మపేటలో కట్నం కింద ఇచ్చిన ఏడున్నర ఎకరాల భూమిని అమ్ముకొని రమ్మంటూ మృదులను తరచూ వేధిస్తుండడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరుగుతోంది. కాగా, పది రోజుల క్రితం ఓ శుభకార్యం నిమిత్తం సత్తుపల్లికి వచ్చారు. అక్కడి నుంచి దమ్మపేట వెళ్లి తల్లిదండ్రులకు విషయం చెప్పగా.. వారు ఆస్తులు అమ్ముకోవద్దని మృదులకు సూచించారు.

విజయవాడ వెళ్లి వస్తూ..: కాగా, విజయవాడలో ఉండే మృదుల పిన్ని ఆరోగ్యం బాగా లేకపోవడంతో చూసి వస్తానని ఇద్దరు పిల్లలతో కలసి సోమవారం ఉదయం వెళ్లింది. తిరిగి రాత్రి 8 గంటలకు సత్తుపల్లి బస్టాండ్‌లో దిగింది. అంతకుముందు తన పిన్నికి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పింది. ఈ విషయం ఆమె కుటుంబసభ్యులకు తెలపడంతో చుట్టుపక్కల వెదికారు. అయితే ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తామరచెరువుకు వెళ్లి..: సత్తుపల్లి బస్టాండ్‌లో దిగిన మృదుల (40) ఇద్దరు పిల్లలు ప్రజ్ఞాన్(8), మహాన్(5)ను తీసుకుని పట్టణ శివారులోని తామరచెరువు వద్దకు వెళ్లింది. ప్రజ్ఞాన్ కాలుకు చున్నీతో కట్టి, చిన్న కుమారుడు మహాన్‌ను మరో చేత్తో ఎత్తుకొని చెరువులోకి ఈడ్చుకుంటూ వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. అంతకుముందే ప్రశాంత్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ట్రేస్ చేయగా.. తామరచెరువు లొకేషన్ చూపించడంతో ఆ ప్రాంతంలో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం చెరువులో మృతదేహాలు తేలడంతో పోలీసులు బయటకు తీయించారు.

అనుమతుల్లేని ప్రాజెక్టులే ఎజెండా

- జల వివాదాల ముగింపునకు కృష్ణా బోర్డు సిద్ధం
- ఈ ఏడాది నీటి పంపిణీతో సహా 21 అంశాలపై చర్చ
- నేడు బోర్డు 17వ సర్వ సభ్య సమావేశం..



సాక్షి, హైదరాబాద్: కృష్ణా నదిపై రెండు రాష్ట్రాలు అనుమతి లేకుండా చేపట్టిన ప్రాజెక్టులపై చర్చించి.. జల వివాదాలకు ముగింపు పలికేందుకు కృష్ణా బోర్డు సిద్ధమైంది. అనుమతి లేని ప్రాజెక్టులే ప్రధాన ఎజెండాగా హైదరాబాద్‌లోని బోర్డు కార్యాలయంలో చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ అధ్యక్షతన 17వ సర్వ సభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ప్రతిపాదించిన అంశాలతోపాటు పరిధిని నిర్దేశిస్తూ కేంద్రం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ అమలు, బడ్జెట్, 2023–24 నీటి సంవత్సరంలో నీటి పంపిణీతో సహా 21 అంశాలతో ఎజెండాను ఖరారు చేసింది. కృష్ణా తాగునీటి సరఫరా పథకం ఒకటి, రెండో, మూడో దశల ద్వారా ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు కాలువ కింద ప్రస్తుతం తెలంగాణ సర్కారు ఆయకట్టుకు నీటిని అందిస్తోంది. తాగునీటి పథకం ద్వారా కాకుండా ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు కాలువ కింద ఆయకట్టుకు నీటిని అందించడానికి నాగార్జునసాగర్ జలవిస్తరణ ప్రాంతంలో రూ.1450 కోట్లతో సుంకిశాల ఇన్‌టేక్ వెల్ ప్రాజెక్టును తెలంగాణ చేపట్టడంపై గతేడాది నవంబర్ 3న కృష్ణా బోర్డు దృష్టికి ఏపీ ప్రభుత్వం తీసుకెళ్లింది.

పాలమూరు–రంగారెడ్డి, సుంకిశాల ఇన్‌టేక్ వెల్‌పై...

సుంకిశాల ఇన్‌టేక్ వెల్‌తోపాటు పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలను నిలుపుదల చేయాలని కృష్ణా బోర్డును కోరింది. నీటి కేటాయింపులు లేని నేపథ్యంలో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతి ఇవ్వలేమని డీపీఆర్‌ను ఇటీవల తెలంగాణ సర్కార్‌కు సీడబ్ల్యూసీ తిప్పిపంపింది. ఈ నేపథ్యంలో పాలమూరు–రంగారెడ్డితోపాటు సుంకిశాల ఇన్‌టేక్ వెల్ ప్రాజెక్టు పనులను నిలిపేసేలా తెలంగాణను ఆదేశించాలని బోర్డు సమావేశంలో ఏపీ ప్రభుత్వం డిమాండ్ చేయనుంది. కృష్ణా ట్రిబ్యునల్–2 కేటాయించిన 4 టీఎంసీలను వాడుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్డీఎస్(రాజోలిబండ డైవర్షన్ స్కీం) కుడి కాలువను చేపట్టడంపై తెలంగాణ సర్కారు కృష్ణా బోర్డుకు ఫిర్యాదు చేసింది. ట్రిబ్యునల్ తీర్పు నోటిఫై అయ్యాకే పనులు చేపడతామని ఏపీ ప్రభుత్వం కృష్ణా బోర్డుకు ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఆర్డీఎస్ ఆధునికీకరణ కోసం మరో సారి కోరేందుకు తెలంగాణ సర్కారు సిద్ధమైంది.

గెజిట్ నోటిఫికేషన్ అమలయ్యేనా?:

బోర్డు పరిధిని నిర్దేశిస్తూ 2021, జూలై 15న కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆర్నెళ్లలోగా దాన్ని అమలు చేయాలని పేర్కొంది. మరో ఆర్నెళ్లు గడువు పొడగించినా నోటిఫికేషన్ అమలుపై రెండు రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి రాలేదు. ఈ నేపథ్యంలో గెజిట్ నోటిఫికేషన్ అమలుపై రెండు రాష్ట్రాలను ఒప్పించేందుకు బోర్డు సిద్ధమైంది. ఉమ్మడి రాష్ట్రానికి ట్రిబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీల కృష్ణా జలాల్లో 66 శాతం(512 టీఎంసీలు) ఏపీ, 34 శాతం(299 టీఎంసీలు) తెలంగాణ వాడుకునేలా 2015, జూన్ 19న తాత్కాలిక ఒప్పందం కుదిరింది. 2022–23 వరకూ అదే విధానం ప్రకారం బోర్డు నీటిని పంపిణీ చేస్తోంది. కానీ.. సగభాగం వాటా కావాలని తెలంగాణ సర్కారు మరో సారి డిమాండ్ చేసిన నేపథ్యంలో నీటి పంపిణీపై కూడా సమావేశంలో బోర్డు చర్చించనుంది. 2023–24 నీటి సంవత్సరంలో నీటి కేటాయింపులు, విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై త్రిసభ్య కమిటీ క్రమం తప్పకుండా సమావేశమవడంపైనా చర్చించనున్నారు.

హిందీలో కార్యకలాపాలా..?

కేంద్రంతో బోర్డు ఉత్తర ప్రత్యుత్తరాలు, కార్యకలాపాలు హిందీ భాషలోనే జరగాలని కేంద్ర జల్ శక్తి శాఖ క్రమం తప్పకుండా కోరుతూ వస్తోంది. కానీ.. రెండు రాష్ట్రాల అధికారులకూ హిందీ భాషలో ప్రావీణ్యం లేని నేపథ్యంలో, కేంద్ర జల్ శక్తి శాఖ ఉత్తర్వుల అమలుపై బోర్డు సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. కేంద్ర జల్ శక్తి శాఖ అనుమతి లేకుండా బోర్డులో పనిచేస్తున్న సిబ్బందికి మూలవేతనంలో 25 శాతం ప్రోత్సాహకంగా ఇచ్చిన నిధులను రికవరీ చేయాలని కేంద్రం ఆదేశించడంపై కూడా చర్చించి, చర్యలు చేపట్టనున్నారు.

మార్క్‌ఫెడ్ వైస్‌చైర్మన్ రాజీనామా



బొర్రా రాజశేఖర్

వైరా: మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్టు ఖమ్మం జిల్లా వైరాకు చెందిన బొర్రా రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లాలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అనుచరుడిగా రాజశేఖర్ కొనసాగుతున్నారు. పొంగులేటి ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెడుతూ ఫిబ్రవరి 5న వైరా నియోజకవర్గ అభ్యర్థి గా బానోత్ విజయాబాయిని ప్రకటించడంతో.. అదే రోజు బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ తదితరులను బీఆర్‌ఎస్ నుండి సస్పెండ్ చేశారు. ఈక్రమంలోనే పొంగులేటి ఆశీస్సులతో వచ్చిన మార్క్‌ఫెడ్ పదవికి సైతం రాజీనామా చేస్తున్నట్లు రాజశేఖర్ వెల్లడించారు.

సీఎస్ చెంతకు 'రోడ్డు వార్'

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడలో హెచ్‌ఆర్‌డీసీఎల్, ఆదర్శ్‌నగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ మధ్య రోడ్డు వివాదం సీఎస్ శాంతి కుమారి చెంతకు చేరింది. సొసైటీ అభ్యంతరాలు, కోర్టు స్టే విషయాన్ని ఆమెకు ఇద్దరు ఐఏఎస్ అధికారులు వివరించినట్టు తెలిసింది. దాంతో వారి భూమిలో పనులు చేయొద్దని ఆదేశాలు రావడంతో హెచ్‌ఆర్‌డీసీఎల్ అధికారులు మిన్నకున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఇతర ప్రభుత్వ భూమిలో పనులు చేస్తున్నారు. మధ్యేమార్గంగా సొసైటీకి న్యాయం చేసి, కోర్టు కేసును ఉపసంహరించి పనులను సాగిస్తారా.. లేక కోర్టు ఆదేశాల తరువాత చేస్తారా అనేది తేలాల్సి ఉంది.

జార్ఖండ్ కాల్పుల్లో ఖమ్మం వాసి మృతి



శరత్‌బాబు (ఫైల్)

ఖమ్మం అర్బన్/ హుడా కాంప్లెక్స్ (హైదరాబాద్): జార్ఖండ్‌లోని హజారీబాగ్ జిల్లాలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో ఖమ్మం ఇందిరానగర్‌కు చెందిన వీరగంధం శరత్‌బాబు(60) మృతి చెందారు. బర్కాగావ్‌లో ఎన్‌టీపీసీలో మైనింగ్ పనుల కోసం ఓ కంపెనీ తరఫున ఆయన జనరల్ మేనేజర్, ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం సైట్ ఆఫీసు నుంచి బ్యాంక్ పనిపై వాహనంలో వెళ్తుండగా గెస్ట్ హౌస్ దగ్గర ఇద్దరు బైక్‌పై వచ్చిన ఆగంతకులు కాల్పులు జరపడంతో కుప్పకూలిపోయాడు. శరత్ ఛాతి, కడుపులో రెండు బుల్లెట్లు దూసుకుపోవడంతో ఆయన మృతి చెందాడని, హత్యకు కారణాలు తెలియలేదని హజారీబాగ్ పోలీసు సూపరింటెండెంట్ మనోజ్ రతన్‌ఛోతే ప్రకటించినట్లు వారి కుటుంబీకులకు మంగళవారం సాయంత్రం సమాచారం అందింది. శరత్‌కు భార్య పద్మ, కుమారుడు కార్తీక్ ఉన్నారు. శరత్ స్వస్థలం నిజామాబాద్ జిల్లా.

దంపతులపై పిడుగుపాటు

- భార్య మృతి..ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న భర్త
- జగిత్యాల జిల్లాలో ఘటన



మృతిచెందిన పద్మ

సారంగాపూర్(జగిత్యాల): దంపతులపై పిడుగుపడిన ఘటనలో భార్య మృతి చెందింది. భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్లలో మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జోగిన గంగమల్లు–పద్మపై మంగళవారం మధ్యాహ్నం పిడుగుపడింది. ఈ ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న స్థానికులు వెంటనే ఓ వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పద్మ(45) మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ గంగమల్లు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు. గంగమల్లు దాదాపు పదేళ్లపాటు ఉపాధి కోసం గల్ఫ్‌లో ఉండి ఇటీవలే వచ్చాడు. సొంతంగా ఐదెకరాలు కొనుగోలు చేసి వివిధ పంటలు పండిస్తున్నాడు. పెద్ద కుమారుడు మధు పసుపు పంటను విక్రయించేందుకు నిజామాబాద్ మార్కెట్‌కు వెళ్లగా..చిన్న కుమారుడు మనోహర్ జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. పద్మ మృతితో పెంబట్లలో విషాదం నెలకొంది.

నిజామాబాద్‌లో పిడుగుల మోత



పిడుగు పాటుకు మృతి చెందిన 48 గొర్రెలు

ఇందూరు/బాన్సువాడ: నిజామాబాద్ జిల్లాలో మంగళవారం పిడుగుల మోత మోగింది. గాలివానకు కల్లాల్లో ధాన్యం కుప్పలపై కప్పిన టర్పాలిన్లు లేచిపోయాయి. భీమ్‌గల్ మండలం పల్లికొండ గ్రామంలో పిడుగుపాటుకు కుర్మ అనిల్‌కు చెందిన 48 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. డిచ్‌పల్లి మండలం యానంపల్లిలో నిర్మాణంలో ఉన్న పెద్దమ్మతల్లి దేవాలయం శిఖరంపై పిడుగు పడటంతో స్వల్పంగా ధ్వంసమైంది. ఇందల్వాయి మండలం నల్లవెల్లి గ్రామంలో నివాసాల మధ్య ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకపోవడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం పోసానిపేటలో పిడుగు పాటుకు బర్రె మృతి చెందింది. బాన్సువాడ ప్రాంతంలో కురిసిన వర్షానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పూర్తిగా తడిసిముద్దయ్యింది.

తేనెటీగల దాడిలో 100 మందికి గాయాలు



చికిత్స పొందుతున్న కూలీ

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని బూర్గుకుంట ప్రాంతంలో మంగళవారం ఉపాధి హామీ కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. సుమారు 280 మంది కూలీలు గ్రామ శివారులో పనులు చేస్తున్నారు. అదే సమయంలో తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేయడంతో సుమారు 100 మందికిపైగా కూలీలకు గాయాలయ్యాయి. కూలీ ఇనుగంటి దేవానందం తీవ్రంగా గాయపడటంతో పరిస్థితి విషమంగా ఉంది. మరికొందరు మహిళలకు గాయాలు కావడంతో అందరినీ జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో తీవ్రంగా గాయపడ్డ దేవానందంతోపాటు మరో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మిగతా వారు చికిత్స తీసుకున్నాక తమ ఇళ్లకు వెళ్లిపోయారు.

డాక్టర్‌పై వేటు

సాక్షి, హైదరాబాద్: విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించినందుకు మెదక్ జిల్లా తూప్రాన్ సామాజిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌పై వేటు పడింది. ప్రాథమిక నివేదిక ఆధారంగా విధుల నుంచి సస్పెండ్ చేస్తూ వైద్య విధాన పరిషత్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓ గర్భిణి విషయంలో డ్యూటీ డాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు.

అవి దర్గా భూములు కావు

- కానీ నిషేధిత జాబితాలో ఉన్న మాట వాస్తవం
- రైతుల స్పష్టీకరణ.. సాక్షి కథనానికి స్పందన

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కొంగరకుర్దు(ఏ) గ్రామంలోని సర్వే నంబర్ 86 నుంచి 89 భూములకు వక్ఫ్‌బోర్డుకు ఎలాంటి సంబంధంలేదని, అవి తమ పట్టా భూములని రైతులు నక్కా రాజేశ్, ఈ.నర్సిములు స్పష్టం చేశారు. 'రూ.260 కోట్ల వక్ఫ్ భూమికి ఎసరు'శీర్షికన 'సాక్షి'లో వచ్చిన కథనానికి స్పందించిన ఇరువురు...ఈ భూములు వంశపారంపర్యంగా తమకు వచ్చాయన్నారు. కొంగరకుర్దు(ఏ) శివారులోని జాగమ్మ మక్తా పరిధిలో సర్వే నం.1 నుంచి 109లలో వెంకయ్య చౌదరికి సుమారు 200 ఎకరాల పట్టా భూములుండగా, ఆయన నుంచి తమ తండ్రులు నక్కా యాదయ్య 24 ఎకరాలు, ఈ.రాములు 28 ఎకరాలు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. కాగా, 2007లో వక్ఫ్‌బోర్డు జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో దర్గా సయ్యద్ శారాజ్ ఖత్తార్ హుస్సేనీ ఖిల్లా చెందిన దర్గా భూములని పేర్కొనగా, దానిని హైకోర్టు 2022లో కొట్టివేసిందని తెలిపారు. అయితే తమ భూములు రిజిస్ట్రేషన్ శాఖలో నిషేధిత జాబితాలో ఉన్న మాట వాస్తవమేనని అంగీకరించారు. తమ వద్ద భూ పత్రాలుండటంతో గతేడాది ఒక స్థిరాస్తి సంస్థకు జీపీఏ ఇచ్చామన్నారు. తమవి తప్పుడు పత్రాలు కావని, అధికారికంగా పొందినవేనని వారు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా రైతుల భూమి పత్రాల ఆధారంగా కోర్టును ఆశ్రయించి నిబంధనల ప్రకారం వెంచర్ కోసం అన్ని అనుమతులు పొందినట్లు రియల్ ఎస్టేట్ ప్రతినిధులు తెలిపారు.

ఖమ్మం జిల్లా ఆస్పత్రికి బీఎఫ్‌హెచ్‌ఐ గుర్తింపు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ హాస్పిటల్ ఇనీషియేటివ్(బీఎఫ్‌హెచ్‌ఐ) గ్రేడ్ – 1 గుర్తింపు లభించింది. నేషనల్ అక్రెడిటేషన్ సెంటర్(ఎన్‌ఏసీ) ఫర్ మెటర్నిటీ హాస్పటల్స్ నుంచి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లుకు సర్టిఫికెట్ అందింది. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సమగ్ర చనుబాల నిర్వహణ కేంద్రం(ఎస్‌ఎల్‌ఎంసీ) కొనసాగుతోంది. ఈ కేంద్రం ద్వారా అధిక మొత్తంలో పాలు ఉన్న తల్లుల నుంచి సేకరించి.. పాలు లేని తల్లుల పిల్లలకు అందజేస్తుంటారు. కేంద్రం నిర్వహణను పరిశీలించిన డాక్టర్ ఉన్నం వినోద ఇచ్చిన నివేదికతో గుర్తింపు జారీ చేశారు. ఇది 2026 మే 5 వరకు వర్తించనుంది. ఇక నుంచి ప్రతీ ఆరునెలలకోసారి చనుబాల కేంద్రం నిర్వహణపై ఎన్‌ఏసీ సమీక్ష నిర్వహించనుంది.



క్లుప్తంగా

ప్రత్యక్ష ప్రసారాలతో కోర్టు ఇళ్లలోకి..
జనం మనసుల్లోకి వెళ్లింది
సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: ప్రత్యక్ష ప్రసారాల ద్వారా సర్వోన్నత న్యాయస్థానం ప్రజల నివాసాల్లో, వారి మనసుల్లో స్థానం సంపాదించుకుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. స్వలింగ సంపర్కుల వివాహానికి చట్టబద్ధత కోరుతూ దాఖలైన కేసులపై వాదనలను వరసగా ఎనిమిదో రోజు ఆలకించిన సందర్భంగా మంగళవారం సుప్రీంకోర్టు సీజే జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 'కోర్టు ప్రత్యక్ష ప్రసారాలపై జనంలో చర్చ నడుస్తోంది. లైవ్ స్ట్రీమింగ్ అనేది సరైన దిశలో ముందడుగు. అయితే ఇంగ్లిష్‌లో సాగే వాదనలను గ్రామాల్లోని చాలా మంది జనం అర్థం చేసుకోలేకపోతున్నారు' అని మధ్యప్రదేశ్ ప్రభుత్వం తరఫున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది కోర్టులో వ్యాఖ్యానించారు. దీంతో సీజేఐ ' నిజమే. లైవ్ స్ట్రీమింగ్‌తో సుప్రీంకోర్టు సాధారణ ప్రజల ఇళ్లలోకి, మనసుల్లోకి చేరింది. ఇదొక నిరంతర ప్రక్రియ. జనం మాట్లాడే భాషల్లో వాదనలు అందుబాటులో ఉండేలా సాంకేతికతను వాడేందుకు మావైపు నుంచీ ప్రయత్నిస్తున్నాం ' అని అన్నారు. 2018లో కోర్టు కార్యకలాపాల ప్రత్యక్షప్రసారానికి సూత్రప్రాయంగా అనుమతించిన సుప్రీంకోర్టు.. 2022 నుంచి ప్రసారం మొదలుపెట్టింది. 2023 ఫిబ్రవరి నుంచి ప్రత్యక్ష ప్రసారాలకు కృత్రిమ మేధ సాయంతో ఇతర భాషల్లో ట్రాన్స్‌స్క్రిప్ట్ (రాసిన లేదా ముద్రించిన కాపీలు) అయ్యేలా చూస్తోంది.

ఐశ్వర్య కుటుంబానికి సహకరిస్తున్నాం
అమెరికాలోని ఇండియన్ కాన్సులేట్ వెల్లడి

హూస్టన్: టెక్సాస్ అలెన్ ప్రీమియం ఔట్‌లెట్ మాల్‌లో దుండగుడి కాల్పుల్లో మృతిచెందిన తెలుగు యువతి తాటికొండ ఐశ్వర్య(26) మృతదేహాన్ని భారత్‌కు తరలించేందుకు ఆమె కుటుంబానికి సహకరిస్తున్నామని అమెరికాలోని ఇండియన్ కాన్సులేట్ తెలియజేసింది. శనివారం టెక్సాస్ మాల్ కాల్పుల్లో మరో ఇద్దరు భారతీయులు గాయపడ్డారని, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వెల్లడించింది. ఐశ్వర్య మృతదేహాన్ని స్వస్థలానికి చేర్చడానికి అవసరమైన ప్రక్రియ పూర్తి చేయడానికి తమ వంతు సాయం అందిస్తున్నామని హూస్టన్‌లోని కాన్సుల్ జనరల్ ఆఫ్ ఇండియా అసీమ్ మహాజన్ చెప్పారు. కాల్పుల్లో ఐశ్వర్య మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఐశ్వర్య పార్థివ దేహాన్ని భారత్‌కు తరలించేందుకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ప్రతినిధి అశోక్ కోల్ల కృషి చేస్తున్నారు.



కారు అద్దాలు బద్దలు కొట్టి, కాలర్ పట్టుకొని లాక్కెళ్లి..
ఇమ్రాన్ అరెస్టు

- ఇస్లామాబాద్ హైకోర్టు ఎదుట అదుపులోకి తీసుకున్న పారామిలటరీ రేంజర్లు
- సొంత ట్రస్టుకు భూమి బదిలీ కేసులో అరెస్టు చేసినట్లు అధికారుల ప్రకటన
- కస్టడీలో ఇమ్రాన్‌ను హింసిస్తున్నారని పీటీఐ నేతల ఆరోపణలు

ఇస్లామాబాద్/లాహోర్: అధికారంలో ఉన్నప్పుడు భారీగా అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి, పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్(పీటీఐ) పార్టీ చైర్మన్ ఇమ్రాన్ ఖాన్(70)ను పారామిలటరీ రేంజర్లు మంగళవారం అరెస్టు చేశారు. ఇదే కేసులో ఇస్లామాబాద్ హైకోర్టులో విచారణకు హాజరైన ఆయనను న్యాయస్థానం ఎదుటే అదుపులోకి తీసుకున్నారు. తనను హత్య చేసేందుకు పాకిస్తాన్ సైన్యం కుట్ర పన్నుతోందంటూ ఆరోపించిన మరుసటి రోజే ఇమ్రాన్‌ను అరెస్టు చేయడం గమనార్హం. కోర్టుకు హాజరయ్యేందుకు ఆయన లాహోర్ నుంచి ఇస్లామాబాద్‌కు చేరుకున్నారు. కోర్టులో ప్రవేశించేందుకు తన వాహనంలో కూర్చొని బయోమెట్రిక్ ప్రక్రియ నిర్వహిస్తుండగా పారామిలటరీ రేంజర్లు రంగప్రవేశం చేశారు. వాహనం గ్లాస్ డోర్‌ను పగులగొట్టి, ఇమ్రాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ భద్రతా సిబ్బందిని, లాయర్లను రేంజర్లు దారుణంగా కొట్టారని పీటీఐ సీనియర్ నేత షిరీన్ మజారీ ఆరోపించారు. ఇమ్రాన్ పట్ల రేంజర్లు అనుచితంగా ప్రవర్తించినట్లు సీసీటీవీ ఫుటేజీ ద్వా రా వెల్లడయ్యింది. కాలర్ పట్టుకొని బలవంతంగా లాక్కెళ్లి, జైలు వ్యాన్‌లోకి విసిరేసినట్లు తెలుస్తోంది.

ఈ నెల 1న అరెస్టు వారెంట్

ఇమ్రాన్, ఆయన భార్య బుష్రా బీబీకి చెందిన అల్-ఖదీర్ ట్రస్టుకు బాహ్రియా పట్టణంలో రూ.53 కోట్ల విలువైన భూమిని బదిలీ చేసిన కేసులో ఇమ్రాన్‌ను అరెస్టు చేసినట్లు ఇస్లామాబాద్ పోలీసులు ప్రకటించారు. మంగళవారం ఉదయమే అరెస్టు వారెంట్ జారీ చేసినట్లు వెల్లడించారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం ఆయనను నేషనల్ అకౌంటబులిటీ బ్యూరో(ఎన్ఏబీ)కు అప్పగిస్తున్నట్లు తెలిపారు. ఇమ్రాన్ అరెస్టు వారెంట్‌ను ఈ నెల 1న జారీ చేసినట్లు దానిపై ఉన్న తేదీని బట్టి తెలుస్తోంది. అవినీతి వ్యవహారాల్లో ఆయన నిందితుడని అందులో పేర్కొన్నారు. అరెస్టు తర్వాత ఇమ్రాన్‌ను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయలేదని, పాకిస్తాన్ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి రాణా సనావుల్లా ట్విట్టర్‌లో వెల్లడించారు. ఇమ్రాన్‌ను హింసించారంటూ వస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. గతంలో పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ విచారణకు హాజరు కాలేదని, అందుకే ఎన్ఏబీ ఆయనను అదుపులోకి తీసుకుందని తెలియజేశారు.



ఇమ్రాన్ మద్దతుదారులు పెషావర్‌లో నిప్పుపెట్టిన దృశ్యం



ఇమ్రాన్ మద్దతుదారుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

140కి పైగా కేసులు

ఇమ్రాన్ అరెస్టు పట్ల పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు ప్రాంగణంలోనే లాయర్లపై రేంజర్లు దాడి చేశారని, దేశంలో అరాచకం రాజ్యమేలుతోందని మండిపడ్డారు. కస్టడీలో ఉన్న ఇమ్రాన్‌ను దారుణంగా హింసిస్తున్నారని ఆరోపించారు. గత ఏడాది ఏప్రిల్‌లో ఇమ్రాన్ పదవి కోల్పోయారు. ఆయనపై పలు కేసులు నమోదయ్యాయి. అవినీతి, ఉగ్రవాదం, దైవదూషణ, హత్య, హింసకు ప్రేరేపించడం వంటి ఆరోపణల కింద ఇమ్రాన్‌పై 140కిపైగా కేసులు నమోదయ్యాయి. ఇమ్రాన్ అరెస్టు నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో పోలీసులు 144 సెక్షన్ విధించారు. నిరసనలు, ఆందోళనలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

జైలుకు వెళ్లడానికి సిద్ధం: ఇమ్రాన్

ఇమ్రాన్ అరెస్టయిన తర్వాత.. ముందుగా రికార్డు చేసిన ఓ వీడియోను పీటీఐ విడుదల చేసింది. ''నా మాటలు మీకు చేరుకునేలోపు ఎలాంటి ఆధారాల్లేని కేసులో నన్ను అరెస్టు చేస్తారు. పాకిస్తాన్‌లో ప్రాథమిక హక్కులు, ప్రజాస్వామ్యానికి సమాధి కట్టినట్లు దీనిద్వారా తేటతెల్లమవుతుంది. అవినీతికి పాల్పడినట్లు నేను అంగీకరించాలని వారు(పాక్ పాలకులు) కోరుకుంటున్నారు. దిగుమతి అయిన ప్రభుత్వాన్ని బలవంతంగా ప్రజలపై రుద్దారు. వారెంట్ ఉంటే నన్ను అరెస్టు చేసుకోండి. జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నా'' అని ఆ వీడియోలో ఇమ్రాన్ ఖాన్ పేర్కొన్నారు.



అరెస్టుకు ముందు హైకోర్టులో ఇమ్రాన్

ఇమ్రాన్ అనుచరుల విధ్వంసం

పాకిస్తాన్‌లో అవాంఛనీయ దృశ్యాలు కనిపించాయి. ఇమ్రాన్ ఖాన్‌ను అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ పీటీఐ పార్టీ నేతలు, కార్యకర్తలు, ఆయన అనుచరులు వీధుల్లోకి వచ్చారు. విధ్వంసానికి పాల్పడ్డారు. రావల్పిండిలోని పాక్ సైనిక ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించారు. ప్రధాన గేటును ధ్వంసం చేశారు. సైన్యానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. పాక్ ఆర్మీ హెడ్ క్వార్టర్స్ ప్రధాన గేటును ధ్వంసం చేయడం ఇదే మొదటిసారి. లాహోర్‌లో సైనిక కమాండర్ నివాసాన్ని సైతం నిరసనకారులు దిగ్బంధించారు. సైనిక కంటోన్మెంట్‌లో గుమికూడి నినాదాలు చేశారు. రహదారులపై బైఠాయించడంతో లాహోర్ నుంచి చాలాసేపు రాకపోకలు నిలిచిపోయాయి. ఇమ్రాన్ అరెస్టు వార్తా ఉదయమే దావానలంగా వ్యాపించింది. వెంటనే ఆయన అనుచరులు వివిధ నగరాలు, పట్టణాల్లో ఆందోళనకు దిగారు. నిరసన ప్రదర్శనలు చేపట్టారు. వాహనాలకు నిప్పు పెట్టారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. ఇమ్రాన్‌ను పారామిలటరీ రేంజర్లు శారీరకంగా హింసిస్తున్నారని ఆరోపించారు. ఆయనను వెంటనే విడుదల చేయాలని నినదించారు. నిరసనలు హింసాత్మకంగా మారాయి. పెషావర్, కరాచీ, హైదరాబాద్, క్వెట్టా తదితర ప్రాంతాల్లో పరిస్థితి అదుపు తప్పింది. భద్రతా సిబ్బంది రంగంలోకి దిగి, ఇమ్రాన్ మద్దతుదారులను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు.

నదిలో పడిన బస్సు
మధ్యప్రదేశ్‌లో 24 మంది దుర్మరణం

ఖర్గోన్/భోపాల్: కిక్కిరిసిన ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ బస్సు అదుపుతప్పి నదిలో పడింది. ఈ ప్రమాదంలో 24 మంది ప్రాణాలు కోల్పోయారు. 40 మందికిపైగా గాయపడ్డారు. మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్ జిల్లాలో మంగళవారం ఉదయం ఈ దుర్ఘటన జరిగింది. జిల్లాలోని దొంగర్‌గావ్ గ్రామ సమీపంలో బొరాద్ నదిపై నిర్మించిన వంతెన మీదుగా బస్సు ప్రయాణిస్తుండగా డ్రైవర్ ఒక్కసారిగా బస్సుపై నియంత్రణ కోల్పోయారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీంతో బస్సు వంతెన రెయిలింగ్‌ను బద్దలుకొడుతూ నదిలో పడింది. బస్సు పడిన చోట నీటిప్రవాహం లేదు. 37 మందికే సీటింగ్ సామర్థ్యమున్న బస్సులో ఏకంగా 70 మంది ప్రయాణిస్తున్నారని, ఫిట్‌నెస్ లేని బస్సు వేగంగా ప్రయాణించడమూ ప్రమాదానికి కారణమని ప్రభుత్వం తెలిపింది. ఫిట్‌నెస్‌లేని బస్సుకు అనుమతినిచ్చిన అసిస్టెంట్ రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్‌ను ప్రభుత్వం సస్పెండ్‌చేసింది. ప్రమాదంపై రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ విచారం వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు తలా రూ.4 లక్షల నగదు పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి రూ.50వేల ఆర్థికసాయం అందిస్తామన్నారు. మృతుల కుటుంబాలకు తలా రూ.2 లక్షల ఎక్స్ గ్రేషియా అందిస్తున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు.

రష్యాపై 'రియల్ వార్'
విక్టరీ డే పరేడ్‌లో పుతిన్ వ్యాఖ్యలు

మాస్కో: స్వప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి పశ్చిమ దేశాలు రష్యాపై అసలైన యుద్ధం(రియల్ వార్) ప్రారంభించాయని దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆరోపించారు. రాజధాని మాస్కోలోని చరిత్రాత్మక రెడ్ స్క్వేర్‌లో మంగళవారం పటిష్టమైన భద్రత మధ్య నిర్వహించిన విక్టరీ డే పరేడ్‌లో ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. నాగరికత నేడు మరోసారి ఒక నిర్ణయాత్మకమైన కీలక మలుపులో ఉందని వ్యాఖ్యానించారు. స్వార్థపరులు తమ మాతృదేశంపై అసలైన యుద్ధానికి తెరలేపారని ఆరోపించారు. తమ పొరుగు దేశం ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న సంఘర్షణకు పశ్చిమ దేశాల స్వార్థపూరిత ఆకాంక్షలు, అహంకారమే కారణమని పునరుద్ఘాటించారు. ఉక్రెయిన్ యుద్ధంలో వీరోచితంగా పోరాడి ఈ పరేడ్‌లో పాల్గొంటున్న రష్యా సైనికులకు పుతిన్ సాదర స్వాగతం పలికారు. రష్యాకు, మన సైనిక దళాలకు, విజయానికి స్వాగతం అని పేర్కొన్నారు. తాజాగా రష్యా సైన్యం ఉక్రెయిన్‌పై విరుచుకుపడింది. క్రూయిజ్ క్షిపణులు ప్రయోగించింది.

మరో చీతా మరణం

భోపాల్: దక్షిణాఫ్రికా నుంచి తీసుకొచ్చిన చీతాల్లో మరొకటి మృతి చెందింది. మంగళవారం ఈ విషయం బయటపడింది. చీతాలను ఫిబ్రవరిలో మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కులో వదిలిపెట్టిన సంగతి తెలిసిందే. తాజాగా దక్ష అనే ఆడ చీతా ప్రాణాలు కోల్పోయింది. రెండు మగ చీతాలతో జరిగిన పోరాటంలో గాయపడి, మరణించినట్లు ప్రాథమిక ఆధారాలను బట్టి గుర్తించారు.

నేడే కర్ణాటకలో పోలింగ్
పూర్తి ఏర్పాట్లు, భద్రతతో సర్వం సిద్ధం



సాక్షి, బెంగళూరు: కర్ణాటకలో రాష్ట్రాధికారమే ధ్యేయంగా ప్రధాన పార్టీలుసహా చిన్నాచితకా పార్టీలు సాగించిన ప్రచారపర్వం ముగిశాక ఎన్నికల పండుగ కీలకఘట్టంలోకి అడుగుపెట్టింది. బుధవారం 224 శాసనసభ స్థానాల్లో పోలింగ్ కోసం పూర్తి ఏర్పాట్లు, భద్రతతో రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. ఉదయం ఏడింటి నుంచి సాయంత్రం ఆరింటిదాకా పోలింగ్ నిర్వహిస్తారు. ఈసారి అన్ని నియోజకవర్గాల్లో కలిపి 2,615 మంది అభ్యర్థులు తమ అదృష్టం పరీక్షించుకోబోతున్నారు. 58,545 పోలింగ్ కేంద్రాల్లో రాష్ట్రవ్యాప్తంగా 5,31,33,054 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఓటర్లలో 2,67,28,053 మంది పురుషులుకాగా, 2,64,00,074 మంది స్త్రీలు. 80 ఏళ్లుపైబడిన వృద్ధులు కొందరు ఇప్పటికే ఇంటివద్ద ఓటు హక్కు వినియోగించుకున్నారు. అభ్యర్థుల్లో 2,430 మంది పురుషులుకాగా, 184 మంది స్త్రీలు బరిలో నిలిచారు. దాదాపు నాలుగు లక్షల మంది ఎన్నికల సిబ్బంది విధుల్లో కొనసాగనున్నారు. ఓటింగ్ ప్రక్రియలో 75,603 బ్యాలెట్ యూనిట్లు, 70వేలకుపైగా కంట్రోల్ యూనిట్లు, 76వేలకుపైగా వీవీప్యాట్లు వినియోగించనున్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మొహరించారు. వారాంతంలో పోలింగ్ తేదీ ఉంటే ఓటర్లు చిన్నపాటి విహారయాత్రకు ప్లాన్ చేస్తారని, దానికి చెక్ పెట్టేందుకే వారం మధ్యలో(బుధవారం) పోలింగ్ తేదీని ఖరారుచేసినట్లు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ ఇటీవల మీడియాతో వ్యాఖ్యానించడం తెల్సిందే.

ఇక నుంచి మీ కలే నా కల
- ఉమ్మడి లక్ష్యంగా ముందుకెళ్తే ప్రపంచంలో ఆపేవారే లేరు
- కన్నడ ప్రజలకు రాసిన లేఖలో ప్రధాని మోదీ

బెంగళూరు: తమ ఓటు ద్వారా భవిష్యత్తు ప్రభుత్వాన్ని కొలువు తీర్చేందుకు సమాయత్తమవుతున్న కన్నడ ప్రజలకు ప్రధాని మోదీ లేఖ రాశారు. ఎన్నికల సందర్భంగా కొద్ది రోజులుగా రాష్ట్రంలో ప్రచారం చేస్తున్న తన పట్ల ప్రజలు చూపిన ప్రేమాభిమానాలు అనుపమానమైనవని ఆయన అభివర్ణించారు. లేఖలోని విషయాలను ప్రస్తావిస్తూ ట్విట్టర్‌లో ఒక వీడియోను పోస్ట్‌చేస్తూ ట్వీట్లు చేశారు. ' కర్ణాటకలోని సోదరసోదరీమణులకు నమస్కారం. రాష్ట్రంలో ప్రచారం వేళ నాపై మీరు చూపిన ఆదరాభిమానాలు సాటిలేనివి. అన్ని రంగాల్లో కర్ణాటకను అగ్రస్థానంలో నిలపాలన్న నా సంకల్పానికి మీ ప్రేమానురాగాలు మరింత శక్తిని అందించాయి. దేశంలో కర్ణాటకను నంబర్ వన్ రాష్ట్రంగా మార్చే యజ్ఞంలో మీ ఆశీస్సులు నాకు కావాలి. రాష్ట్ర ఉజ్వల భవిత గురించే నా విజ్ఞప్తి. మీ కుటుంబాలు, ముఖ్యంగా యువత భవిష్యత్తు గురించే నా విన్నపం. కన్నడనాట ఈసారి మెజారిటీతో బీజేపీ ప్రభుత్వం రావాలి అనే నినాదాలు ఇంకా నా చెవిలో ప్రతిధ్వనిస్తున్నాయి' అని పేర్కొన్నారు.

నేడు 90 వేల కోట్లు.. నాడు 30 వేల కోట్లే..

''నేడు మనం అమృతకాలంలో పయనిస్తున్నాం. 'ఆజాదీ కా అమృత్ కాల్'లో భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలని ధృఢ సంకల్పంతో ముందుకెళ్తున్నాం. ఈ ఉద్యమాన్ని కర్ణాటక ముందుండి నడిపించి ఈ కలకు నిజం చేయాలి. ప్రస్తుతం ప్రపంచంలో భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. ఇకపై మూడో స్థానమే మన లక్ష్యం. ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా కర్ణాటక ఎదిగినప్పుడే ఇది సాధ్యం. ఇక్కడ బీజేపీ హయంలో ఏటా రూ.99వేల కోట్ల విదేశీ పెట్టుబడులొచ్చాయి. గత సర్కార్‌ల కాలంలో ఇవి కేవలం రూ.30వేల కోట్లే. అత్యంత అనువైన జీవనం, వ్యాపార అనువైన రాష్ట్రంగా కర్ణాటక నంబర్‌వన్ స్థానంలో నిలిచేలా డబుల్ ఇంజన్ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంది. జగత్‌జ్యోతి బసవేశ్వర, కెంపెగౌడ, శ్రీ కనకదాస వంటి మహానుభావులు చూపిన మార్గంలో నడుస్తూ అభినవ కర్ణాటకను నిర్మించే మహాక్రతువులో బీజేపీ నిమగ్నమైంది. ఇకపై మీ కల నా కల. మీ సంకల్పాన్ని నాదిగా భావిస్తున్నా. ఆలోచనలు కలిసి నిర్దేశించుకున్న మన ఉమ్మడి లక్ష్య సాధనను ప్రపంచంలో మరెవరూ ఆపలేరు'' అని లేఖలో మోదీ పేర్కొన్నారు.

నువ్వా.. నేనా..!

భారీ రోడ్ షోలతో మోదీ, జనంతో మమేకమై రాహుల్ ● కర్ణాటక ప్రచారంలో ఇద్దరు నేతల భిన్న శైలి

ఈసారి కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బీజేపీకి ప్రధాని మోదీ, కాంగ్రెస్ తరఫున రాహుల్ గాంధీ పోస్టర్ బోయ్స్‌గా మారారు. ఇతర నేతలూ రంగంలో నిలిచి ముమ్మరంగా కలియదిరిగినా మొత్తం భారాన్ని దాదాపుగా వారిద్దరే తమ భుజస్కంధాలపైనే మోశారు. తమ పార్టీల జయాపజయాలకు ప్రధానంగా వారే బాధ్యులు కానున్నారు...

\- సాక్షి, నేషనల్ డెస్క్



మోదీ ఇలా...

కర్ణాటకలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఎన్నికల ప్రచారం భిన్న శైలిలో సాగింది. ముఖ్యంగా రాజధాని బెంగళూరులో ఓటర్లను ఆకర్షించడానికి వారు చెరో మార్గం అనుసరించారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు చావోరేవోగా మారిన ఈ ఎన్నికల్లో ప్రచార గడువు ముగియడానికి మూడు రోజుల ముందు నుంచి వారిద్దరూ రాజధానిపై ప్రధానంగా దృష్టి సారించారు. శని, ఆదివారాల్లో అట్టహాసంగా మోదీ 30 కిలోమీటర్లకు పైగా భారీ రోడ్ షోలు నిర్వహిస్తే, రాహుల్ మాత్రం సామాన్యుడిలా అందరితోనూ కలిసిపోతూ ప్రచారం చేశారు. మోదీ జేపీ నగర్ నుంచి మల్లేశ్వరం వరకు 26 కి.మీ. పొడవునా, న్యూ తిప్పసంద్ర రోడ్డు నుంచి ట్రినిటి సర్కిల్ దాకా 6.5 కి.మీ. మే చేసిన రోడ్ షోలకు జనం పోటెత్తారు. దారి పొడవునా ఆయనపై పూల వర్షం కురిపించారు. డబుల్ ఇంజన్ సర్కారుతో ప్రయోజనాలు, బజరంగ్ దళ్‌ను నిషేధిస్తామన్న కాంగ్రెస్ మేనిఫెస్టోను ఎండగడుతూ బెంగళూరులో మోదీ ప్రసంగాలు సాగాయి.

రాహుల్ అలా...

రాహుల్ మాత్రం ఆది, సోమవారాల్లో రాజధాని జనంలో కలిసిపోయి ప్రచారం చేశారు. ఫుడ్ డెలివరీ బోయ్‌తో పాటు అతని మోటార్ సైకిల్‌పై ప్రయాణించారు. డెలివరీ యాప్‌ల బాయ్స్‌తో మాట్లాడారు. వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. దారిన పోయే వారిని పలకరిస్తూ సాగారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి వాటిపై చర్చించారు. సోమవారం కాఫీ డేలో కాఫీ తాగుతూ సందడి చేశారు. బస్టాప్‌లో ఉన్న వారితో మాట్లాడారు. బస్సెక్కి ప్రయాణికులతో మాటలు కలిపారు. బొమ్మై ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఇమేజ్‌నే పెట్టుబడిగా పెట్టి ఎన్నికల్ని తన భుజస్కంధాలపై వేసుకున్నారు. రాహులేమో పెరిగిపోతున్న ధరలనే అస్త్రంగా చేసుకొని ఎన్నికల ప్రచారాన్ని ముగించారు.

కర్ణాటకలో బీజేపీ ప్రచారం

మోదీ	6 రోడ్ షోలు; 19 బహిరంగ సభలు, ర్యాలీలు
అమిత్ షా	15 రోడ్ షోలు; 16 సభలు
జేపీ నడ్డా	16 రోడ్ షోలు; 10 సభలు

కర్ణాటక విజయం బీజేపీ, కాంగ్రెస్‌లకు ఎందుకు కీలకమంటే...

బీజేపీ
- కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో స్పష్టమైన విజయం బీజేపీ, కాంగ్రెస్ రెండింటికీ ఎంతో కీలకం.
- అధికారాన్ని నిలబెట్టుకోవడం ద్వారా దక్షిణాదిన తమ చేతిలో ఉన్న ఏకైక రాష్ట్రం చేజారకుండా చూసుకోవడం బీజేపీకి చాలా ముఖ్యం.
- కర్ణాటక గెలుపు అజేయుడైన నాయకునిగా మోదీ స్థానాన్ని మరింత సుస్థిరం చేస్తుంది. ఆయన కరిష్మాను మరింతగా పెంచుతుంది.
- అంతేగాక కీలకమైన 2024 లోక్‌సభ ఎన్నికల వేళ కర్ణాటక వంటి ప్రధాన రాష్ట్రంలో ఓటమి చవిచూస్తే విపక్షాలు దూకుడు పెంచుతాయి.
- గత 38 ఏళ్లలో ఏ పార్టీనీ వరుసగా రెండోసారి గెలిపించని కర్ణాటక ఆనవాయితీని తిరగరాయాలని బీజేపీ కృతనిశ్చయంతో ఉంది.
- బజరంగ్ దళ్‌ను నిషేధిస్తామన్న కాంగ్రెస్ హామీ, ముస్లిం కోటా రద్దుపై ఆ పార్టీ వైఖరి సహా ఏ అవకాశాన్ని వదులుకోకుండా ప్రచారాంశంగా మలచుకుంది.

కాంగ్రెస్
- కొన్నేళ్లుగా వరుసగా ఎన్నికల ఓటములతో బాగా డీలా పడి ఉన్న కాంగ్రెస్‌కు కర్ణాటక గెలుపు ప్రాణావసరమనే చెప్పాలి.
- లోక్‌సభ ఎన్నికల్లో విపక్ష కూటమి ప్రయత్నాలకు ఊపు తెచ్చేందుకు కూడా ఇది టానిక్‌లా ఉపయోగపడుతుంది.
- జనాకర్షక నేతగా ప్రధాని మోదీకి దీటుగా రాహుల్ ఎదగాలంటే ఈ ఎన్నికల్లో ఆయన చేసిన ప్రచారం ఓట్లు రాల్చి పార్టీని గెలిపించడం తప్పనిసరి అవసరం.
- ఇక కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సొంత రాష్ట్రం కావడంతో ఆయనకూ ఈ ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారాయి.
- ప్రచారంలో కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డింది. అన్నాచెల్లెళ్లు రాహుల్, ప్రియాంక కాళ్లకు బలపం కట్టుకుని రాష్ట్రమంతా కలియదిరిగారు. ప్రచారం చివరి దశలో సోనియా కూడా ఒక సభలో పాల్గొన్నారు.
- ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్నెన్నో హామీలు గుప్పించింది. రాష్ట్రంలో మొత్తం రిజర్వేషన్లను ఏకంగా 75 శాతానికి పెంచుతామని కూడా చెప్పింది.
- అయితే పోలింగ్ మరో వారం ఉందనగా వేళ మే 2న ఉన్నట్టుండి బజరంగ్ దళ్‌ను నిషేధిస్తామన్న హామీతో బీజేపీకి చేజేతులా అస్త్రాన్ని అందించింది. కానీ కోస్తా కర్ణాటక మినహా మిగతా రాష్ట్రమంతటా ఈ హామీ తమకు తప్పకుండా ఓట్లు రాలుస్తుందని కాంగ్రెస్ ఆశపడుతోంది.

బొగ్గుపై సుంకం స్కామ్‌లో
ఈడీ దూకుడు
ఛత్తీస్‌గఢ్‌లో రూ.51 కోట్ల ఆస్తులు అటాచ్



న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్‌లో బొగ్గుపై అదనంగా అక్రమ పన్ను కేసులో మనీ లాండరింగ్ కోణంలో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణను వేగవంతం చేసింది. తాజాగా రూ.51.4 కోట్లకుపైగా విలువైన స్థిర, చరాస్తులను అటాచ్ చేసినట్లు ఈడీ మంగళవారం తెలిపింది. వీటిలో రాష్ట్ర కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దేవేందర్ యాదవ్, చంద్రదేవ్ ప్రసాద్ రాయ్, పీసీసీ కోశాధికారి రాంగోపాల్ అగర్వాల్‌లకు సంబంధించిన స్థిరాస్తులు, విలాసవంత వాహనాలు, ఆభరణాలు, నగదు ఉన్నాయి. మహిళా ఐఏఎస్ అధికారి, నాటి రాయ్‌గఢ్ జిల్లా కలెక్టర్ రాణు సాహూ, బొగ్గు వ్యాపారి, కేసులో ప్రధాన నిందితుడు సూర్యకాంత్ తివారీ, కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆర్‌పీ సింగ్ ఆస్తులనూ ఈడీ అటాచ్ చేసింది. రాష్ట్రంలో రూ.2,000 కోట్ల మద్యం కుంభకోణం జరిగిందంటూ కాంగ్రెస్ నేత, రాయ్‌పూర్ మేయర్ సోదరుడు అన్వర్ ధేబర్‌ను ఈడీ అరెస్ట్‌చేసిన కొద్దిరోజులకే ఈ ఆస్తుల జప్తు జరగడం గమనార్హం. ఈడీని బీజేపీ ఏజెంట్‌గా పేర్కొన్న రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేశ్ భగేల్ దీనిని తప్పుడు కేసుగా అభివర్ణించారు.

గెహ్లోత్ వర్సెస్ పైలట్

జైపూర్: రాజస్తాన్ రాజకీయాలు మళ్లీ వేడెక్కాయి. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్‌పై అసంతృప్త నేత సచిన్ పైలట్ వ్యాఖ్యల్ని తీవ్రతరం చేశారు. కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీని కాకుండా బీజేపీ నేత వసుంధర రాజెను తమ నాయకురాలిగా ఆయన భావిస్తారని మండిపడ్డారు. బీజేపీ హయాంలో జరిగిన అవినీతి, ప్రభుత్వ రిక్రూట్‌మెంట్ పరీక్షల్లో పదే పదే పేపర్ల లీకేజీపై విచారణకు డిమాండ్ చేస్తూ గురువారం నుంచి జన్ సంఘర్ష్ యాత్రను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. బీజేపీకి, గెహ్లోత్‌కు రహస్య ఒప్పందాలున్నాయని ఆరోపించారు. ధోల్‌పూర్‌లో ఆదివారం సీఎం అశోక్ గెహ్లోత్ మాట్లాడుతూ 2020లో సచిన్ పైలెట్ కొంతమంది ఎమ్మెల్యేలతో తిరుగుబాటు చేసినప్పుడు మాజీ సీఎం వసుంధరా రాజె తమ ప్రభుత్వాన్ని కాపాడిందని ప్రశంసించారు. డబ్బులు ఎరవేసి తమ ప్రభుత్వాన్ని కూల్చడానికి రాజె ముందుకు రాలేదన్నారు.





ప్రఖ్యాత పులిట్జర్ అవార్డు కింద బ్రేకింగ్ న్యూస్ ఫొటోగ్రఫీ విభాగంలో అవార్డులు పొందిన ఫొటోలు ఇవీ. శ్రీలంక ఆర్థిక సంక్షోభం వేళ ఆగ్రహంతో ప్రజలు కొలంబోలో ప్రధాని రణిల్ కార్యాలయాన్ని ముట్టడించడం, రష్యా దురాక్రమణ నుంచి ఖర్గీవ్‌ను స్వాధీనం చేసుకున్నపుడు ఉక్రెయిన్ సేనలకు స్వాగతం పలికిన మృతదేహం తదితర ఫొటోలకు అవార్డు దక్కింది.

సాక్షి కరీంనగర్

బుధవారం । 10 । మే । 2023



31లోగా సీఎంఆర్ ఇవ్వాల్సిందే

కరీంనగర్అర్బన్: పెండింగ్ సీఎంఆర్ 31 లోగా అందజేయాలని అదనపు కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్ లాల్ రైస్‌మిల్లర్లను ఆదేశించారు. మంగళవారం బకాయి ఉన్న సీఎంఆర్‌పై సమీక్ష నిర్వహించారు.



పత్తి ధర రూ.7,550

జమ్మికుంట: జమ్మికుంట మార్కెట్లో మంగళవారం పత్తి గరిష్టంగా 7,550 కనిష్టంగా రూ.7వేలు పలికింది. 35 వాహనాల్లో 576 క్వింటాళ్ల పత్తి తెచ్చారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.0/27.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఉత్తమ రీజియన్‌గా నిలబెట్టాలి



మాట్లాడుతున్న ఆర్ఎం సుచరిత

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ రీజియన్‌ను కార్పొరేషన్ స్థాయిలో ఉత్తమ రీజియన్‌గా నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని రీజనల్ మేనేజర్ సుచరిత అన్నారు. మంగళవారం రీజనల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం 11డిపోల మేనేజర్లతో సమీక్షించారు. ఏప్రిల్‌లో కరీంనగర్-1, వేములవాడ డిపోలు మాత్రమే లాభాల బాటలో ఉన్నాయని, మిగతా డిపోలు కూడా లాభాలు సాధించినప్పుడే లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. డిప్యూటీ రీజనల్ మేనేజర్ (మెకానికల్) ఎస్.భీంరెడ్డి, డిపో మేనేజర్లు మల్లేశం, వెంకటేశ్వర్లు, అర్పిత, ప్రణీత్, మల్లయ్య, శ్రీనివాస్, నర్సప్ప, ప్రసూన లక్ష్మి, వేదవతి, మనోహర్, మురళీకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం ఆర్ఎం ఎస్.సుచరిత కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

నేడు హైకోర్టు న్యాయమూర్తుల రాక

కరీంనగర్‌క్రైం: జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి, జగిత్యాలలోని బీరప్ప ఆలయ దర్శనానికి బుధవారం హైకోర్టు న్యాయమూర్తులు రానున్నారు. హైకోర్టు న్యాయమూర్తులు కె.లక్ష్మణ్, పి.శ్రీసుధ,ఎం.లక్ష్మణ్, ఎస్.తుకారాంజీ, పి.మాధవిదేవి, సూరేపల్లి నంద, జి.అనుపమ చక్రవర్తి(అడ్మినిస్ట్రేటివ్ జడ్జి), సాంబశివరావు నాయుడు, ఎ.సంతోష్‌రెడ్డి, ఇ.వి.వేణుగోపాల్, కె.శరత్, జె.శ్రీనివాస్‌రావు, నామవరపు రాజేశ్వర్‌రావు ఉదయం హైదరాబాద్‌లో బయలుదేరి మధ్యాహ్నం కొండగట్టుకు చేరుకొని శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు. అనంతరం జగిత్యాల వెళ్లి బీరప్పను దర్శించుకొని సాయంత్రం 3 గంటలకు కరీంనగర్‌కు చేరుకోనున్నారు. కరీంనగర్‌లోని జస్టిస్ ఇ.వి.వేణుగోపాల్ నివాసంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకొని హైదరాబాద్ వెళ్లనున్నారు.

నేడు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ రాక

కరీంనగర్‌క్రైం: రాష్ట్ర మహిళా కమిషన్ బృందం నేడు కరీంనగర్ రానున్నారు. 10,11 తేదీల్లో కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలోని పలు ప్రాంతాలను సందర్శించనున్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ వాకిటి సునీతా లక్ష్మారెడ్డి, సభ్యులు షాహీన్ అఫ్రోజ్, కుమ్ర ఈశ్వరీ బాయి, కొమ్ము ఉమాదేవి, గద్దల పద్మ, సుద్దం లక్ష్మీ, కటారి రేవతిలు బుధవారం ఉదయం 8.30గంటలకు కరీంనగర్ చేరుకుంటారు. జిల్లాజైలును సందర్శించి, కలెక్టరేట్‌లో 11 నుంచి 1.30వరకు మహిళల అభివృద్ధి, గృహహింస, పనిచేసేచోట మహిళలపై లైంగికదాడులు, నేరాలు అనే అంశాలపై అవగాహన కల్పించనున్నారు. మధ్యాహ్నం కలెక్టర్‌తో సమావేశం, సాయంత్రం సఖి, శిశువిహార్, బాలసదన్, స్వధార్‌గృహం, మహిళా వసతిగృహాలు సందర్శించి రాత్రి ధర్మపురికి చేరుకుంటారు. 11 తేదీన మధ్యాహ్నం కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శించి పెద్దపల్లిలోని మహిళా కేంద్రాలను పరిశీలించి హైదరాబాద్ వెళ్లనున్నారు.

మెరిసిన 'సర్కారు' ఆణిముత్యం



మిషా మెహవీన్

సప్తగిరికాలనీ(కరీంనగర్): చదవాలన్న పట్టుదల. ఖాకీడ్రెస్ వేసుకోవాలన్న కోరిక. అక్కల్లాగా తానూ బాగా చదవాలనే తపన.. నాన్న ఆశయాన్ని సాధించాలన్న లక్ష్యం కరీంనగర్ డాక్టర్స్‌స్ట్రీట్‌కు చెందిన మిషా మెహవీన్‌ను రాష్ట్ర స్థాయిలో మెరిసేలా చేసింది. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న మెహవీన్ ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో సీఈసీలో 500మార్కులకు 479 మార్కులు సాధించి స్టేట్ థర్డ్‌ర్యాంక్ కైవసం చేసుకుంది. నాన్న ముజీబ్ పాషా కరీంనగర్ ఆర్టీసీ వన్‌డిపోలో డ్రైవర్, అమ్మ జబీన్ గృహిణి. వీరికి ముగ్గురు ఆడపిల్లలు కాగా మెహవీన్ చిన్న కూతురు. పదోతరగతిలో 9.3 జీపీఏ సాధించింది. తన రెండోసోదరి ఇదే బాలికల జూనియర్ కళాశాలలో చదివి బైపీసీలో 963మార్కులు సాధించింది. తన అక్కలాగే బాగా మార్కులు తెచ్చుకోవాలనే లక్ష్యంతో చదివి స్టేట్ థర్డ్ ర్యాంక్ సాధించింది. 'స్టేట్ థర్డ్ ర్యాంక్ రావడం ఆనందంగా ఉంది. బాగా చదివి సక్సెస్ అయ్యాను. నాన్న పోలీస్ అవుతానని అనుకుని కాలేకపోయారు. నాకు కూడా ఖాకీ డ్రెస్ అంటే ఇష్టం. ఐపీఎస్ అవుతా' అని మెహవీన్ తెలిపింది.

భళా..బాలికా

- ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన అమ్మాయిలు
- సీనియర్ ఇంటర్‌లో 70శాతం, ఫస్టియర్‌లో 69శాతం ఉత్తీర్ణత



విజయచిహ్నం చూపుతున్న ప్రభుత్వ విద్యార్థినులు

కరీంనగర్: ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. బాలికలు భళా అనిపించుకున్నారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో గతేడాది 72శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకుని రాష్ట్రంలో జిల్లా 5వ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ఈసారి 70శాతం ఉత్తీర్ణతతో 8వస్థానంలో నిలిచింది. జనరల్, ఒకేషనల్ విభాగాలు రెండు కలుపుకుని 13,761 మంది విద్యార్థులకు గాను 9,583 మంది ఉత్తీర్ణులయ్యారు. జనరల్ విభాగం బాలురు 6,105 మంది పరీక్షలకు హాజరు కాగా 4,005 మంది ఉత్తీర్ణత సాధించి 65శాతం నమోదు చేసుకున్నారు. బాలికల విభాగంలో 6,186మందికి 4,672 మంది ఉత్తీర్ణత సాధించి 75శాతం నమోదు చేసుకున్నారు. మొత్తం 12,292 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 8,677మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగంలో జిల్లావ్యాప్తంగా 1,469 మంది పరీక్షలు రాయగా 906 మంది ఉత్తీర్ణులయ్యారు. 61శాతం ఫలితాలు నమోదు చేశారు. బాలుర విభాగంలో 833 మంది పరీక్షలకు హాజరు కాగా 411 మంది ఉత్తీర్ణత(49శాతం) సాధించారు. బాలికల విభాగంలో 636మంది హాజరు కాగా 495మంది ఉత్తీర్ణత(77శాతం) సాధించారు.

ఫస్టియర్‌లో 69శాతం ఉత్తీర్ణత

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో ఎప్పటిలాగే బాలికలదే పై చేయిగా నిలిచింది. గతేడాది 69శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకోని రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచింది. ఈసారి 69 శాతం ఉత్తీర్ణత సాధించి 5వ స్థానంలో నిలిచింది. జిల్లావ్యాప్తంగా 14,217 మంది పరీక్షలకు హాజరు కాగా 9934మంది ఉత్తీర్ణులయ్యారు. బాలుర విభాగంలో 7471 మంది పరీక్షలకు హాజరు కాగా 4784 మంది (64శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికల విభాగంలో 6746 మంది పరీక్షలు రాయగా 5150 మంది (76శాత) ఉత్తీర్ణత సాధించారు. బాలుర ఉత్తీర్ణత 64 శాతం కాగా బాలికల ఉత్తీర్ణత 76 శాతం సాధించి బాలుర కన్నా బాలికలు పైచేయిగా నిలిచారు.

ఒకేషనల్‌లో 43 శాతం ఉత్తీర్ణత

జిల్లాలోని వృత్తి విద్యాకళాశాలల్లో 43శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకుని రాష్ట్రంలో జిల్లా 31వ స్థానంలో నిలిచింది. వృత్తి విద్యా కోర్సుల్లో బాలుర విభాగంలో 1,057మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అయ్యారు. వీరిలో 354మంది (33 శాతం)ఉత్తీర్ణులయ్యారు. బాలికల విభాగంలో 681 మందికి గానూ 400మంది (58)ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలో 1,738 మంది విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరుకాగా 754 మంది విద్యార్థులు 43 ఉత్తీర్ణత శాతం నమోదు చేసుకున్నారు.

జూన్ 4నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఈనెల 10 నుంచి 16 వతేదీ వరకు రీ వెరిఫికేషన్, రీవాల్యుయేషన్‌తో పాటు ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చు. రీ కౌంటింగ్‌కు పేపర్‌కు రూ.100, రీ వెరిఫికేషన్‌కు రూ.600లు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 4 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు జరుగుతాయి. ఫెయిలైన విద్యార్థులు ఎలాంటి బెంగ లేకుండా సప్లమెంటరీ పరీక్షలకు హాజరు కావాలి. – టి.రాజ్యలక్ష్మి, డీఐఈవో, కరీంనగర్

ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ప్రతిభ

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. జిల్లావ్యాప్తంగా 11 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్రథమ సంవత్సరంలో ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కరీంనగర్ కళాశాలలో 236 మందికి గాను 87 మంది ఉత్తీర్ణత సాధించారు. సైన్స్ కళాశాలలో 324 మందికి 100 మంది, కరీంనగర్ బాలికల జూనియర్ కళాశాలలో 571 మందికి 290 మంది, మానకొండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 150 మందికి 30 మంది, గంగాధర జూనియర్ కళాశాలలో 56 మందికి 10 మంది, హుజూరాబాద్ కళాశాలలో 164 మందికి 34 మంది, సైదాపూర్ జూనియర్ కళాశాలలో 60కి 24 మంది, జమ్మికుంటలో 268మందికి 86 మంది, వీణవంకలో 72 మందికి 52 మంది, చిగురుమామిడిలో 68 మందికి 26 మంది, చొప్పదండిలో 78 మందికి 24మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో కరీంనగర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలో 274 మందికి గాను 122 మంది, సైన్స్ కళాశాలలో 405 మందికి 188 మంది, బాలికల జూనియర్ కళాశాలలో 598 మందికి 347 మంది, మానకొండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 184 మందికి 39 మంది, గంగాధర జూనియర్ కళాశాలలో 90 మందికి 18 మంది, హుజూరాబాద్‌లో 176 మందికి 58 మంది, సైదాపూర్‌లో 64 మంది కి 41 మంది, జమ్మికుంటలో 203 మందికి 101 మంది, వీణవంకలో 91 మందికి 59 మంది, చిగురుమామిడిలో 70 మందికి 43 మంది, చొప్పదండిలో 86 మందికి 36 మంది ఉత్తీర్ణత సాధించారు.

సమ్మెపై తగ్గేదే లే!

- పట్టువీడని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు
- జేపీఎస్‌ల ఇళ్లకు నోటీసులు అంటించిన డీపీవో సిబ్బంది
- సాయంత్రం 5గంటలతో ముగిసిన ప్రభుత్వ గడువు
- టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రితో చర్చలు విఫలం
- న్యాయం జరిగేవరకూ సమ్మె సాగుతుందని స్పష్టీకరణ



జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న ఈటల రాజేందర్, తదితరులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తమ సర్వీసు రెగ్యులరైజ్ చేయాలంటూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మె మరింత ఉధృతమైంది. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయానికి సమ్మె విరమించి సర్వీసులో చేరాలన్న ప్రభుత్వ ఆదేశాలను జూనియర్ పంచాయతీ సెక్రటరీ (జేపీఎస్)లు తిరస్కరించారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు తాము సమ్మె వీడేది లేదని, ముందుకు సాగడమే తమ నిర్ణయమంటూ తేల్చి చెప్పారు. దీంతో సమ్మె తీవ్రతరం కానుంది. సర్వీసు క్రమబద్ధీకరణ కోసం సమ్మె చేపట్టిన జూనియర్ పంచాయతీ సెక్రటరీలను మంగళవారం సాయంత్రం 5 గంటల్లోపు విధుల్లో చేరాలని ఆశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సోమవారం ఆదేశించిన విషయం తెలిసిందే.

నోటీసులపై జేపీఎస్‌ల మండిపాటు

తమ డిమాండ్లు నెరవేర్చకుండా విధుల నుంచి తొలగిస్తామంటూ ఇళ్లకు నోటీసులు అంటించడంపై జేపీఎస్‌లు మండిపడుతున్నారు. ఇళ్లకునోటీసులు అంటించడం ద్వారా కుటుంబ సభ్యులను మభ్యపెట్టి, వారిని ఆందోళనకు గురిచేసే ఎత్తుగడగా అభివర్ణిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం మంత్రి ఎర్రబెల్లి 32 జిల్లాకు ఒకరి చొప్పున జేపీఎస్‌లతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా చర్చలు జరిపారు. జేపీఎస్‌ల అంతా సమ్మె విరమించి విధుల్లో చేరాలని మంత్రి కోరగా.. తమకు లిఖితపూర్వక హామీకి పట్టుబట్టడంతో చర్చలు అసంపూర్తిగానే ముగిశాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం (పెద్దపల్లి: 208, జగిత్యాల: 306, కరీంనగర్: 226, సిరిసిల్ల: 198)938 మంది జేపీఎస్‌లు నాలుగేళ్లుగా పనిచేస్తున్నారు. మంగళవారం కలెక్టరేట్ ఎదురుగా శిబిరంలో సమ్మె చేస్తున్న జేపీఎస్‌లను బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షులు కోదండరాం, బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ, జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, కాంగ్రెస్ నేతలు కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డిలు తదితర ప్రజాసంఘాల నేతలు పరామర్శించి మద్దతు తెలిపారు.

సమస్య ఏంటి?

జూనియర్ పంచాయతీ సెక్రటరీల రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ టీఎస్‌పీఎస్‌సీ ద్వారా 2018 ఆగస్టు 31న జారీ అయ్యింది. ఎంపికైన వారు 2019 ఏప్రిల్ 19న సర్వీసులో చేరారు. బేసిక్ సర్వీస్ కండిషన్స్‌లో మూడేళ్ల సర్వీసు తరువాత గ్రేడ్-4 పంచాయతీ సెక్రటరీగా గుర్తిస్తూ సర్వీసు రెగ్యులరైజ్ చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. ఇక్కడ కాంట్రాక్టు అనే పదం ఎక్కడా పేర్కొనలేదు, కేవలం ఇది ప్రభుత్వ ఉద్యోగమని, తొలి మూడేళ్లకాలాన్ని ప్రొహిబిషన్ కాలంగా పరిగణిస్తామని వివరించింది. ప్రొహిబిషన్ కాలం ముగిసినా.. వారిని రెగ్యలరైజ్ చేయకుండా 2021, జూలై15న జీవో.26 జారీ చేశారు. ఈ జీవోలో 'అగ్రిమెంట్' అనే కొత్త పదం తీసుకువస్తూ.. ప్రొహిబిషన్ కాలాన్ని ఏడాదిపాటు పెంచారని జేపీఎస్‌లు ఆరోపిస్తున్నారు. అనంతరం నాలుగు సంవత్సరాల సర్వీసు పూర్తయిన తరువాత కూడా వీరికి సర్వీసు రెగ్యులర్ చేయలేదు. దీంతో కార్యదర్శులు ఏప్రిల్ 13న నోటీసులిలిచ్చి, 28 నుంచి సమ్మెలోకి దిగారు.

నోటీసులివ్వడం దారుణం



ప్రభుత్వం సమ్మెతో చర్చకు రాకుండా భయ భ్రాంతులకు గురిచేసేలా ప్రవర్తిస్తోంది. తమను మంగళవారం సాయంత్రం 5 గంటల్లోపు విధుల్లో చేరకపోతే, శాశ్వతంగా తొలగిస్తామన్న ఆదేశాలను మా ఇళ్లకు అంటించడం ముమ్మాటికీ బెదిరించడమే. ఈ చర్య మా కుటుంబ సభ్యుల్లో ఆందోళన రెకెత్తించేలా ఉంది. కానీ, మేం ప్రభుత్వం ఎత్తుగడలకు మేం తలవంచం. – మనోహర్‌రెడ్డి

మాట నిలబెట్టుకోవాలి



వాస్తవానికి మేమేం కొత్త కోరికలు కోరడం లేదు. మేము సర్వీసులో చేరే క్రమంలో ఇచ్చిన మాటనే నిలబెట్టుకోవాలని అడుగుతున్నాం. దీనిపై ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయం. కాంట్రాక్టు అన్న పదాన్ని కొత్తగా చేర్చి ప్రభుత్వం తాను ఇచ్చిన మాట నుంచి తప్పించుకునే యత్నం చేస్తోంది. నోటిఫకేషన్ సమయంలో పేర్కొన్న విధంగా మా అందరినీ క్రమబద్ధీకరించాల్సిందే. – శ్రీనివాస్

విధుల్లో చేరిన కొందరు?

కొందరు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె వీడి విధుల్లో చేరారని పంచాయతీ అధికారులు తెలిపారు. కరీంనగర్ జిల్లా చొప్పదండిలో నలుగురు, రామడుగులో ముగ్గురు, గంగాధరలో నలుగురు, మానకొండూరులో ఒకరు, జమ్మికుంటలో ఇద్దరు, సైదాపూర్‌లో ఒక్కరు.. ఇలా జిల్లావ్యాప్తంగా 57మంది విధుల్లో చేరినట్లు తెలిపారు. సిరిసిల్లలో తొమ్మిది మంది విధుల్లో చేరారని సమాచారం. జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలో ఎవరూ విధుల్లో చేరలేదని, అందరూ సమ్మెలోనే కొనసాగుతున్నారు.

'పర్మినెంట్ చేయమంటే బెదిరింపులా?'

కరీంనగర్‌టౌన్: రాష్ట్రానికి కేసీఆర్ జాగీరు కాదని, పంచాయతీ కార్యదర్శులు పర్మినెంట్ చేయమని సమ్మెకు దిగితే బెదిరింపులకు పాల్పడడం సిగ్గుచేటని హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ మండిపడ్డారు. కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, ఒక దీక్ష చేపట్టిన వీఏవోలకు సంఘీభావం తెలిపారు. రోజూ 16 గంటల పాటు గ్రామాల అభివృద్ధి కోసం పని చేసే పంచాయతీ కార్యదర్శులు మూడేళ్ల ప్రొహిబిషన్ పీరియడ్‌ను రెండేళ్లకు తగ్గించాలని కోరితే, దాన్ని ప్రభుత్వం నాలుగేళ్లకు పెంచిందన్నారు. కేసీఆర్ ఇంట్లో నుంచి ఉద్యోగులకు జీతాలు ఇవ్వడంలేదని, ఉద్యోగాలు తీసేసే హక్కు కేసీఆర్‌కు లేదన్నారు. అనంతరం వీఏవోలకు సంఘీభావం ప్రకటించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నేతలు పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శులకు డెడ్‌లైన్ పెట్టి బెదిరించడం సిగ్గుచేటని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు సంఘీభావం ప్రకటించారు.

కరీంనగర్- హసన్‌పర్తి రైల్వేలైన్‌కు ఆమోదం

సాక్షిప్రతినిధి,కరీంనగర్: కరీంనగర్– హసన్‌పర్తి కొత్త రైల్వేలైన్ ఫైనల్ లొకేషన్ సర్వే పనులకు రైల్వేబోర్డు మంగళవారం ఆమోదం తెలిపింది. సర్వే పూర్తయిన వెంటనే ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్)కు మార్గం సుగుమం కానుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ గత నెల 21న న్యూఢిల్లీలో రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. దాదాపు 62 కి.మీల మేరకు పనులుసాగే ఈ లైన్ పూర్తయితే ఉమ్మడి కరీంనగర్, వరంగల్ ప్రజలకు ప్రయోజనకరం.

రూ.4,886.92 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక



వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేసిన కలెక్టర్ కర్ణన్

- వ్యవసాయ, మార్కెటింగ్ రంగాలకు రూ.3579.37కోట్లు
- సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి సంస్థలకు రూ.1063.79 కోట్లు
- కలెక్టర్ ఆర్.వీ.కర్ణన్

కరీంనగర్ అర్బన్: వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ ఆర్వీ కర్ణన్ మంగళవారం ప్రకటించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.4886.92 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక ఖరారు చేయడం జరిగిందని అన్నారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో జరిగిన డీసీసీ/డీఎల్ఆర్‌సీ సమావేశంలో ప్రణాళికను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రుణ ప్రణాళికలో ప్రాధాన్యత రంగాలైన వ్యవసాయం, వాణిజ్యం, విద్య, గృహ రుణాలు, మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక రంగాలకు రూ.4886.92 కోట్లు, ప్రాధాన్యత లేని రంగాలకు రూ. 2595 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. మార్కెటింగ్ కోసం 2,16,282మంది రైతులకు రూ.2302.32 కోట్ల మేరకు పంట రుణాలు ఇవ్వనున్నట్లు, వ్యవసాయానికి టర్మ్‌లోన్ కింద 9,554మందికి రూ.295.35 కోట్లు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలకు సంబంధించి 11,337 రైతులకు రూ.222.12 కోట్లు, వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు 1140 మంది రైతులకు 94.99 కోట్లు, వ్యవసాయ టర్మ్ రుణాలకు 4432 రైతులకు 664.59 కోట్ల రూపాయలు, సూక్ష్మ సంస్థలకు 13873 యూనిట్లకు 277.41 కోట్లు, చిన్న సంస్థలకు 7349 యూనిట్స్‌కు 330.75 కోట్లు, మధ్యతరగతి సంస్థలకు 787 యూనిట్లకు 455.63 కోట్లు రుణాలు ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందని అన్నారు. విద్యారుణాల కింద 827మందికి 40.50 కోట్లు, గృహరుణాల కింద 1772 మందికి 176 కోట్లు, సామాజిక సదుపాయాల కోసం 444 యూనిట్లకు 17.52 కోట్లు, పునరుత్పాదక శక్తి క్రింద 487 యూనిట్లకు 9.74 కోట్లు ఇతర ప్రాధాన్యతా లేని రంగాలకు 2595 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు. ఆయా రంగాలకు కేటాయించిన రుణాలు త్వరితగతిన మంజూరు చేయాలని ఆదేశించారు. ఎల్‌డీఎం టీవీ సీతారామాంజనేయులు, నాబార్డ్ ఏజీఎం ప్రకాష్, డీఆర్‌డీవో శ్రీలత, జిల్లా పరిశ్రమల జీఎం నవీన్ కుమార్, మెప్మా పీడీ సతీశ్, డీఏవో శ్రీధర్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి మనోహర్‌రావు, బ్యాంకర్లు ఉన్నారు.

చట్టానికి అనుగుణంగా సేవలందించాలి



కరీంనగర్‌క్రైం: చట్టానికి అనుగుణంగా పోలీసులు సేవలందించాలని మల్టీజోన్-1 ఐజీ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. రాజన్న జోన్ డీఐజీ రమేశ్‌నాయుడు, సీపీ ఎల్.సుబ్బరాయుడు స్వాగతం పలికారు. కమిషనరేట్‌లోని అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. అక్రమ కార్యకలాపాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. వివిధ రకాల కేసుల విచారణ సందర్భంగా ప్రత్యక్ష దర్యాప్తు చేయాలని అన్నారు. మహిళల రక్షణ, భద్రతకు పోలీస్‌శాఖ తీసుకుంటున్న చర్యలపై అవగాహన కల్పించాలని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే పోలీసులపై శాఖాపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. 5ఎస్ ప్రోగ్రాం అమలును అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం సిబ్బందికి వాహనాలు అందించారు. క్యూఆర్టీ సిబ్బందికి యూనిఫాం,షూ అందించారు. మృతిచెందిన పలువురు సిబ్బంది కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు. అడిషనల్ డీసీపీలు ఎస్.శ్రీనివాస్(శాంతిభద్రతలు), జి.చంద్రమోహన్ (పరిపాలన), ఎం.భీంరావు(సీఏఆర్), ఏసీపీలు తుల శ్రీనివాసరావు, కరుణాకర్‌రావు, శ్రీనివాస్, వెంకటరెడ్డి, బి.విజయ్ కుమార్, మదన్‌లాల్, కాశయ్య, సత్యనారాయణ, సి.ప్రతాప్ పాల్గొన్నారు.

పాలియేటివ్‌కేర్‌ను సద్వినియోగం చేసుకోండి

కరీంనగర్‌టౌన్: జిల్లా ఆస్పత్రి ఆవరణలో ఉన్న పాలియేటివ్ కేర్‌సెంటర్‌ను అవసానదశలో ఉన్న రోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ లలితాదేవి సూచించారు. మంగళవారం పాలియేటివ్ కేర్‌ను సందర్శించి సెంటర్‌లో అందిస్తున్న సేవలు, వైద్యులు, సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ... దీర్ఘకాలికవ్యాధులతో బాధపడుతూ చివరిదశలో ఉన్న రోగులకు స్వాంతన చేకూర్చడం కోసం ప్రభుత్వం పాలియేటివ్ కేర్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కేంద్రంలో ఏడుపడకలు, ఒక వైద్యాధికారి పర్యవేక్షణలో నలుగురు స్టాఫ్ నర్సులు, ఒక ఫిజియోథెరపిస్ట్ సేవలందిస్తున్నారని తెలిపారు. ఈ కేంద్రంలో ఓపితో పాటు ఇన్ పేషెంట్, ఇంటి వద్దనే సేవలు అందించడం ఇలా మూడు రకాలైన సేవలను అందించడం జరుగుతుందన్నారు. ఈ కేంద్రం ద్వారా ఇప్పటివరకు 1100 మందిని గుర్తించి సేవలు అందించామని తెలిపారు. ఇంటి వద్ద సేవలు అందించడానికి ఆలన వాహనం ఏర్పాటు చేశామన్నారు. పాలియేటివ్ కేంద్రం గురించి సమన్వయం చేయడానికి ప్రోగ్రాం అధికారిగా డాక్టర్ సుజాతను నియమించినట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

జేపీఎస్‌ల సమ్మెపై సర్క్యులర్‌ అనైతిక చర్య

కరీంనగర్‌: జేపీఎస్‌ల నిరవధిక సమ్మెను విరమించాలని సర్క్యులర్‌ జారీ చేయడం అనైతిక చర్య అని తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా చైర్మన్‌ వెంకటేశ్వర్లు, జిల్లా కో–ఆర్డినేటర్‌ మహమ్మద్‌ ఫయాజ్‌ అలీలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంఘాలు పెట్టుకొని, సమస్యలు పరిష్కరించుకోవడం రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కు అని తెలిపారు. నాలుగేళ్ల ప్రొబెషనరీ పీరియడ్‌ పూర్తయినా రెగ్యులరైజ్‌ చేయకపోవడం అన్యాయం కాదా అని ప్రశ్నించారు. పంచాయతీ కార్యదర్శులు ఐక్యంగా ఉండి, తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు ముందుకువెళ్లాలని సూచించారు.

జూనియర్‌ కాలేజీల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్‌: 2023–24 విద్యాసంవత్సరానికిగాను రెప్యూటెడ్‌(కార్పొరేట్‌) జూనియర్‌ కళాశాలల స్కీంకు జిల్లాలోని ప్రైవేటు జూనియర్‌ కళాశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్‌ కులాల అభివృద్ధిశాఖ ఉపసంచాలకుడు నేతానియల్‌ ఒక ప్రకటనలో తెలిపారు. రెసిడెన్షియల్‌ వసతి, విద్యాబోధనలో ఉన్నత ప్రమాణాలు కలిగి, కాంపిటీటివ్‌ పరీక్షల్లో ఎక్కువ ఉత్తీర్ణతా శాతం కలిగిన కళాశాలలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదేళ్లకు సంబంధించిన అకాడమిక్‌ ప్రొఫైల్‌ జత చేయాలన్నారు. https://telanganaepass.cgg.gov.in లో కళాశాలల ఈ–పాస్‌ యూజర్‌ ఐడీ, పాస్‌వర్డ్‌తో లాగిన్‌ అయ్యి, ఈ నెల 15వ తేదీలోగా రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలని తెలిపారు. సంబంధిత వివరాలను ఈ నెల 16న సాయంత్రం 5 గంటల్లోగా షెడ్యూల్డ్‌ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు.

రేపు ఉమ్మడి జిల్లా బాక్సింగ్‌ జట్ల ఎంపిక

కరీంనగర్‌ స్పోర్ట్స్‌: ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా బాక్సింగ్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో కరీంనగర్‌ అంబేద్కర్‌ స్టేడియంలో ఈ నెల 11న ఉమ్మడి జిల్లాస్థాయి యూత్‌ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి.సత్యనారాయణ, కొత్తకొండ సంపత్‌కుమార్‌ తెలిపారు. ఈ పోటీల్లో రాణించిన క్రీడాకారులను ఈ నెల 13, 14వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు 2005 జనవరి నుంచి 2006 డిసెంబర్‌ 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఆధార్‌కార్డు, ఎస్సెస్సీ మెమో, ఎంట్రీ ఫీజుతో ఉదయం 8 గంటలకు రిపోర్టు చేయాలని, పూర్తి వివరాలకు 91006 68474 ఫోన్‌ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బీసీలను కులాలవారీగా లెక్కించాలి



కరీంనగర్‌: దేశవ్యాప్తంగా బీసీలను కులాలవారీగా లెక్కించాలని, కేంద్ర ప్రభుత్వ కేబినెట్‌లో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బొల్లం లింగమూర్తి, బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ దుబ్బాక రమేశ్‌లు డిమాండ్‌ చేశారు. మంగళవారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా అధ్యక్షుడు మునిగంటి అశ్విన్‌ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలో వారు మాట్లాడారు. కేంద్రం బీసీలను ఓటుబ్యాంకుగా వాడుకుంటోందని ఆరోపించారు. చట్టసభల్లో విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్‌ బిల్లు ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు. 2018లో అప్పటి కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌ సింగ్‌ 2021లో జరగబోయే దేశవ్యాప్త జనాభా లెక్కల్లో బీసీ కులాలవారిని లెక్కిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. కానీ ఆ తర్వాత వదిలేశారన్నారు. అనంతరం దీక్షను తెలంగాణ ఉద్యమకారుడు బొంతు వెంకటమల్లయ్య, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం లీగల్‌ అడ్వైజర్‌ కుక్కల అశోక్‌లు విరమింపజేశారు. నాయకులు ఆంజనేయులు, అజయ్‌, వేణుగోపాల్‌, శ్రీనివాస్‌ తదితరులున్నారు.

‘ఇంటర్‌’లో ప్రభుత్వ కళాశాలల సత్తా



నవ్యశ్రీ



అజయ్‌



సుమన్‌



సబా



చందు



లిఖిత



స్రవంతి

వీణవంక(హుజూరాబాద్‌): మంగళవారం ప్రకటించిన ఇంటర్మీడియట్‌ ఫలితాల్లో చొప్పదండి, హుజూరాబాద్‌, మానకొండూర్‌ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలు, మోడల్‌ స్కూళ్ల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీణవంక మండలంలోని ఘన్ముక్కుల మోడల్‌ స్కూల్‌ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో కరుణశ్రీ(968/1000), బైపీసీలో శ్రీవాణి 908/1000, సీఈసీలో నరేశ్‌ 915/1000, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో అభినయ్‌ 455/470, బైపీసీలో లక్ష్మీప్రసూన 390/440, సీఈసీలో అర్చన 453/500 మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వేణుగోపాల్‌రెడ్డి, లెక్చరర్లు అభినందించారు.

ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో..

వీణవంక ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో సెకండియర్‌ ఎంపీసీలో మర్రి తిరుమల 863/100, బైపీసీలో గుంపుల అజయ్‌ 851/1000, సీఈసీలో ఓరెం నిస్సి 784/1000, ఫస్టియర్‌ ఎంపీసీలో దాసారపు విశ్వనాథ్‌ 392/470, బైపీసీలో అక్షిత 404/440, సీఈసీలో గట్టు నిరోజ 408/500 మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌ కొల్ల రాజిరెడ్డి అభినందించారు.

సైదాపూర్‌: సోమారం ఆదర్శ పాఠశాలలో ఎంపీసీ రెండో సంవత్సరం ఫలితాల్లో ఎ.నవ్యశ్రీ 963 మార్కులు సాధించి, మండల టాపర్‌గా నిలిచింది. ఆదర్శ పాఠశాలలో ఫస్టియర్‌లో 51.46 శాతం, సెకండియర్‌లో 58.2 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ జూనియర్‌ కాలేజీలో ఫస్టియర్‌లో 55 మందికి గాను 24 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 52 మందికి 42 మంది ఉతీర్ణులయ్యారు. మండల టాపర్‌గా నిలిచిన నవ్యశ్రీని ప్రిన్సిపాల్‌ ఫర్హానా అభినందించారు.

మైనారిటీ గురుకుల విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్‌ మండలంలోని మొగ్దుంపూర్‌ మైనారిటీ గురుకుల కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియెట్‌ ఫలితాల్లో సత్తా చాటారు. సెకండియర్‌లో 98 శాతం, ఫస్టియర్‌లో 80 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్‌ ఒకేషనల్‌ ఈటీ ద్వితీయ సంవత్సరంలో ఆర్‌.అజయ్‌ 974/1000, ఎంఎల్‌టీ మొదటి సంవత్సరంలో ఎం.సుమన్‌ 480/500 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్‌ పోరండ్ల చంద్రమోహన్‌ తెలిపారు.

శంకరపట్నం(మానకొండూర్‌): మండలంలోని కేశవపట్నం కేజీబీవీలో ఇంటర్‌ ఫస్టియర్‌ బైపీసీలో స్రవంతి 421/440, సెకండియర్‌ ఎంపీసీలో లిఖిత 967/1000 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్‌ జ్యోతి తెలిపారు. మోడల్‌ స్కూల్‌ ఇంటర్‌ సెకండియర్‌ ఎంపీసీలో సబా 980/1000, ఫస్టియర్‌ ఎంపీసీలో కాసిరాజు చందు 450/470 మార్కులు సాధించారు.

హుజూరాబాద్‌: స్థానిక మైనారిటీ గురుకుల కళాశాల బాలుర విద్యార్థులు ఇంటర్‌ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. ఫస్టియర్‌ ఎంపీసీ విభాగంలో ఎండీ.అష్రఫుల్‌ 416, జి.రుత్విక్‌ 408, బైపీసీ విభాగంలో కె.కృష్ణకౌశిక్‌ 421, జి.బలరాం 408, సెకండియర్‌ ఎంపీసీ విభాగంలో ఎండీ.ఖాయిస్‌ 965, ఎండీ.జమీర్‌ 963, కె.తరుణ్‌నాయక్‌ 960 మార్కులు, బైపీసీ విభాగంలో జె.రాజ్‌కుమార్‌ 889, తౌసిఫ్‌ రెహమాన్‌ 824 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్‌ కె.కుమారస్వామి తెలిపారు.

గంగాధర(చొప్పదండి): కొండన్నపల్లి శివారులోని మోడల్‌ స్కూల్‌ విద్యార్థులు ఇంటర్‌ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించారు. సెకండియర్‌ ఎంపీసీలో వి.కావ్యశ్రేణి 986, సాహిత్య 975, జాహ్నవి 970, అనుష్క 969, బైపీసీలో లౌకిక 959, సరయు 946, అభిసాత్విక 944, సీఈసీలో అశ్విత 962, అక్షిత 946, నందిని 930 మార్కులు సాధించారు. ఫస్టియర్‌ ఎంపీసీలో సాయితనిష్క 455, బైరి అక్షయ 453, శ్రవణ్‌ 451, బైపీసీలో శ్రావణి 430, ఇందు, విజితలు 405, సీఈసీలో శిరీష 427, కావ్య, విఘ్నేషలు 424 మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌, ఉపాధ్యాయులు అభినందించారు.

మానకొండూర్‌: స్థానిక దేవంపల్లి గురుకుల పాఠశాలలో ఫస్టియర్‌ ఎంపీసీలో వి.గణేశ్‌ 458, పి.నిఖిల్‌ 448, శివసాయి 446, బైపీసీలో విశ్వనాథ్‌ 415, కె.జీవన్‌ 403, ఎం.అంజి 398 మార్కులు, సెకండియర్‌ ఎంపీసీలో ఎస్‌.విశాల్‌ 964, ఎ.శివచరణ్‌ తేజ 959, కె.రంజిత్‌ 932, బైపీసీలో కె.నర్సింహ 951, యు.ఉమాపతి 930, జి.శశాంక్‌ 927 సాధించారు. పోచంపల్లి మోడల్‌ స్కూల్‌లో ఫస్టియర్‌ ఎంపీసీలో ఎస్‌. రేష్మ 423, గొల్ల సంజన 419, బైపీసీలో కొత్తకొండ అక్షిత 401, సీఈసీలో నల్లెంగుల అఖిల 471, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో పోలు నరేందర్‌ 961, బొమ్మరవేని లత 940, కర్రె శ్రుతి 938, బైపీసీలో కాల్వ అశ్విని 960, సీఈసీలో గోగూరి కీర్తన 941 మార్కులు సాధించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి



జనార్దన్‌ రెడ్డి (ఫైల్‌)

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు మృతిచెందినట్లు ఎల్‌ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బెజ్జంకి మండలంలోని బేగంపేటకు చెందిన తానం జనార్దన్‌రెడ్డి(72) ద్విచక్రవాహనంపై సోమవారం కరీంనగర్‌ వెళ్లాడు. సాయంత్రం కూరగాయలు తీసుకువస్తుండగా ఎల్‌ఎండీ కాలనీ తాపాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద హైదరాబాద్‌ నుంచి కరీంనగర్‌ వైపు వెళ్తున్న జగిత్యాల జిల్లా లక్ష్మీపూర్‌కు చెందిన జనార్దన్‌ బైక్‌పై వేగంగా వచ్చి, ఢీకొట్టాడు. ఈ ఘటనలో జనార్దన్‌రెడ్డి తల, కంటికి గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం తెల్లవారుజామున చనిపోయాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాడు తండ్రి.. నేడు కుమారుడు

- అనారోగ్యం, గుండెపోటుతో మూడేళ్ల వ్యవధిలో ఇద్దరూ మృతి
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబసభ్యులు
- కన్నాపూర్‌లో విషాదం



రమేశ్‌ మృతదేహం

శంకరపట్నం(మానకొండూర్‌): మండలంలోని కన్నాపూర్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి నూనె రమేశ్‌(32) గుండెపోటుతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. నూనె ధనలక్ష్మి–రాజయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు రమేశ్‌ ఉన్నారు. రాజయ్య సింగరేణిలో పని చేస్తూ మూడేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. రమేశ్‌ ప్రస్తుతం శ్రీరాంపూర్‌లో సింగరేణి ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల బంధువుల వివాహం ఉండటంతో ఇంటికి వచ్చాడు. మంగళవారం తల్లి ధనలక్ష్మి, భార్య దివ్య, నానమ్మ వీరమ్మలతో కలిసి కారులో కన్నాపూర్‌ నుంచి మొలంగూర్‌ వెళ్లాడు. తిరిగి స్వగ్రామం వస్తుండగా కడుపులో తిప్పుతోందని చెప్పి, కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌ సమీపంలో వాహనం ఆపాడు. కొంతదూరం నడుచుకుంటూ వెళ్లి, కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు 108కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి, పరీక్షించి, గుండెపోటుతో మృతిచెందినట్లు నిర్ధారించారు. మూడేళ్ల క్రితం భర్త రాజయ్య అనారోగ్యంతో మృతిచెందగా కళ్లముందే కొడుకు గుండెపోటుతో చనిపోవడంతో ధనలక్ష్మి గుండెలవిసేలా రోదించింది. మృతుడి భార్య, కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

విద్యుత్‌ చౌర్యం కేసులో జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్‌): జమ్మికుంట మండలంలోని పాపక్కపల్లికి చెందిన గొడుగు తిరుపతికి విద్యుత్‌ చౌర్యం కేసులో న్యాయమూర్తి రూ.11,520 జరిమానా విధించారు. చెల్లించకపోతే రెండు నెలల సాధారణ జైలుశిక్ష విధించాలని తీర్పు వెలువరించినట్లు విద్యుత్‌శాఖ విజిలెన్స్‌ ఇన్‌స్పెక్టర్‌ బి.స్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. తిరుపతి తొలిసారి విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తూ పట్టుబడగా మొదటి నేరంగా పరిగణించి, రూ.1,000 జరిమానా విధించి, వదిలేశారు. ఇంటికి అక్రమంగా విద్యుత్‌ వినియోగిస్తూ రెండోసారి పట్టుబడగా అతనిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు. జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్రీవాణి ఎదుట తిరుపతి తన తప్పును ఒప్పుకున్నాడు. దీంతో జడ్జి అతనికి శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. విద్యుత్‌ చౌర్యానికి పాల్పడితే చట్టప్రకారం శిక్ష తప్పదని సీఐ హెచ్చరించారు. ఎస్సై ఎ.నిరంజన్‌రెడ్డి, టి.నరేశ్‌, సిబ్బంది పాల్గొన్నారు.

పార్కు స్థలాల రక్షణకు చర్యలు

- డీసీపీ సుభాశ్‌

సాక్షి ఎఫెక్ట్‌

కరీంనగర్‌ కార్పొరేషన్‌: నగరంలోని పార్కు స్థలాల రక్షణకు చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ డీసీపీ సుభాశ్‌ తెలిపారు. ఈ నెల 7న ‘పార్కు స్థలంలో నిర్మాణాలు’ పేరిట వచ్చిన ‘సాక్షి’ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మంగళవారం ఆయన స్పందించారు. కరీంనగర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని పార్కు స్థలాలు ఆక్రమణకు గురైతే ఆధారాలతో తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

దారి దోపిడీ దొంగల అరెస్టు

కొత్తపల్లి(కరీంనగర్‌): పట్టణ శివారులోని కరీంనగర్‌–జగిత్యాల ప్రధాన రహదారిపై దారి దోపిడీకి పాల్పడుతున్న దొంగలను మంగళవారం కొత్తపల్లి పోలీసులు అరెస్టు చేశారు. గోపాల్‌రావుపేటకు చెందిన బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు 24 గంటల్లో ముగ్గురిని పట్టుకున్నారు. రేకుర్తి విజయపురికాలనీకి చెందిన దుర్గం విజయకుమార్‌ అలియాస్‌ బుగ్గ, రేకుర్తి సాలెహ్‌నగర్‌కు చెందిన అబ్దుల్‌ అజీజ్‌ ఖురేషి, రేకుర్తి ఇందిరానగర్‌కు చెందిన సర్వోళ్ల సందీప్‌లను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై బి.ఎల్లయ్యగౌడ్‌ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): అనారోగ్య కారణాలతో ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నుస్తులాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై ప్రమోద్‌ రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లచ్చవ్వ(77) కొంతకాలంగా కడుపు నొప్పి, మోకాళ్ల నొప్పులతోపాటు వయోభారంతో బాధ పడుతోంది. చికిత్స పొందినా ఆరోగ్యం మెరుగుపడలేదు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఆమె మంగళవారం ఉదయం 6 గంటలకు ఇంట్లోనే దూలానికి ఉరేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని కరీంనగర్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దేశాయిపల్లిలో అదృశ్యం.. గుజరాత్‌లో ప్రత్యక్షం

- నెల రోజుల క్రితం తప్పిపోయిన వృద్ధురాలు
- ఇంటికి తీసుకువస్తున్న కుటుంబసభ్యులు



గుజరాత్‌లో పుష్పలత

వీణవంక(హుజూరాబాద్‌): నెల రోజుల క్రితం తప్పిపోయిన ఓ వృద్ధురాలు గుజరాత్‌లో ప్రత్యక్షమైంది. పోలీసుల సహాయంతో ఆమె స్వగ్రామానికి వస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. వీణవంక మండలంలోని దేశాయిపల్లికి చెందిన ముసిపట్ల పుష్పలత(60)కి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఆమె భర్త చనిపోగా ఏడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతిచెందాడు. అప్పటినుంచి మతిస్థిమితం కోల్పోయిన పుష్పలత ఎల్కాక ప్రణమ ఆశ్రమంలో ఉంటోంది. నెల రోజుల క్రితం పింఛన్‌ డబ్బుల కోసం స్వగ్రామం వెళ్లింది. డబ్బులు తీసుకొని, కనిపించకుండా పోయింది. కుటుంబసభ్యులు ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. మూడు రోజుల క్రితం గుజరాత్‌లోని కచ్‌బుజ్‌ ప్రాంతంలో పుష్పలతను అక్కడి పోలీసులు గుర్తించారు. ఆమెను అక్కడే సఖి సెంటర్‌లో ఉంచి, వీణవంక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయమై వారు ఎంపీపీ ముసిపట్ల రేణుకకు సంప్రదించగా ఆమె పుష్పలత కుటుంబసభ్యులకు చెప్పి, గుజరాత్‌ పంపించారు.

చొక్కారావుపల్లివాసి సాయంతో...

గన్నేరువరం మండలంలోని చొక్కారావుపల్లికి చెందిన అనిల్‌రెడ్డి గతంలో గుజరాత్‌లోని వడోదరలో చదివాడు. ఆ సమయంలో కచ్‌బుజ్‌ ప్రాంతానికి చెందిన భార్గవ్‌తో స్నేహం ఏర్పడింది. ఈ క్రమంలో అనిల్‌రెడ్డి ఐదు రోజుల క్రితం ఎల్కాకలోని ప్రణమ ఆశ్రమానికి వెళ్లగా వృద్ధురాలి విషయం తెలిసింది. వెంటనే అతను భార్గవ్‌తో ఫోన్‌లో మాట్లాడి, ఆమెను ఇంటికి పంపించాలని కోరాడు. దీంతో భార్గవ్‌ అక్కడి పోలీసులు, సఖి సెంటర్‌ నిర్వాహకులతో మాట్లాడి, బాధితురాలితోపాటు ఆమె కుటుంబసభ్యులను రైలు ఎక్కించాడు. వారు బుధవారం ఇంటికి చేరుకోనున్నారని గ్రామస్తులు తెలిపారు.

వీవోఏల దీక్షకు కాంగ్రెస్‌ మద్దతు



కరీంనగర్‌టౌన్‌: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలంటూ వీవోఏలు కలెక్టరేట్‌ ఎదుట చేస్తున్న దీక్షకు కాంగ్రెస్‌ మద్దతు తెలిపింది. మంగళవారం డీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కోమటిరెడ్డి పద్మాకర్‌ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మడుపు మోహన్‌, పార్టీ బీసీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్‌, ప్రధాన కార్యదర్శి రామిడి రాజిరెడ్డి, లింగమూర్తిలు దీక్షాశిబిరంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఆరోగ్య బీమా, ఇన్సూరెన్స్‌ కల్పించాలని, అర్హులకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్‌ చేశారు.

ఇంటర్‌ ఫలితాల్లో ‘శ్రీచైతన్య’ విజయఢంకా



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల యాజమాన్యం

కరీంనగర్‌: ఇంటర్మీడియట్‌ ఫలితాల్లో శ్రీచైతన్య జూనియర్‌ కళాశాల విద్యార్థులు విజయఢంకా మోగించారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విద్యాసంస్థల అధినేత ముద్దసాని రమేశ్‌రెడ్డి మాట్లాడారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో పి.బిందు 990, బైపీసీ విభాగంలో జి.రోషిణి 989, ఎంఈసీ విభాగంలో జి.ఈశ్వర్‌ తేజ 983, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో కె.విశ్వహరితాజ్‌ 466, కె.స్నిగ్ధ 466, కె.అక్షయ 466, బైపీసీలో ఎం.సిరివెన్నెల 435, ఎంఈసీలో టి.హారిక 479, సీఈసీలో జె.ప్రశాంత్‌ 491 మార్కులు సాధించారని తెలిపారు. నాణ్యమైన కార్పొరేట్‌ స్థాయి విద్యను ఉత్తర తెలంగాణ ప్రాంత విద్యార్థులకు అందించాలన్న లక్ష్యంతో శ్రీ చైతన్య విద్యాసంస్థలు నడుస్తున్నాయని అన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నామని పేర్కొన్నారు. ఏటా ఎంసెట్‌, నీట్‌, ఐఐటీ, జేఈఈ తదితర పోటీ పరీక్షల్లో ర్యాంకులు సాధిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్‌లో అత్యున్నత ఫలితాలు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత రమేశ్‌రెడ్డి, డైరెక్టర్‌ కర్ర నరేందర్‌ రెడ్డి, డీన్‌ జగన్మోహన్‌ రెడ్డి, జూనియర్‌ కళాశాలల ప్రిన్సిపాళ్లు మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌, రాధాకృష్ణ, ఏజీఎం శ్రీనివాస్‌, అధ్యాపకులు అభినందించారు.

‘ఎస్‌వీజేసీ’ విజయకేతనం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

కరీంనగర్‌: ఇంటర్మీడియట్‌ ఫలితాల్లో ఎస్‌వీజేసీ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో ఎంబడి శ్వేత 990, ఎంపీసీలో వంగల రిషిక 989, నాగుల లయ 988 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో జుల హర్షిత 465, గడ్డం సాయిభువ 465, గుజార్‌ మనిదీక్షిత 465, కుమ్మరి సంస్కృతి 465, జె.సంతోష్‌ 465, కొయ్యడ అభిజ్ఞ 464, బి.దీక్షిత్‌ 464, బి.రాహుల్‌ 464, జి.గణేశ్‌ 464 మార్కులు, బైపీసీ విభాగంలో టి.శ్రీఅక్షిత్‌ 432, గుండా అక్షయ 430, ఎంఈసీలో మద్దూరి అక్షయ 477 మార్కులు సాధించారు. కళాశాల కరస్పాండెంట్‌ ఊట్కూరి మహిపాల్‌ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల శ్రమకు, అధ్యాపకులు కృషికి ఈ ఫలితాలు నిదర్శనమన్నారు. జేఈఈ, నీట్‌, ఎంసెట్‌లలోనూ ఉత్తమ శిక్షణనిస్తున్నామని చెప్పారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆయనతో పాటు బాలుర క్యాంపస్‌ ప్రిన్సిపాల్‌ మేడ వెంకటవరప్రసాద్‌, బాలికల క్యాంపస్‌ ప్రిన్సిపాల్‌ కాంతల రాంరెడ్డి, డైరెక్టర్లు సింహాచలం, హరికృష్ణ, వంగల సంతోష్‌ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

‘ఎస్‌ఆర్‌’కు స్టేట్‌ ఫస్ట్‌ ర్యాంకు



విజయసంకేతం చూపుతున్న కళాశాల సిబ్బంది, విద్యార్థులు

కరీంనగర్‌: ఇంటర్‌ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎస్‌ఆర్‌ విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో కె.పూజ 994 మార్కులతో స్టేట్‌ ఫస్ట్‌ ర్యాంకు సాధించింది. ఎ.తిరుమలేశ్‌ 990, ఎ.రాము 990, ఎస్‌.ప్రవీణ్‌కుమార్‌ 990, బైపీసీ విభాగంలో ఎస్‌.మణిమాల 990, జి.ఆర్యన్‌ 989, ఎస్‌.కీర్తి 988, ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఎస్‌.వైష్ణవి 467, ఎస్‌.హాసిని, ఎ.పల్లవి, ఎ.సువర్ణ, ఎం.శ్రావణిలు 466, సీహెచ్‌.ప్రణవి, పి.శ్రీజ, జి.సుప్రీత్‌, ఆర్‌.శ్రీనాథ, కె.ఓమేశ్వర్‌, బానోత్‌ జ్యోతిరాం, వి.నరేంద్ర శివ, కె.అభిరామ్‌, సీహెచ్‌.హరిత, ఎస్‌.భవాని, ఎస్‌.ప్రియాంక, బి.రచన, బి.నాగలక్ష్మి, డి.శ్రీజ, జి.శ్రీజ, వి.నందిని, ఎస్‌.జాస్మిత, ఎస్‌.మహితలకు 465, బైపీసీ విభాగంలో ఇందిర ప్రియదర్శిని, జి.శ్రీజలకు 434, ఎ.హన్సిక, బి.శిరీష 433, పి.వైష్ణవి, ఎస్‌.విష్ణుప్రియ, పి.లక్ష్మీప్రసన్న 432, జె.వేణుకుమార్‌, వి.హారిక 430 మార్కులు సాధించారని విద్యాసంస్థల చైర్మన్‌ వరదారెడ్డి తెలిపారు. ఆయనతోపాటు డైరెక్టర్లు సంతోష్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, కరీంనగర్‌ జోనల్‌ ఇన్‌చార్జి వాసుదేవరెడ్డి, ప్రిన్సిపాళ్లు నాగార్జున్‌రెడ్డి, తిరుపతి, అశోక్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్‌ రెడ్డి, మారుతి, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

‘విద్యామందిర్‌’ విజయదుందుబి



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కరీంనగర్‌: ఇంటర్మీడియట్‌ ఫలితాల్లో విద్యామందిర్‌ కళాశాల విద్యార్థులు విజయదుందుబి మోగించారు. ద్వితీయ సంవత్సరంలో ఎస్‌.సాత్విక 990 మార్కులు, పి.వివేక్‌ వర్ధన్‌ 987, కె.సాయిశ్రీ 984, పి.సుమనశ్రీ 984, పి.నందిని 983, బి.భవాని 981 మార్కులతోపాటు మొత్తం 14 శాతం మంది విద్యార్థులు 980 మార్కులకు పైగా సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో వి.అజయ్‌ రాహుల్‌ 464, జి.సాత్విక 464, నలుగురు 463, ఇద్దరు 462 మార్కులతోపాటు మొత్తం 24 శాతం మంది 460 మార్కులకు పైగా సాధించారు. బైపీసీ విభాగంలో 431 మార్కులు వచ్చాయి. ఇటీవల ప్రకటించిన జేఈఈ(మెయిన్స్‌) ఫలితాల్లో జాతీయ స్థాయిలో టి.శరవణ్‌ 260వ ర్యాంక్‌, బి.మనస్విని 1,115వ ర్యాంక్‌, జి.గౌతమి 2,715వ ర్యాంక్‌, 3 వేలలోపు ముగ్గురు విద్యార్థులు, 10 వేలలోపు 9 మంది విద్యార్థులు, 20 వేలలోపు 13 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని అకాడమిక్‌ డైరెక్టర్‌ జిల్లా రమేశ్‌ తెలిపారు. విద్యార్థులను ఆయనతోపాటు అధ్యాపకులు అభినందించారు.

రెసొనెన్స్‌ కళాశాల విద్యార్థుల ప్రతిభ



విజయసంకేతం చూపుతున్న విద్యార్థులు, యాజమాన్యం

కరీంనగర్‌: ఇంటర్మీడియట్‌ ఫలితాల్లో రెసొనెన్స్‌ జూనియర్‌ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇంటర్‌ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో కల్వకోట సాయిసుప్రియ 466, మహ్మమద్‌ ముషారఫ్‌ రెహాన్‌ 465, సీహెచ్‌.రాహుల్‌ 464, గర్రెపల్లి గిరిష్మా 464, రాగిడి శ్రీకర్‌రెడ్డి 463, బొల్లబత్తిని శ్రీవిష్ణు 462, అనుమండ్ల అశ్రిత 461, టి.హాసిని 461, ఎం.సాయిసుష్మిత 460, ఎం.అక్షయ 460, వి.ఆశ్రిత 460, బైపీసీ విభాగంలో బైరి స్నిగ్ధ 423 మార్కులు సాధించారు. విద్యార్థులను కళాశాల చైర్మన్‌ డి.అంజిరెడ్డి, డీన్‌ డీవీ రావు, పాపయ్య, అజయ్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

క్లుప్తంగా

కంటివెలుగు శిబిరం ప్రారంభం



సర్పంచ్ సంతోషకు నేత్ర పరీక్ష చేస్తున్న సిబ్బంది

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నల్లగుంటపల్లిలో మంగళవారం చామనపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు నేత్ర వైద్యశిబిరాన్ని సర్పంచ్ వడ్లూరి సంతోష మంగళవారం ప్రారంభించారు. రెండురోజుల పాటు నిర్వహించే వైద్యశిబిరంలో గ్రామస్తులందరూ కంటిపరీక్షలు చేయించుకోవాలని కోరారు. అనంతరం సర్పంచ్‌కు వైద్యసిబ్బంది నేత్ర పరీక్షలు చేసి కంటి అద్దాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంజయ్య, వార్డుసభ్యులు అట్ల రాకేశ్, కిరణ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గౌడ సంఘం సభ్యులకు సన్మానం



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో సభ్యులను సన్మానించారు. గత వారం ఎల్లమ్మ పట్నాలను విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా మంగళవారం తిరుగుబోనం నిర్వహించారు. అనంతరం ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు మూల లక్ష్మీరాజం, ఉపాధ్యక్షుడు బుర్ర లక్ష్మీనారాయణ, సభ్యులు బుర్ర కొమురయ్య, కనుకయ్య, పడాల శంకరయ్య, పొన్నం రవి, వీరగోని లక్ష్మయ్య, మాసగోని శ్రీనివాస్, మడ్డి మల్లేశంలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు మాసగోని రమేశ్, మూల బలరాం, బుర్ర తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లోని కమాన్ వద్ద మంగళవారం ఎలక్ట్రికల్ వైండింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, సప్తగిరి లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో బొమ్మకల్ జెడ్పీటీసీ పురుమల్ల శ్రీనివాస్, వైండింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంది కృష్ణారెడ్డి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాయితోజు పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు దొంత రవీందర్, సప్తగిరి లయన్స్ క్లబ్ బాధ్యులు కోటేష్‌కుమార్, రామచంద్రం, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లకు నోటీసులు జారీ



జేపీఎస్ ఇంటికి నోటీసు అంటిస్తున్న సీనియర్ కార్యదర్శి మల్లయ్య

కరీంనగర్‌రూరల్: డిమాండ్ల సాధన కోసం 12రోజులుగా సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మంగళవారం సాయంత్రం 5గంటల్లోపు విధుల్లో చేరకుంటే తొలగిస్తామని ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి నోటీసులు జారీ చేశారు. కరీంనగర్‌రూరల్‌లో 11మంది పంచాయతీ కార్యదర్శులు గతనెల 28నుంచి సమ్మె చేస్తున్నారు. కలెక్టరేట్ ఎదుట ప్రతిరోజూ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే జేపీఎస్‌లు సమ్మె విరమించి విధుల్లో చేరాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం కార్యదర్శులకు నోటీసులిచ్చారు. పలువురు జేపీఎస్‌లు నోటీసు తీసుకునేందుకు నిరాకరించడంతో వారి నివాసగృహాలకు అంటించారు. కాగా ఫకీర్‌పేట గ్రామపంచాయతీ కార్యదర్శి స్వప్న విధుల్లో చేరింది. మూడేళ్ల శిక్షణ కాలం పూర్తికాకపోవడంతో ప్రభుత్వం తొలగిస్తే ఇబ్బందవుతుందనే కారణంతో గడువులోపు విధుల్లో చేరేందుకు ముందుకు రావడంతో ఎంపీడీవో చేర్చుకున్నారు. మిగితా పదిమంది జేపీఎస్‌లు మాత్రం విధుల్లో చేరబోమని సమ్మెలో పాల్గొంటామని స్పష్టం చేశారు.

ఆధ్యాత్మికం

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం



నగరంలోని మంకమ్మతోట భక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భోగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో హనుమాన్ మాలధారులు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హవనం నిర్వహించారు. కార్యక్రమంలో గుండేటి రామకృష్ణ, తమ్మిశెట్టి సాయి, సంపత్, కుమారస్వామి, సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. - కరీంనగర్‌కల్చరల్

ఘనంగా హనుమాన్ యజ్ఞం



కరీంనగర్ మండలం చామనపల్లి అబ్బన్నగుడిలో మంగళవారం వేదపండితులు మల్లికార్జునందస్వామి ఆధ్వర్యంలో హన్‌మాన్ యజ్ఞంను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, సర్పంచ్ బోగొండ లక్ష్మిఐలయ్య, హన్మాన్ భక్తులు లింగయ్య, తిరుపతి, పర్శరాములు, వినోద్ తదితరులు పాల్గొన్నారు. - కరీంనగర్‌రూరల్

కార్యదర్శుల సమస్యలు సానుభూతితో పరిష్కరించాలి

కరీంనగర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను సానుభూతితో రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ సర్వీసులు రెగ్యులరైజ్ చేయాలని ఏప్రిల్ 28 నుంచి సమ్మె చేస్తున్నారని, వీరి సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం సరికాదన్నారు. పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ నోటీస్ ఇస్తూ 'యూనియన్ పెట్టుకున్నందుకు సమ్మె చేస్తున్నందున' తొలగిస్తామని ఆదేశాలు జారీచేయడం దుర్మార్గమన్నారు. యూనియన్ పెట్టుకోవడం ఉద్యోగుల హక్కు అన్నారు. చట్ట వ్యతిరేకమైన నోటీసును రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఇంటర్ ఫలితాల్లో.. మేము సైతం!

- ప్రైవేటుకు దీటుగా అత్యుత్తమ మార్కులు
- సీఈసీ స్టేట్ థర్డ్ ర్యాంక్ సాధించిన మెహవీన్
- ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు.. సాధించాలన్న తపనతో మొక్కవోని ఆత్మవిశ్వాసంతో సాధన చేస్తే ఎంతటి లక్ష్యాన్ని అయినా సులువుగా చేధించవచ్చని నిరూపించారు కరీంనగర్ డాక్టర్స్‌స్ట్రీట్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు. ఆర్థికభారంతో ప్రభుత్వ కళాశాలలో చదువుతూ ప్రైవేటు కళాశాలల విద్యార్థులకు దీటుగా అత్యుత్తమ మార్కులు కైవసం చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి టాప్ ప్లేస్‌లో నిలిచారు. ఇంటర్ ఫస్టియర్ సీఈసీలో మిషా మెహవీన్ 479 మార్కులు సాధించి స్టేట్ థర్డ్ ప్లేస్‌లో నిలిచారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సాక్షి పలకరించగా తమ మనోభావాలను వెల్లడించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి

ఇంటర్ సెకండియర్‌లో టాప్ మార్కులు సాధించిన విద్యార్థినులు

పేరు	గ్రూపు	మార్కులు
ఆర్ మధుశ్రీ	ఎంపీసీ	971
కె.శివంగి	బైపీసీ	982
జి.అన్విత	సీఈసీ	963

ఇంటర్ ఫస్టియర్‌లో టాప్ మార్కులు సాధించిన విద్యార్థినులు

పేరు	గ్రూపు	మార్కులు
యు.సాయిప్రియ	ఎంపీసీ	458
సనా అంజుమ్	బైపీసీ	415
మిషా మెహవీన్	సీఈసీ	479

ఫస్టియర్‌లో 51, సెకండియర్‌లో 58శాతం

మార్చి నెలలో జరిగిన ఇంటర్ పరీక్షలకు కళాశాల నుంచి 1,169 మంది విద్యార్థినులు హాజరయ్యారు.మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో ఫస్టియర్‌లో 51శాతం, సెకండియర్‌లో 58 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

నీట్‌లో ర్యాంక్ టార్గెట్



ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించా. నా ముందున్న టార్గెట్ నీట్. అందులో కూడా మంచి ర్యాంక్ సాధించి కళాశాలకు పేరు తేవాలని ఉంది. నాకు డాక్టర్ వృత్తి అంటే చాలా ఇష్టం. అందుకే బైపీసీ ఎంచుకున్న. నాన్న షాప్ చూస్తారు. అమ్మ గృహిణి.

– కె శివంగి, 982 మార్కులు, బైపీసీ

మంచి మార్కులు సాధించా..



బైపీసీ సెకండ్ ఇయర్‌లో మంచి మార్కులు సాధించా. చాలా హ్యాపీగా ఉంది. నాన్న, అమ్మ ఇద్దరూ టైలరింగ్ చేస్తారు. వారికి తోడుగా నిలవాలనేది నా కోరిక. నీట్‌లో కూడా మంచి ర్యాంక్ సాధించి డాక్టర్ వృత్తిని చేపట్టి సమాజానికి సేవ చేయాలని ఉంది.

– వి సాహితి, 971 మార్కులు, బైపీసీ

డాక్టర్ కావాలని ఉంది



డాక్టర్ కావాలని చిన్నప్పటి గోల్. ఫిజియోథెరపిస్ట్ డాక్టరై సమాజానికి సేవ చేయాలనేది నా కోరిక. అమ్మానాన్నలు ఇద్దరూ టైలరింగ్ చేస్తారు. వారికి చేదోడుగా వాదోడుగా ఉంటా. స్టడీ అవర్ క్లాస్‌లు, కళాశాలలో పెట్టిన పరీక్షలు బాగా ఉపయోగపడ్డాయి.

– ఆర్. సౌమిక, 963 మార్కులు, బైపీసీ

లెక్చరర్ అవుతా..



మా అమ్మ నన్ను లెక్చరర్‌గా చూడాలనుకుంది. పరీక్షలకు ముందే (అక్టోబర్‌లో) అమ్మను దేవుడు తీసుకెళ్లాడు. అమ్మ కోరిక తీర్చాలనే లక్ష్యంతో పరీక్షలకు బాగా ప్రిపేర్ అయి మంచి మార్కులు సాధించా. నాన్న కార్పెంటర్. లెక్చరర్ వృత్తి చేసేంతవరకు చదువుతూనే ఉంటా.

– యు.సాయిప్రియ, 458 మార్కులు, ఎంపీసీ

ఢిల్లీ యూనివర్సిటీలో చదవాలనేది నా ఆశయం



ఇంటర్‌లో మంచి మార్కులు సాధించా. హ్యాపీగా ఉంది. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో కూడా రాణిస్తా. ఢిల్లీ యూనివర్సిటీలో చదువాలనేది నా ఆశయం. నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన అందించాలన్నది నా లక్ష్యం. ఇప్పటి నుంచే లక్ష్యం కోసం బాగా శ్రమిస్తా.

– జి.అన్విత, 968 మార్కులు, సీఈసీ

రోడ్డు దాటేదెలా..?



హౌసింగ్‌బోర్డుకాలనీకి వెళ్లే మెయిన్‌రోడ్డు ఎంట్రెన్స్ వద్ద పరిస్థితి

- పగులుతున్న వాటర్‌పైప్‌లు
- తవ్వి వదిలేసిన మున్సిపాలిటీ
- నెల రోజులుగా ఇదే దుస్థితి

కరీంనగర్ కార్పొరేషన్: వాటర్ ప్రెషర్‌కు తగినట్లుగా పైప్‌లైన్‌లు వేయకపోవడం.. ప్రెషర్ తట్టుకోలేక పైప్‌లైన్‌ల జాయింట్లు పగలడం.. ప్రతీసారి మరమ్మతులతోనే సరిపెట్టడం.. నెలల తరబడి మరమ్మతులు కొనసాగుతుండడంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నగరంలోని 7, 30, 6 డివిజన్‌ల పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీ మెయిన్ రోడ్డు ఎంట్రెన్స్ వద్ద పైప్‌లైన్లు పగిలి నీళ్లు రోడ్డుపైకి చేరడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతోంది. కాలనీకి వెళ్లే మెయిన్ వాటర్ పైప్‌లైన్ ఈ దారి వెంటనే పోతుంది. ఇక్కడ వాటర్ ప్రెషర్ తట్టుకోలేక పైప్‌ల జాయింట్లు పగిలిపోతున్నాయి. ఇది గత నాలుగు సంవత్సరాలుగా ప్రతీసారి జరుగుతున్న వ్యవహారమే కావడం గమనార్హం. నీటి సరఫరా అవుతున్న సందర్భంలో పైప్‌లైన్ జాయింట్లు పగిలిపోయి నీళ్లు రోడ్డుపైకి ఉబికి వస్తున్నాయి. ఫలితంగా ఆ ప్రాంతమంతా నీళ్లు, గుంతల మయంగా మారి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. నెల రోజుల క్రితం ఈ సమస్య ఏర్పడగా, మున్సిపల్ సిబ్బంది సగం మేరకు రోడ్డు తవ్వి, పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసే ప్రయత్నం చేశారు. కాని ఇప్పటివరకు రోడ్డు తవ్వి అలానే ఉంచడం, మిగిలిన భాగం కూడా గుంతలుగా మారడంతో హౌసింగ్‌బోర్డు కాలనీ, కృష్ణానగర్, మారుతినగర్‌లకు వెళ్లే వాహనదారులకు రోడ్డు దాటడం కష్టంగా మారింది. రాత్రి వేళల్లో ఇది మరింత ప్రమాదకరంగా మారింది. ఇటీవల ద్విచక్రవాహనదారులు పలువురు గుంతల్లో పడడంతో, పిల్లలకు గాయాలయ్యాయి. సమీపంలోని గాయత్రినగర్‌తో పాటు పలు కాలనీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.



వాహనం దిగపడడంతో నెట్టుతున్న స్థానికులు

శాశ్వత పరిష్కారం చూపాలి

ఏటా ఇదే సమస్య ఎదురవుతుండగా, మున్సిపల్ కార్పొరేషన్ తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతోంది. వాటర్ ప్రెషర్‌కు తగిన విధంగా పైప్‌లైన్‌లు లేకపోవడమే సమస్యకు కారణమని మున్సిపల్ సిబ్బందే చెబుతున్నారు. ప్రెషర్‌కు తగినట్లుగా పైప్‌లైన్‌లు వేస్తే ఈ సమస్య పునరావృతం కాదంటున్నారు. కాని అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. కాగా త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని వాటర్‌వర్క్స్ అధికారులు చెబుతున్నారు.

సీఎం కప్ క్రీడోత్సవాలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీలత

కొత్తపల్లి: కొత్తపల్లి మండలస్థాయి సీఎం కప్ క్రీడోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీపీ పిల్లి శ్రీలత మహేశ్ అన్నారు. కరీంనగర్‌లోని కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సీఎం కప్ టోర్నీ సన్నాహక సమావేశంలో మాట్లాడారు. సీఎం కప్ టోర్నీ విధివిధానాలు, ఏర్పాట్లపై చర్చించి మండలస్థాయి నిర్వహణ కమిటీని ప్రకటించారు. చింతకుంట ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బాలికల పాఠశాల/కళాశాల మైదానంలో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే టోర్నీకి నిర్వహణ కమిటీ చైర్మన్, మెంబర్ కన్వీనర్‌గా ఎంపీడీవో, సభ్యులుగా మున్సిపల్ చైర్మన్, కమిషనర్, జెడ్పీటీసీ, తహసీల్దార్, ఎంఈఓ, ఎస్సై, పీఈటీలు వ్యవహరించనున్నట్లు తెలిపారు. 15–30 ఏళ్ల పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 200, 400 మీటర్ల పరుగు పందెం, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో పాల్గొనే వారు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శుల వద్ద ఈనెల 14వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ ఎన్.వెంకట్‌రెడ్డి, ఎంఈఓ మధుసూదనాచారి, ఎంపీఓ శ్రీనివాస్, సర్పంచ్ మధు, పీఈటీలు గిన్నె లక్ష్మణ్, రాంరెడ్డి, సత్యనారాయణ, హరీష్, శ్రీనివాస్, కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలాలు లేకుంటే చర్యలు

- మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: అపార్ట్‌మెంట్లు, కమర్షియల్, ఆస్పత్రి భవన సముదాయాల్లో పార్కింగ్ స్థలాలు లేకుంటే చర్యలు తప్పవని మేయర్ సునీల్‌రావు అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం అపార్టుమెంట్, కమర్షియల్, ఆస్పత్రి భవన సముదాయాల యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వర్షాకాలం రానున్నందున తగిన చర్యలు చేపట్టాలన్నారు. సెల్లార్స్‌లో వర్షపు నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సెల్లార్స్‌తో విద్యుత్ ప్యానల్ బోర్డులు ఉంటే ఈనెల 15వ తేదీలోగా పై అంతస్తులకు మార్చుకోవాలన్నారు. రాత్రి వేళల్లో బారికేడ్స్‌ను రేడియం స్టిక్కర్ అమర్చి సూచిక బోర్డులను ఏర్పాటు చేసుకొని నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. నిర్మాణ అనుమతుల్లో చూపించిన స్థలాల్లోనే పార్కింగ్ ఏర్పాటు చేయాలని, పార్కింగ్ స్థలాల్లో ల్యాబ్‌లు, వాచ్‌మెన్ గదులు నిర్మించొద్దన్నారు. రోడ్ల పై సిబ్బంది కార్లు, అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు నిలిపితే సంబంధిత ఆస్పత్రుల అనుమతి రద్దు చేస్తామని తెలిపారు. నగరపాలకసంస్థ కమిషనర్, డీసీపీ సుభాష్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

నాయీబ్రాహ్మణ హాస్టల్‌కు నిధులు కేటాయిస్తాం

నాయీబ్రాహ్మణ వసతిగృహ పూర్తిస్థాయి నిర్మాణానికి నగరపాలక సంస్థ తరపున నిధులు కేటాయిస్తామని మేయర్ సునీల్‌రావు అన్నారు. 9వ డివిజన్ పరిధిలోని ఉజ్వలపార్క్ సమీపంలో నూతనంగా నిర్మించిన నాయీబ్రాహ్మణ వసతి గృహాన్ని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ కేటాయింపులకు అదనంగా నగరపాలక సంస్థ నుంచి నిధులు ఇచ్చేందుకు కృషిచేస్తానని తెలిపారు. అన్ని కులవృత్తులను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. కార్పొరేటర్ జంగిలి ఐలేందర్‌యాదవ్, నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు నర్సయ్య పాల్గొన్నారు.

పోలీసులకు సేవా పతకాలు

కరీంనగర్‌క్రైం: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు పోలీసు అధికారితో పాటు ముగ్గురు సిబ్బంది బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ నుంచి అవార్డులు అందుకోనున్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పోలీసులకు సేవాపతకాలు ప్రకటించింది. కరీంనగర్‌రూరల్ సీఐగా పని చేస్తున్న పి.విజ్ఞాన్‌రావుకు ఉత్కృష్ట సేవా పతకం, కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ ఏఆర్ ఎస్సైగా పని చేస్తున్న పి.నర్సయ్య, కరీంనగర్ టూటౌన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న టి.శ్రీనివాస్, కరీంనగర్ ట్రాఫిక్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ ఎస్.శ్రీనివాస్‌లు ఉత్తమ సేవపతకాలు అందుకోనున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సప్తగిరికాలనీ: పాఠశాలలకు వేసవి సెలవుల దృష్ట్యా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలని బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి అన్నారు. మంగళవారం బాలల సంక్షేమ సమితిలో విలేకరులతో మాట్లాడారు. సరదా కోసం మిత్రులతో కలిసి సమీపంలోని చెరువులు, బావుల్లో ఈతకు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనాలు, కార్లను మైనర్ పిల్లలకు ఇచ్చి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కరీంనగర్‌క్రైం: ప్రేమించి పెళ్లి చేసుకున్న యువకుడు తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరీంనగర్ త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కిసాన్‌నగర్‌కు చెందిన ఉప్పులేటి రాజ్‌కుమార్(32) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఏడాది క్రితం హైదరాబాద్ ఉప్పల్ ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. చిన్న చిన్న గొడవలు రావడంతో రాజ్‌కుమార్‌పై అతడి భార్య వరకట్న వేధింపులపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం కరీంనగర్‌లోని తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

తప్పిపోయిన పిల్లలను ఇంటికి చేర్చిన పోలీసులు

కరీంనగర్‌లో తప్పిపోయిన ఇద్దరు పిల్లలను పోలీసులు ఇంటికి క్షేమంగా చేర్చారు. స్థానికుల వివరాల ప్రకారం.. మంగళవారం కరీంనగర్‌లోని జ్యోతినగర్ ప్రాంతంలో గల ఒక అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న ఇద్దరు పిల్లలు తప్పిపోయారు. జ్యోతినగర్ నుంచి ఆడుకుంటూ క్రిస్టియన్ కాలనీ వరకు వెళ్లారు. అది గమనించిన బ్లూకోల్ట్స్ పోలీసులు పిల్లలను వివరాలు అడిగి తప్పిపోయినట్లుగా గుర్తించారు. వారి తల్లిదండ్రుల వివరాలు కనుక్కొని క్షేమంగా అప్పగించారు.

హిందూ ఏక్తాయాత్రను విజయవంతం చేయాలి



కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లో ఈనెల 14న హనుమాన్ జయంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హిందూ ఏక్తాయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ పశ్చిమ జోన్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం రేకుర్తిలోని ఫంక్షన్‌హాల్‌లో శక్తి కేంద్రాల, డివిజన్ ఇన్‌చార్జీలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. డివిజన్లలో సమావేశాలు నిర్వహించి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా కార్యక్రమం రూపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొనిజేటి శివరామకృష్ణ, జాడి బాల్‌రెడ్డి, బండ రమణారెడ్డి, ధర్మారం వెంకటస్వామి, జానపట్ల స్వామి, ఎడమ సత్యనారాయణరెడ్డి, గుంజేటి శివకుమార్, మామిడి రమేశ్, గంటల నరసింహారెడ్డి, తిప్పర్తి బ్రహ్మం, గోదారి నరేశ్, తిరుమల్‌రెడ్డి, గాజర్ల శ్రీకాంత్, ఉపేందర్, లక్ష్మిరాజమ్, భాస్కరాచారి పాల్గొన్నారు.

'అట్ల'ను అభినందించిన సదానందచారి



సప్తగిరికాలనీ(కరీంనగర్): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, మహాత్మాగాంధీ డిగ్రీ, పీజీ కళాశాల గుంటూరు సంయుక్తంగా నిర్వహించిన హెచ్ఐవి ఎయిడ్స్ కౌన్సిలింగ్ సర్టిఫికెట్ కోర్సు ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన ప్రముఖ సైకాలజిస్ట్ అట్ల శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం ప్రభుత్వ ప్రధాన వైద్యశాల ఐసీటీసీ ముత్తోజు సదానంద చారి అభినందించారు. ప్రస్తుత కాలంలో లైంగిక వ్యాధులపై యువతకు సరైన అవగాహన లేక చాలా మంది హెచ్ఐవి బారిన పడటమే కాకుండా లైంగిక వ్యాధులతో వారి జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారని సదానందచారి అన్నారు.

క్లుప్తంగా...



యాదాద్రిలో బంగారు పుష్పాల బిగింపు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ పశ్చిమ పంచతల రాజగోపురం ద్వారాలకు బంగారం పూతతో తయారు చేసిన పుష్పాలు, రేకులను అమర్చే పనులను శిల్పులు వేగంగా చేస్తున్నారు. సోమవారం రాత్రి పనులను ప్రారంభించిన శిల్పులు ఒక వైపు ద్వారాన్ని పూర్తి చేశారు. మరో వైపు పనులు మంగళవారం రాత్రి చేపట్టారు. ద్వారాలకు బంగారుపూతతో తయారు చేసిన పుష్పాలు, రేకులు బిగించడంతో నూతన కళ సంతరించుకుంది.

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ

రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య వినతి

కాచిగూడ (హైదరాబాద్): బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ప్రతినిధులు నీల వెంకటేష్, గొరిగ మల్లేష్ యాదవ్‌లతో కూడిన ప్రతినిధి బృందం ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో మంగళవారం జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహిర్‌కు వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ కులాలకు ఏ రంగంలో కూడా వాటా దక్కలేదని వివరించారు. జాతీయ బీసీ కమిషన్ జోక్యం చేసుకొని బీసీలకు అన్ని రంగాల్లో వాటా ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఉగ్ర ముఠాపై పంజా!

హెచ్‌యూటీ సంస్థ సానుభూతిపరుల ఇళ్లలో సోదాలు ● ఐదుగురిని అదుపులోకి తీసుకున్న అధికారులు..





అరెస్ట్ చేసిన వారిని భోపాల్ కోర్టుకు తరలిస్తున్న మధ్యప్రదేశ్ ఏటీఎస్ పోలీసులు. (ఇన్‌సెట్లో) సలీం

సాక్షి, హైదరాబాద్: మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్), రాష్ట్ర నిఘా వర్గాలు సంయుక్తంగా హైదరాబాద్‌లో మంగళవారం చేపట్టిన ఆపరేషన్‌లో ఐదుగురు హిజ్బ్ ఉత్ తహరీర్ (హెచ్‌యూటీ) సంస్థ ఉగ్రవాద అనుమానితులు చిక్కారు. ఈ మాడ్యుల్‌కు సూత్రధారిగా ఉన్న మహ్మద్ సలీం.. ఓ మెడికల్ కాలేజీలో డిపార్ట్‌మెంట్ హెడ్‌గా పనిచేస్తుండగా, పట్టుబడినవారిలో ఒక దంత వైద్యుడు, ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉండటం కలకలం రేపుతోంది. ఈ ఐదుగురినీ ఏటీఎస్ అధికారులు పీటీ వారెంట్‌పై భోపాల్‌కు తరలించారు. ఇదే సమయంలో మధ్యప్రదేశ్‌లోనూ ఏటీఎస్ అధికారులు మరో 11 మంది హెచ్‌యూటీ సంస్థ సభ్యులను అరెస్టు చేశారు. వారందరినీ అక్కడి కోర్టులో హాజరుపర్చగా.. ఈ నెల 19వ తేదీ వరకు వారిని ఏటీఎస్ కస్టడీకి అప్పగించింది.

■ ఐసిస్ ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా..

అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐఎస్‌కు అనుబంధంగా హెచ్‌యూటీ సంస్థ పనిచేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు, ఉగ్రవాదులకు సానుభూతిపరులను తయారుచేస్తున్నట్టు ఆరోపణలు ఉన్న ఈ సంస్థ.. భారత్ సహా 50కిపైగా దేశాల్లో ఉనికిలో ఉంది. మన దేశంలో దీనిపై నిషేధం లేదు. కొంతకాలం నుంచి హెచ్‌యూటీ సంస్థ ఎక్కడికక్కడ మాడ్యూల్స్‌ను తయారు చేసుకుంటూ విస్తరిస్తోంది. తమకు ఆకర్షితులైన వారికి శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేకంగా ఆర్మ్‌డ్ వింగ్‌ను ఏర్పాటు చేసుకుంది. సోషల్ మీడియాలో గ్రూపులనూ నిర్వహిస్తోంది. కేడర్‌కు ప్రమాదకర ఆయుధాల వినియోగంతోపాటు రసాయన, జీవాయుధాల (కెమికల్, బయోలాజికల్) దాడులు చేసేలా.. వీటికి సంబంధించి ఎవరికి వారు మెటీరియల్ సిద్ధం చేసుకునేలా తర్ఫీదు ఇస్తోంది.

■ మధ్యప్రదేశ్ నుంచి వచ్చి ఇక్కడ మాడ్యూల్..

భోపాల్‌కు చెందిన యాసీర్ హెచ్‌యూటీలో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. తనతో కలసి చదువుకున్న సౌరభ్‌రాజ్ వైద్యను మతం మార్చుకుని, హెచ్‌యూటీలో చేరేలా ప్రోత్సహించాడు. మహ్మద్ సలీంగా పేరుమార్చుకున్న సౌరభ్.. 2019లో హైదరాబాద్‌లోని గోల్కొండ బాబాబజార్ మోతీ మహల్‌కు వలస వచ్చాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కాలేజీలో ఫార్మాస్యూటికల్ బయోటెక్నాలజీ విభాగాధిపతిగా ఉద్యోగంలో చేరాడు. మరోవైపు కొన్నేళ్ల కింద ఒడిశా నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చిన దేవీప్రసాద్ పాండ కొన్నేళ్ల క్రితమే మతం మార్చుకుని అబ్దుర్ రెహ్మాన్‌గా మారాడు. గోల్కొండలోని ధన్కోక ప్రాంతంలో నివాసం ఉంటూ.. ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో క్లౌడ్ సర్వీస్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఇక హైదరాబాద్‌లోని హఫీజ్‌బాబా నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ బస్క వేణుకుమార్ కూడా కొన్నేళ్ల క్రితం మతం మార్చుకుని మహ్మద్ అబ్బాస్ అలీగా మారాడు.

సలీం ఈ ఇద్దరితోపాటు గోల్కొండ బడాబజార్‌కు చెందిన దంత వైద్యుడు షేక్ జునైద్, జగద్గిరిగుట్ట మగ్దూంనగర్‌కు చెందిన మహ్మద్ హమీద్, జవహర్‌నగర్‌లోని శివాజీనగర్‌కు చెందిన మహ్మద్ సల్మాన్‌లను ఆకర్షించాడు. తనతో సహా ఆరుగురితో హెచ్‌యూటీ మాడ్యూల్‌ను ఏర్పాటు చేశాడు. మరోవైపు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో యాసీర్ నేతృత్వంలో 11 మంది మరో మాడ్యూల్ కార్యకలాపాలు ప్రారంభించింది.

■ మూడు నెలల పాటు నిఘా పెట్టి..

యాసీర్, సలీంల మాడ్యూల్స్ ఉగ్రవాద దాడులకు సిద్ధమవుతున్న విషయంపై మధ్యప్రదేశ్ ఏటీఎస్ అధికారులకు మూడు నెలల క్రితం జాతీ నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. అప్పటి నుంచి తెలంగాణ నిఘా వర్గాల సాయంతో ఏటీఎస్ అధికారులు వీరిపై కన్నేసి ఉంచారు. అన్ని అంశాలను నిర్ధారించుకుని.. మంగళవారం తెల్లవారుజామున అటు భోపాల్‌లో, ఇటు హైదరాబాద్‌లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. భోపాల్‌లో 11 మంది పట్టుబడగా.. హైదరాబాద్‌కు చెందిన మాడ్యూల్‌లో మహ్మద్ సల్మాన్ మినహా ఐదుగురిని పట్టుకున్నారు. మహ్మద్ సలీం ఇంటి నుంచి రెండు ఎయిర్‌గన్‌లు, పిల్లెట్స్, కత్తులు, గొడ్డళ్లతో పాటు ఉగ్రవాద సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఐదుగురిని పీటీ వారెంట్‌పై భోపాల్‌కు తరలించారు. పరారీలో ఉన్న మహ్మద్ సల్మాన్ కోసం రాష్ట్ర పోలీసులు గాలిస్తున్నారు.

■ నిషేధం విధించేలా..

హెచ్‌యూటీ సంస్థపై 2021లో తమిళనాడులో ఓ కేసు నమోదైంది. దాన్ని దర్యాప్తు చేసిన 'నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ)' గతేడాది అభియోగపత్రాలు దాఖలు చేసినట్టు అధికారులు తెలిపారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ సంస్థపై నిషేధం విధించేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నట్టు వెల్లడించారు.

అనంతగిరి అడవుల్లో క్యాంప్.. హైదరాబాద్‌లో రెక్కీ..

యాసీర్, సలీంల నేతృత్వంలోని 17 మంది ప్రత్యేకంగా రాకెట్ చాట్ యాప్ ద్వారా సంప్రదింపులు జరిపారు. తుపాకులు, కత్తులు, గొడ్డళ్లను వినియోగించి ఎవరికి వారుగా 'లోన్ వుల్ఫ్ ఎటాక్స్ (ఒంటరిగానే ఎవరిపైనైనా దాడిచేసి కలకలం రేపడం)' చేయాలని.. అవసరమైనప్పుడు బాంబులు తయారు చేసి జనసమ్మర్ద ప్రాంతాల్లో విరుచుకుపడాలన్నది వీరి పథకం. ఇందుకోసం అఫ్గానిస్తాన్‌లో అమెరికా బలగాలతో పోరాడిన ఐసిస్ మాడ్యుల్స్‌ను ఆదర్శంగా తీసుకున్నారు. రెండు మాడ్యూల్స్‌కు చెందిన 17 మంది కొన్నినెలల కింద వికారాబాద్ అనంతగిరి అడవుల్లో క్యాంపు నిర్వహించారు. ఎవరిని టార్గెట్‌గా ఎంచుకోవాలి? ఏ విధంగా దాడులకు దిగాలనేది చర్చించుకున్నారు. తర్వాత హైదరాబాద్ నగరంలో రెక్కీ చేశారు. పలు కీలక ప్రాంతాల్లో డ్రోన్లతోనూ రెక్కీ చేసి.. దాడులకు సన్నాహాలు చేసుకున్నారు. ఆన్‌లైన్ ద్వారా సంప్రదింపుల్లో ఉంటూ దాడులకు మెటీరియల్‌ను సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు.

ఐసిస్ కన్నా ప్రమాదకరంగా హెచ్‌యూటీ!

ఉగ్రవాద సంస్థ ఐసిస్‌కు అనుబంధంగా హిజ్బ్ ఉత్ తెహ్రీర్ (హెచ్‌యూటీ) సంస్థ పనిచేస్తున్నట్టు ప్రచారమున్నా.. దాని మూలాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. 1952లో ఇజ్రాయెల్‌లోని జెరుసలేంలో స్థాపితమైన ఈ సంస్థ.. ప్రస్తుతం లండన్ ప్రధాన కార్యాలయంగా పనిచేస్తోంది. యూరప్‌తోపాటు ఆసియాలోని ముస్లిం ప్రభావిత దేశాలకు విస్తరించింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఇండోనేషియాలో దీని ఉనికి ఎక్కువ. నేరుగా ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడకపోవడంతో చాలా దేశాల్లో దీనిపై నిషేధమేదీ లేదు. అయితే ఐసిస్ ఉగ్రవాద సంస్థ పతనం అనంతరం ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు హెచ్‌యూటీ ప్రయత్నిస్తున్నట్టు అంతర్జాతీయ నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ సంస్థ ఐసిస్ కన్నా ప్రమాదకరంగా మారుతోందని.. రసాయన, జీవాయుధాల వినియోగంపై కేడర్‌కు శిక్షణ ఇస్తోందని హెచ్చరించాయి. భారత్‌లో హెచ్‌యూటీ కార్యకలాపాల విస్తరణపై అంతర్జాతీయ భద్రతా సంస్థల నుంచి కేంద్ర ప్రభుత్వానికి సమాచారం అందిందని సమాచారం. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా నిఘా పెట్టినట్టు అధికారవర్గాలు చెప్తున్నాయి.



ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులతో ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి



కె.పూజ



విజయ్‌రాయ్

ఇంటర్ ఫలితాల్లో ఎస్ఆర్ విజయకేతనం

హన్మకొండ చౌరస్తా: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి అభినందించారు. సెకండియర్‌లో కె.పూజ 994 సాధించగా, ఐదుగురు విద్యార్థులు 993 సాధించారని వరదారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బైపీసీ సెకండియర్‌లో విజయ్‌రాయ్ 992, వర్ష 991, మరో నలుగురు 990 మార్కులు సాధించారని తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో 470 మార్కులకు గాను 10 మంది విద్యార్థులు 467, 45 మంది 466 సాధించారని తెలిపారు. బైపీసీలో 440 మార్కులకు ఐదుగురు విద్యార్థులు 436 మార్కులు సాధించినట్లు చెప్పారు.



టాపర్స్‌తో ట్రినిటీ కళాశాల విద్యాసంస్థల చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, అధ్యాపకులు

ఇంటర్ ఫలితాల్లో 'ట్రినిటీ' ప్రభంజనం

కరీంనగర్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో కరీంనగర్‌లో ట్రినిటీ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్వితీయ ప్రతిభ కనబరిచారు. సెకండియర్ ఎంపీసీలో కె.నిఖిత, ఎం.మానస 990 మార్కులు, ఇద్దరు విద్యార్థులు 989, ఇద్దరు 988, ఇద్దరు 987 మార్కులు సాధించారు. బైపీసీలో చంద్రశేఖర్ 989 మార్కులు, ఐదుగురు విద్యార్థులు 988, ఇద్దరు 985, ఎంఈసీలో ఆర్.సాత్విక 986 మార్కులు సాధించారు. ఫస్టియర్ ఎంపీసీలో వి.ఆశ్రిత, ఎం.శ్రావ్య 467, ఆరుగురు విద్యార్థులు 466 మార్కులు సాధించారు. బైపీసీలో ఎస్.గంగశ్రీ 436 మార్కులు, కె.రాణి 435, రిదా హర్షణి 434 మార్కులు సాధించారు. ఎంఈసీలో కె.పూజ 470, సీఈసీలో డి.వర్షిణి 489 మార్కులు సాధించారు.



టాపర్స్‌తో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

సత్తాచాటిన 'ఆల్ఫోర్స్'

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లోని ఆల్ఫోర్స్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటారు. రాష్ట్రస్థాయిలో రాణించిన విద్యార్థులను ఆల్ఫోర్స్ చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. సెకండియర్ ఎంపీసీలో ఎస్.హర్షిత, ఎస్.ఉజ్వల్, ఎస్.హరిణి, జి.వినీత, కె.రాజశేఖర్ 992 మార్కులు సాధించారు. బైపీసీలో ఎస్.నిహారిక 992 మార్కులు సాధించారు. ఎంఈసీలో సి.హెచ్.మనీషా, జి.అమూల్య 988 మార్కులు సాధించారు. ఫస్టియర్ ఎంపీసీలో పది మంది విద్యార్థులు 467 మార్కులు, బైపీసీలో ఏ.శ్రీనిధి 437, ముగ్గురు 436 మార్కులు, ఎంఈసీలో ఎం.వినమ్రత 488 మార్కులు సాధించారు.

ఆర్టీసీకి సీజన్ జోష్



ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు (ఫైల్)

- వారం రోజులుగా బస్సుల్లో పెరుగుతున్న ప్రయాణికుల శాతం
- పెరిగిన ఆదాయంతో సంస్థలో హుషారు
- కలిసివస్తున్న శుభకార్యాలు

సాక్షి, ఆదిలాబాద్: శుభకార్యాల సీజన్ కావడంతో ఆర్టీసీకి కలిసివస్తోంది. బస్సుల్లో వారం రోజులుగా ప్రయాణికుల శాతం ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) పెరిగింది. దీంతో సహజంగానే ఆదాయం బాగా వస్తోంది. ఈ నెలంతా వివాహాలు, ఇతర శుభకార్యాలు ఉండడంతో ఇదే పరిస్థితి ఉంటుందని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. విద్యార్థులు పరీక్షల కోసం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్తుండటంతో కూడా రద్దీ పెరిగిందని చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

ఆదిలాబాద్ రీజియన్‌లో ఆదిలాబాద్, భైంసా, నిర్మల్, ఉట్నూర్, ఆసిఫాబాద్, మంచిర్యాల డిపోలు ఉన్నాయి. ఈ నెల 3న రీజియన్ మొత్తంగా 83 శాతం ఓఆర్ నమోదు కావడం గమనార్హం. దీంతో రూ.కోటి 23 లక్షల ఆదాయం సమకూరింది. కాగా ఈ వారం రోజుల్లో ఉట్నూర్, భైంసా మినహాయిస్తే మిగితా డిపోల్లో ప్రాఫిట్ అధికంగా వచ్చింది. ఆ రెండు డిపోల్లోనూ ఓఆర్ పెరిగినప్పటికీ మిగితా డిపోలతో పోల్చితే కొంత ఆదాయం తక్కువగా ఉంది.

మార్పులు కూడా దోహదం..

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 609 బస్సులు ఉన్నాయి. అందులో అద్దె బస్సులు 306, ఆర్టీసీ బస్సులు 303 ఉన్నాయి. డిపో వారీగా ఆదిలాబాద్‌లో 130, భైంసాలో 80, నిర్మల్‌లో 139, ఉట్నూర్‌లో 39, ఆసిఫాబాద్‌లో 81, మంచిర్యాలలో 140 ఉన్నాయి. ఇటీవల కాలంలో పాత సూపర్ లగ్జరీ బస్సులను 60 వరకు రీజియన్‌లో మార్చారు. కొత్త సూపర్ లగ్జరీ బస్సులతో దూరప్రాంతాల ప్రయాణికులకు సౌకర్యం పెరిగింది. మరికొన్ని కొత్త సూపర్ లగ్జరీలు రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. నాలుగు నెలల కాలంలో కొత్తగా 70 పల్లె వెలుగు బస్సులు, పది ఎక్స్‌ప్రెస్ బస్సులు వచ్చాయి. ఇందులో అద్దె బస్సులే అధికంగా ఉన్నాయి. ఈ మార్పులు కూడా ప్రయాణికులకు సౌకర్యవంతంగా మారాయి.

రీజియన్‌లో వారం రోజులుగా ఓఆర్, ఆదాయం వివరాలు

తేది	ఆదాయం (రూ. కోట్లలో)	ప్రయాణికుల శాతం (ఓఆర్)
మే 1	1.16	77
మే 2	1.17	77
మే 3	1.23	83
మే 4	1.14	78
మే 5	1.06	72
మే 6	1.12	74
మే 7	1.11	74

ఈపీకే పెరిగింది..



సాధారణ రోజుల్లో ఎవరేజ్ ఎర్నింగ్స్ ఫర్ కిలోమీటర్ (ఈపీకే) రూ.40 ఉండగా వారం రోజులుగా రూ.46 వరకు వస్తోంది. గత నెలలోనూ అన్ని డిపోల్లో నష్టం వచ్చింది. ఈ కొద్ది రోజులుగా మాత్రమే ఆర్టీసీ ఆదాయం పెరిగింది. – జానిరెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం, ఆదిలాబాద్

నిండా మునిగిన అన్నదాత

- జిల్లాలో మళ్లీ భారీవర్షం
- తడిసి ముద్దయిన ధాన్యం
- రైతు కన్నీటిపర్యంతం



రాజారాంతండా శివారులో రోడ్డుపై విరిగిన చెట్టు



బట్టపల్లిలో వ్యవసాయ బావిలోకి కొట్టుకుపోయిన ధాన్యం



కట్కాపూర్‌లో కొట్టుకుపోయిన ధాన్యం



కట్లకుంటలో నీటిలో ధాన్యం కుప్పలు

సారంగాపూర్/రాయికల్(జగిత్యాల)/కథలాపూర్/మేడిపల్లి: జిల్లాలోని వివిధ మండలాల్లో మంగళవారం మధ్యాహ్నం మరోసారి ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది.కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం పూర్తిగా నీటిపాలైంది. కోతకు వచ్చిన వరిపైరు నేలవాలింది. రాయికల్, సారంగాపూర్, బీర్‌పూర్, కథలాపూర్ తదితర మండలా ల్లో అన్ని గ్రామాల్లో భారీవర్షం కురిసింది.సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని కొన్ని కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం సంచులు తడిసిపోయాయి. పలు కేంద్రాల్లో వరదకు వడ్లు కొట్టుకుపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బట్టపల్లి సింగిల్‌విండో కొనుగోలు కేంద్రంలోని ధాన్యం వర్షపునీటి ధాటికి సమీపంలోని వ్యవసాయ బావిలోకి కొట్టుకుపోయింది. రైతు దాసరి నర్సయ్యకు చెందిన సుమారు 10 క్వింటాళ్ల ధాన్యం వరదకు వ్యవసాయ బావిలోకి కొట్టుకుపోయింది. కథలాపూర్ కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యం తడిసిందని రైతులు వాపోయారు. చింతకుంట గ్రామం నుంచి రాజారాం తండా గ్రామానికి వెళ్లేదారిలో చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. స్థానికులు ట్రాక్టర్ సాయంతో వాటిని తొలగించారు.

తడిసిన ధాన్యం

మేడిపెలి: అకస్మాత్తుగా కురిసిన వర్షంతో వివిధ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యం తడిసింది. కొన్నిచోట్ల వర్షపు నీటిలో కొట్టుకుపోవడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు.

నీట మునిగిన ఆశలు

రాయికల్(జగిత్యాల): తాట్లవాయి, కట్కాపూర్, ధర్మాజీపేట, రాయికల్, సింగరావుపేట గ్రామాల్లో వడ్లు నీట మునగడంతో రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. తాట్లవాయి, ధర్మాజీపేట, కట్కాపూర్ గ్రామాల్లో రాళ్లవాన కురవడంతో వివిధ పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.



'ప్రాణహిత' నిర్మాణానికి కృషి

- కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి పరుషోత్తం రూపాల



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పరుషోత్తం రూపాల

కాగజ్‌నగర్‌టౌన్: ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేస్తామని కేంద్ర పశుసంర్ధక శాఖ, పాడి, మత్స్య శాఖ మంత్రి పరుషోత్తం రూపాల అన్నారు. పార్లమెంట్ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా మంగళవారం కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ముందుగా త్రిశూల్ పహాడ్‌పై గల శ్రీలక్ష్మీనారాయణ ఆలయాన్ని దర్శించుకున్నారు. అంతకు ముందు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, సిర్పూర్ నియోజకవర్గ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టకుండానే రాష్ట్ర ప్రభుత్వం రూ.వేలకోట్ల నిధులు కాలువల నిర్మాణానికి కేటాయించి దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపించారు. ప్రధాన మంత్రి మోదీ పాలనలో గ్రామ స్వరాజ్య స్థాపన ధ్యేయంగా సర్పంచులకు నేరుగా రూ.కోటి కేటాయించి, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్ సర్పంచ్ బికాస్‌గరామి హయాంలో రూ.కోటి నిధులతో అభివృద్ధి చేయడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. పేదలకు మెరుగైన వైద్యసేవలను అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ప్రవేశపెట్టినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. కొత్తపల్లి శ్రీనివాస్, పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణాలు లేకపోవడంతో రైతులు సాగునీటికి అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదన్నారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి వీరభద్రచారి, నాయకులు శ్రీనివాస్, విశ్వేశ్వర్‌రావు, కొంగ సత్యనారాయణ, గోలేం వెంకటేశ్, భూమన్న, అమర్‌సింగ్ తిలావత్, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ నిధులు పక్కరాష్ట్రాలకు వినియోగిస్తున్న బీఆర్ఎస్

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ ప్రజల నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం పక్క రాష్ట్రాలకు వినియోగిస్తుందని కేంద్ర మంత్రి పరుషోత్తం రూపాల ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎం గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన లోక్‌సభ ప్రవాస్ యోజన కార్యక్రమానికి హాజరయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు కోట్నాక విజయ్, అమర్‌సింగ్ తిలావత్, సతీష్‌బాబు, అజ్మీర ఆత్మారాంనాయక్, ఆంజనేయులుగౌడ్, సెర్ల మురళి పాల్గొన్నారు.

సిరిసిల్లలో ఉద్యోగాల పేరిట మోసం

- 13 మందిని నమ్మించి, రూ.9.40 లక్షలు వసూలు
- నిందితుడి అరెస్టు



పోలీసులు సీజ్ చేసిన నకిలీ పత్రాలు, స్టాంపులు

సిరిసిల్ల క్రైం: వేములవాడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మించి, 13 మంది వద్ద రూ.9.40 లక్షలు వసూలు చేసి, మోసగించిన వ్యక్తిని సిరిసిల్ల పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఉద్యోగ నకిలీ నియామక పత్రాలు, రబ్బర్ స్టాంపులను సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేటకు చెందిన కుమ్మన ఉపేందర్ వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగాలున్నాయని, నియమకాలు తానే చేస్తానని చెప్పి, 13 మందికి ఆశ చూపాడు. వారి నుంచి డబ్బులు తీసుకొని, నియామక పత్రాలు అందించాడు. బాధితుల్లో కొందరు అవి నకిలీవని గుర్తించి, విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుడిని మంగళవారం సిరిసిల్ల పాతబస్టాండ్ ఏరియాలో అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా పోలీసు కార్యాలయంలో మాట్లాడుతూ.. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉద్యోగార్థులకు పోటీ పరీక్షల్లో రాణించడం వల్లే ఉద్యోగాలు వస్తాయని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

నాన్న కళ్లలో
ఆ ఆనందం కోసమే నా తపన

ఫలితాలలో కార్పొరేట్ స్కూళ్లకు
మించి ప్రభుత్వ స్కూళ్లు

ఏపీ ప్రభుత్వ స్కూళ్ల టెన్త్ టాపర్
కామిరెడ్డి హేమశ్రీ (594/600)

'కలాసీ కూతురు ఇంజినీర్'

అని అందరూ చెప్పకోవాలి


హేమశ్రీ


తండ్రి శ్రీనివాసరావు, తల్లి గోవిందమ్మలతో హేమశ్రీ

''మా నాన్న వ్యవసాయ కూలీగా ఉంటూ కుటుంబాన్ని పోషించేవారు. ఆ సంపాదన మా చదువులకు సరిపోదని విశాఖ వచ్చి పూర్ణామార్కెట్‌లో కలాసీగా పనిచేస్తున్నారు. నాకు మంచి మార్కులు వస్తున్నాయని, బాగా చదివించమని మా ఉపాధ్యాయులు చెప్పడంతో నాన్న ఎప్పుడూ నా గురించే ఆలోచించేవారు. చాలీచాలని సంపాదనతో ఎలా చదివించాలన్నదే ఆయన ఆందోళన. అలాంటి సమయంలో నేను 8వ తరగతిలో ఉండగా మొదటిసారి అమ్మ ఒడి అందింది. వరుసగా మూడేళ్ల ఆ పథకం వల్ల లబ్ధి పొందడం వల్ల నా చదువు ఎలాంటి భారం లేకుండా సునాయాసంగా సాగిపోయింది. మా పాఠశాల ఉపాధ్యాయులందరూ ప్రత్యేక శ్రద్ధతో నన్ను తీర్చిదిద్దారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి టాపర్‌గా నిలవడం ఆనందంగా ఉంది''

ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో 594 మార్కులు సాధించి ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల్లో టాపర్‌గా నిలిచిన అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల విద్యార్థిని కామిరెడ్డి హేమశ్రీ మనోగతమిది.

అతి సామాన్య కుటుంబం నుంచి వచ్చి చదువుల సరస్వతిగా నిలిచింది. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తెచ్చింది. ఒకప్పుడు కార్పొరేట్ స్కూళ్లకే పరిమితమైన టెన్త్ టాపర్లు.. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల నుంచి పుట్టుకొచ్చారు. అలాంటి టాపర్లలో ఈమె ఒకరు. ఆమెతో 'సాక్షి' సంభాషించింది. హేమశ్రీ ఎలా ఈ స్థాయికి చేరుకుందో ఆమె మాటల్లోనే..

నాన్న మాటలే స్ఫూర్తి

''అమ్మ గోవిందమ్మ, మా నాన్న శ్రీనివాసరావు. నాన్న పదో తరగతిలో రెండు సబ్జెక్టులు ఫెయిల్. ప్రస్తుతం విశాఖలోని పూర్ణా మార్కెట్లో కలాసీ. ఓ రకంగా నాన్నే నా విజయానికి స్ఫూర్తి. తను బాగా చదవలేకపోవడం వల్లే టెన్త్ ఫెయిలయ్యారు. కలాసీగా రాత్రీపగలూ కష్టపడుతున్నారు. అదే మాకు పదేపదే చెప్పేవారు. తానెన్ని కష్టాలుపడ్డా.. అదంతా నా కోసం, నా తమ్ముడి కోసమేనని గుర్తు చేసేవారు. మా చదువులకు డబ్బులు అవసరమవుతాయనే ఆరేళ్ల క్రితం దేవరాపల్లి నుంచి విశాఖ వచ్చేశారు. నాన్న కష్టం తెలుసు. అందుకే చదువు తప్ప వేరే ధ్యాసలేకపోయింది. అదే నన్ను పదో తరగతి ఫలితాల్లో 594 మార్కులతో టాపర్‌గా నిలిపింది.

చదువంతా సర్కారీ స్కూల్లోనే..

ఒకటో తరగతి నుంచి 4వ తరగతి వరకూ మా స్వగ్రామం దేవరాపల్లి మండలం కొత్తపెంటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుకున్నా. ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రవేశ పరీక్షలో 92 మార్కులు సాధించా. దీంతో అచ్యుతాపురం ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ (గరల్స్)లో సీటు వచ్చింది. నా జీవితంలో నేను సాధించిన తొలి విజయమది. ఐదోతరగతి నుంచి పదో తరగతి వరకూ ఇక్కడే. అమ్మానాన్నల కష్టం తెలియడంతో వారికి ఏ రోజూ నా చదువు భారం కాకూడదనుకున్నాను. ఎంత బాగా చదివితే.. నా చదువుకు అంత తక్కువ ఖర్చవుతుందని తెలుసుకున్నాను. దీనికి నా తల్లిదండ్రుల ఆర్థిక స్థోమత తెలియడం ఒక కారణమైతే, మా స్కూల్ టీచర్లు మరో కారణం. ఇక్కడ చదువుతున్న వారిలో దాదాపు అంతా దిగువ మధ్యతరగతికి చెందిన వారే. అందుకే మా టీచర్లు చదువు విలువ తెలిసేలా, పరీక్షల భయం పోయేలా నిత్యం మమ్మల్ని ప్రోత్సహించారు.

వసతులు పెరిగాయి

సాధారణంగా రెసిడెన్షియల్ స్కూళ్లు మిగిలిన ప్రభుత్వ స్కూళ్లతో పోల్చుకుంటే కాస్త మెరుగ్గానే ఉంటాయి. అయితే నా వ్యక్తిగత అవసరాలకు మొదటి మూడేళ్లు ఇంటి నుంచి కొంత డబ్బులు తీసుకొచ్చేదాన్ని గత మూడేళ్లుగా పరిస్థితి చాలా మారింది. వసతులు మరింత మెరుగయ్యాయి. పర్యవేక్షణ పెరిగింది. పుస్తకాలు, యూనిఫాం, షూస్.. ఇలాంటి వాటి కోసం అమ్మానాన్నల్ని డబ్బులడిగే అవసరం లేకుండా పోయింది. మూడుసార్లు అమ్మ ఒడి అందుకున్నా. సీఎం జగన్ మామయ్య ప్రభుత్వంలో కార్పొరేట్ స్కూళ్లను మించి ప్రభుత్వ స్కూళ్లు బాగుపడ్డాయి.

ఇంజినీర్ కావడమే లక్ష్యం

ఇంజినీర్ కావాలన్నది నా కల. అందుకు రూ.లక్షల్లో ఖర్చుపెట్టే స్థోమత నా కుటుంబానికి లేదు. బాగా చదవడమే ఖర్చులేని దారని నాకు తెలుసు. అందుకే టీచర్లు చెప్పిన పాఠాలను ఎప్పటికప్పుడు పునశ్చరణ చేసుకునేదాన్ని. అర్థంకాని విషయాల్ని ఎప్పుడు అడిగినా, టీచర్లు ఓపిగ్గా విడమరిచి చెప్పేవారు. నా తమ్ముడు సందీప్ ప్రస్తుతం 7వ తరగతి పూర్తి చేసుకున్నాడు. మా అమ్మానాన్నలకు మేం భరోసాగా నిలవాలన్నదే నా కోరిక. దాన్ని నెరవేర్చేందుకు చదువు తప్ప, నాకు వేరే మార్గం తెలియదు. ఇంజినీర్‌గా స్థిరపడి నాలాంటి వారికి ఆసరాగా నిలవగలిగితే చాలు. 'కలాసీ కూతురు ఇంజినీర్' అని నలుగురూ చెప్పుకుంటే.. మా నాన్న కళ్లలో కనిపించే ఆనందాన్ని చూడాలి.. అంతే..!''

– లోవరాజు, సాక్షి, అనకాపల్లి

మిట్టు.. సూపర్ హిట్టు

టెన్త్‌లో 594 మార్కులు

శ్రీకాకుళం జిల్లా (ఆంధ్రప్రదేశ్) పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదివిన మిట్టు మహాపాత్రో 600కు 594 మార్కులు సాధించాడు. పాతపట్నంలోని సెయింట్ ఆన్స్ స్కూల్ ఎదురుగా ప్రధాన రహదారిలో వీరి ఇల్లు. మహాపాత్రో తండ్రి దుర్గాప్రసాద్ మహాపాత్రో ద్విచక్రవాహనాల టైర్లకు పంక్చర్లు వేస్తుంటారు. తల్లి మమత మహాపాత్రో గృహిణి. మిట్టు పాఠశాల సెలవుల్లోను, ఇంటి వద్ద ఉన్నప్పుడు సైకిల్‌కు, బైక్‌లకు పంక్చర్లు వేయడంలో తండ్రికి సహాయం చేస్తుండేవాడు. ఒడియా బ్రాహ్మణ కుటుంబానికి చెందిన పేద కుటుంబం వీరిది. మిట్టుకు పదో తరగతిలో అత్యధిక మార్కులు రావడంతో ఆ కుటుంబంపై ఇప్పుడు ప్రశంసలు కురుస్తున్నాయి. పాతపట్నంలో 20 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నా అత్యధిక మార్కులు మాత్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన మిట్టు సాధించాడు. తన కుమారుడికి పదో తరగతిలో జిల్లా మొదటి స్థానం రావడంతో ఆనందంగా ఉందని తండ్రి దుర్గా ప్రసాద్ తెలిపారు. మిట్టు ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు పాతపట్నం ప్రభుత్వ ప్రాథమిక ఒడియా పాఠశాలలో చదివాడు.

– రవి కుమార్, సాక్షి పాతపట్నం


తల్లిదండ్రులతో మిట్టు మహాపాత్రో

ఇంజినీర్ అవుతా...
అమ్మ, నాన్న, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పదో తరగతిలో మంచి మార్కులు సాధించాను. ట్రిపుల్ ఐటీ చదివి, ఇంజినీర్ అవుతా. – మిట్టు మహాపాత్రో

మే 12 అంతర్జాతీయ నర్సుల దినోత్సవం. దుబయ్ హెల్త్‌కేర్ సంస్థ 'ఏస్టర్ గార్డియన్స్' ఆ రోజున లండన్‌లో ఒక గొప్ప నర్సుకు రెండున్నర లక్షల యూఎస్ డాలర్లతో (రెండు కోట్ల రూపాయలు) 'గ్లోబల్ నర్సింగ్ అవార్డ్' బహూకరించనుంది. ప్రపంచవ్యాప్తంగా ఇందుకు 10 మంది నర్సులను షార్ట్‌లిస్ట్ చేస్తే మన దేశం నుంచి ఒకరు శాంతి తెరెసా లక్రా. అండమాన్‌లో ఆదివాసీలకు చేసిన సేవ, సునామీ సమయంలో చూపిన కరుణ ఆమెకు ఇదివరకే 'పద్మశ్రీ'ని తెచ్చి పెట్టగా ఇప్పుడు గ్లోబల్ అవార్డు కనుచూపుమేరలో ఉంది. లక్రా పరిచయం.

● గ్లోబల్ అవార్డ్/ షార్ట్‌లిస్ట్

అండమాన్‌కు ఆమే నర్సు



నర్స్‌ని 'సిస్టర్' అని పిలుస్తాం కాని 'మదర్' అని పిలిచినా తక్కువే. తల్లిలా సేవ చేసి, ఔషధాలిచ్చి పేషెంట్‌ని ఆరోగ్యవంతుణ్ణి చేయడంలో ఆమె చూపే ఓపిక గొప్పది. నర్సుల వ్యవస్థ లేకపోతే, నర్సులనే వారే లేకపోతే పేషెంట్లు ఏమైపోతారో. అందుకే ప్రపంచవ్యాప్తంగా మే 12వ తేదీని 'అంతర్జాతీయ నర్సుల దినోత్సవం'గా జరుపుకుంటారు. నర్సుల సేవను కొనియాడతారు. భారత సంతతికి చెందిన డాక్టర్ ఆజాద్ మూపన్ దుబాయ్‌లో 'ఏస్టర్ గార్డియన్స్' అనే హెల్త్‌కేర్ సంస్థను నడుపుతూ గొప్ప సేవ చేస్తున్న నర్సుకు రెండు కోట్ల రూపాయల నగదుతో 'గ్లోబల్ నర్సింగ్ అవార్డు 2023' ను బహూకరించదలిచారు. ఆన్‌లైన్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా 50 వేల మంది నర్సులు ఈ అవార్డు కోసం పోటీ పడితే ఫైనలిస్టులుగా 10 మంది నిలిచారు. వీరిలో 8 మంది స్త్రీలుకాగా, ఇరువురు పురుషులు. కెన్యా, పనామా, ఇంగ్లాండ్, టాంజానియా, పోర్చుగల్... తదితర దేశాల నుంచి ఒక్కొక్కరు ఫైనల్‌కు చేరగా మన దేశం నుంచి శాంతి తెరెసా లక్రా ఆ పట్టికలో నిలిచింది. ప్రస్తుతం వీరి గెలుపుకు ఓటింగ్ జరుగుతోంది. ఎవరికి ఎక్కువ ఓట్లు దక్కుతాయో వారికి అవార్డును లండన్‌లో మే 12న బహూకరిస్తారు.

లిటిల్ అండమాన్‌లో

2000 సంవత్సరం నుంచి శాంతి తెరెసా లక్రా లిటిల్ అండమాన్‌లోని దుగాంగ్ క్రీక్‌లో విధులు నిర్వహించేది. అక్కడ ఓన్‌గీ గిరిజన తెగ వారు ఎక్కువ. వారు నాగరిక ప్రపంచంలో కలవరు. వైద్య సేవలను తీసుకోరు. కాని శాంతి లక్రా వారితో అతి కష్టం మీద మాట కలిపి నమ్మకం సంపాదించింది. ముఖ్యంగా గర్భిణీలకు వైద్య సహాయం అందేలా జాగ్రత్త తీసుకునేది. ఓన్‌గీ తెగ వారు తన దగ్గరకు రాకపోయినా తనే మందులు తీసుకుని అడవిలోకి వెళ్లేది. 'ఒక్కోసారి తిరిగొస్తానో రానో కూడా తెలియని పరిస్థితిలో వెళ్లేదాన్ని' అని ఆమె గుర్తు చేసుకుంది. క్రమక్రమంగా వారు ఆమెను విశ్వసించసాగారు.

2004 సునామీలో

ప్రపంచాన్ని కుదిపేసిన సునామీ అండమాన్‌ని అతలాకుతలం చేసింది. ముఖ్యంగా శాంతి లక్రా పని చేస్తున్న లిటిల్ అండమాన్‌లో ఏ అండా మిగల్లేదు. శాంతి కూడా ఒక గుడారం వేసుకుని వైద్య సహాయం అందించాల్సి వచ్చింది. 'అలాంటి పరిస్థితిలోనే ఒకే రాత్రి ఇద్దరు ఓన్‌గీ మహిళలకు డెలివరీ చేశాను. ఒక మహిళకు చాలా బరువు తక్కువ శిశువు పుట్టింది. తల్లీ బిడ్డా ఇద్దరినీ కాపాడాల్సి వచ్చింది. వారిని పదిరోజులు చలి నుంచి కాపాడుతూ హెలికాప్టర్ సహాయం కోరి పోర్ట్‌బ్లెయిర్ తరలించాను. ఆరు నెలల తర్వాత వారు ఆరోగ్యంగా తిరిగి వచ్చారు. చాలా సంతోషించాను' అని తెలిపింది శాంతి. ఆ సమయానికి ఆమె కొడుకు వయసు ఒక సంవత్సరం. పిల్లాణ్ణి కూడా చూసుకోలేక విధుల్లో మునిగి ఉండటం వల్ల అత్తామామలు వచ్చి బాబును తీసుకెళ్లారు. 'రెండేళ్లు వాడి ముఖం చూడకుండా పని చేశాను' అని చెప్పిందామె. 2006 వరకూ ఓన్‌గీ తెగ కోసం పని చేయడం వల్ల ఆమెకు రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ చేతుల మీదుగా 'పద్మశ్రీ' ఇచ్చి గౌరవించింది ప్రభుత్వం. ఇప్పుడు శాంతి పోర్ట్‌బ్లెయిర్‌లోని జి.బి.పంత్ హాస్పిటల్‌లో పని చేస్తోంది.

కోవిడ్ కాలంలో

'మార్చి 24, 2020న అండమాన్‌లో తొలి కోవిడ్ కేస్ నమోదైంది. ఆ సమయంలో మా హాస్పిటల్‌లో ఇద్దరు గిరిజనులు వైద్యం పొందుతున్నారు. నేను వెంటనే హాస్పిటల్ వదిలి గూడేలకు వెళ్లిపోండి అని పంపించేశాను. వారికి కోవిడ్ సోకితే అండమాన్‌లోని అన్ని తెగలకు అంటుకుంటుంది. వారి రోగనిరోధక శక్తి తక్కువ. బతకరు. అందుకని వారిని అడవుల్లో ఇంకా లోపలికి వెళ్లి గడపండని చెప్పాను. వాళ్లు అర్థం చేసుకున్నారు. తమను తాము కాపాడుకున్నారు' అని చెప్పింది శాంతి లక్రా.

కోవిడ్ కాలంలో ఆమె ఎంతో ధైర్యంగా అక్కడి భారతీయులకు వైద్య సహాయం అందించింది. ఆదివాసీ తెగలను ఒప్పించి వాక్సిన్లు వేసుకునేలా చేసింది. వృత్తి పట్ల ఎంతో అంకిత భావం ఉన్నవారే ఇవన్నీ చేయగలరు. అందుకే ఆమె గొప్ప నర్స్‌గా జేజేలు అందుకుంటున్నది. అవార్డు వచ్చినా రాకపోయినా ఆమె గొప్ప నర్సే.

● గౌరవం

సేవకు ఆహ్వానం


మంజు మాల్హి

ఆంగ్లో ఇండియన్ వంటకాల్లో మహా వంటగత్తెగా పేరు తెచ్చుకున్న మంజు మాల్హికి 'ప్రిన్స్ చార్లెస్ గారి పట్టాభిషేకానికి హాజరుకండి' అని అరుదైన ఆహ్వానం అందింది. ఆమె వెళ్లింది. ఆమెకే ఎందుకు?

1940 నాటి స్టయిల్‌తో

చార్లెస్ పట్టాభిషేకానికి ఫ్యాషన్ డిజైనర్ గీతా హండా డిజైన్ చేసిన 1940ల నాటి ఇండో బ్రిటిష్ స్టయిల్ కాస్ట్యూమ్స్‌తో హాజరైంది మంజు మాల్హి. అంతేకాదు కొందరు దేశ ప్రతినిధులను రాజప్రాసాదం తరఫున రిసీవ్ చేసుకునే అవకాశం కూడా పొందింది. 'ఆ అనుభవం జీవితాంతం మర్చిపోలేను' అందామె. వంటలో కశ్మీరీ కారం పొడిని తప్పక వాడే మంజు ఆలూ, పచ్చి మిర్చిలతో బోలెడన్ని వంటలు చేస్తుంది. ఆమెకు వ్యక్తిగతంగా షాహీ పనీర్ ఇష్టం. 'ప్రతి కూరకూ తినే సందర్భం ప్రత్యేకంగా ఉంటుంది' అని చెప్పే మంజు తన ప్రత్యేకతలతో విశిష్టంగా నిలిచింది.

ప్రపంచవ్యాప్తంగా ఎంచి ఎంచి తయారు చేసిన 2000 మంది అతిథుల పట్టిక- ప్రిన్స్ చార్లెస్ పట్టాభిషేక మహోత్సవం కోసం ఖరారైంది. రాజ్యాధినేతలు, మతాధికారులు, సంపన్నులు... వీరందరూ ఉన్న ఈ లిస్ట్‌లో ఒక బ్రిటిష్ ఇండియన్ అయిన షెఫ్ కూడా ఉంది. ఆమె పేరు మంజు మాల్హి. వాయవ్య లండన్‌లో సెలబ్రిటీ షెఫ్‌గా జీవనం సాగిస్తున్న ఆమెకు ఏప్రిల్ నెలాఖరులో మెయిల్ వచ్చింది 'మే 6న జరగనున్న ప్రిన్స్ చార్లెస్ పట్టాభిషేకానికి హాజరుకండి' అని. ఆమె ఆ మెయిల్ చూసి ఎవరో ప్రాంక్ చేస్తున్నారని లైట్ తీసుకుంది. కాని ఆ తర్వాత అదే మెయిల్‌ను ధ్రువీకరిస్తూ అధికార ఆహ్వాన పత్రం అందింది. ఎంతో అరుదుగా జరిగే ఒక వేడుకలో మహామహుల మధ్య తనక్కూడా ఆహ్వానం అందడంతో మంజు మాల్హి ఆనందానికి అవధుల్లేవు.



పంజాబ్ నుంచి వెళ్లి

50 ఏళ్ల మంజు మాల్హిది పంజాబ్. ఆమె తల్లిదండ్రులు ఆమె పుట్టకముందే లండన్ వలస వెళ్లారు. మంజు అక్కడే పుట్టింది. అయితే బాల్యంలో ఆమె ఇండియాను మిస్ కాకూడదని కొన్నేళ్లు పంజాబ్‌లో ఉంచారు తల్లిదండ్రులు. అప్పుడే ఆమెకు భారతీయ రుచులు అర్థమయ్యాయి. ఆ తర్వాత లండన్‌కు చేరుకున్నా తల్లి బ్రిటిష్ దినుసులను, ఇండియన్ మసాలాలను కలిపి రోజూ వంటలు చేసేది. ఆ వంటలు మాల్హి మీద గాఢమైన ముద్ర వేశాయి. చాలా శ్రద్ధగా వంట నేర్చుకుంది. షెఫ్‌గా బతకాలని నిశ్చయించుకుంది. ఆ దిశగానే కెరీర్ మొదలెట్టింది.

1999లో వెలుగులో

బీబీసీ టీవీ కార్యక్రమం 'ఫుడ్ అండ్ డ్రింక్' 1999 సంవత్సర విజేతగా నిలవడంతో మంజు మాల్హి వెలుగులోకి వచ్చింది. బ్రిట్-ఇండిగా ఆమె పేర్కొనే వంటలు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకోవడంతో అప్పుడు బీబీసీతో మొదలైన అనుబంధం ఇప్పటికీ కొనసాగుతూ ఉంది. మంజు బీబీసీకి రెగ్యులర్‌గా ఫుడ్ ప్రోగ్రాములు చేస్తోంది. అంతే కాదు లండన్‌లో స్థిరపడిన భారతీయుల కోసం 'బ్రిట్ స్పైస్' అనే పుస్తకం రాసింది. అది పెద్ద హిట్. ఆ తర్వాత 'ఇండియా విత్ పాషన్', 'ఈజీ ఇండియన్ కుక్‌బుక్'లాంటి పుస్తకాలు వెలువరించింది. చాలా సులభంగా తయారయ్యి రుచిగా ఉండటమే ఆమె వంటల ప్రత్యేకత.

కోవిడ్ సేవలు

కోవిడ్ కాలంలో లండన్‌లో వంట చేసుకోలేకపోతూ ఇళ్లల్లో ఇబ్బంది పడుతున్న వయోవృద్ధులను గమనించి 'ఓపెన్ ఏజ్' అనే కార్యక్రమం మొదలెట్టింది మంజు మాల్హి. తనే వారి కోసం వంట చేస్తూ ఆహారం అందించింది. అయితే అది శ్రమ కనుక కాన్ఫరెన్స్ కాల్స్ ద్వారా వయోవృద్ధులకు వంట చేసుకుని తినగలిగే సులభ వంటలను నేర్పింది. 'కోవిడ్ సమయంలో స్ట్రెస్ వల్ల వృద్ధులు ఎక్కువ తినడం మొదలుపెట్టారు. వారికి ఆరోగ్యకరమైన తిండి చేసి చూపించడంతో వంటలో పడి కోవిడ్ భయం నుంచి బయటపడ్డారు' అని తెలిపింది మంజు. ఈ కార్యక్రమం పెద్ద సక్సెస్ అయ్యింది. కోవిడ్ ముగిశాక ఇప్పుడు తాను ఉంటున్న ఏరియాలోనే తన కిచెన్‌లో వయోవృద్ధులకు ఫ్రీ క్లాసెస్ చెబుతోంది మంజు. తన కంటే వయసులో ఎంతో పెద్దవాళ్లయిన స్త్రీ, పురుషులు రోజూ వచ్చి బుద్ధిగా బీన్స్ వలుస్తూ క్యారెట్ తరుగుతూ మంజు దగ్గర వంట నేర్చుకుంటారు. వాళ్లంతా ఆమెను గురువుగా చూస్తారు. ఇది బ్రిటన్ ప్రభుత్వానికి బాగా నచ్చింది. అందుకే ప్రతిష్ఠాత్మకమైన 'బ్రిటిష్ ఎంపైర్ మెడల్' ఆమెకు బహూకరించింది. చార్లెస్ పట్టాభిషేకానికి ఈ మెడల్ పొందిన వారందరినీ పిలిచారు. వారిలో మంజు ఉంది.

యూ(త్) అండ్ ఐ

యూత్ పల్స్

'సినీ కలల యువతరానికి దారి ఏది?' అనే ప్రశ్నకు ఎన్నో జవాబులు వినిపిస్తాయి. అప్రెంటీస్‌గా చేరడం నుంచి నిర్మాతకు కథ వినిపించి ఒప్పించడం వరకు అదొక సుదీర్ఘ ప్రయాణం. అద్భుత ప్రతిభ ఉండి కూడా ఆ ప్రయాణంలో అడుగులు ముందుకు పడని వారు ఎంతో మంది ఉన్నారు. అలాంటి వారికి యాపిల్ కంపెనీ వారి 'షాట్ ఆన్ ఐ ఫోన్' పెద్ద గిఫ్ట్‌గా మారి లిఫ్ట్ ఇస్తోంది..!


సైన్స్ ఫిక్షన్ మూవీ కార్గో కోసం శ్వేత త్రిపాఠికి సూచనలిస్తున్న ఆరతి కడవ్

ప్రసిద్ధ బాలీవుడ్ దర్శకుడు, మ్యూజిషియన్ విశాల్ భరద్వాజ్ రెండు నెలల క్రితం 'ఫుర్సత్' అనే చిత్రాన్ని తీశాడు. 30 నిమిషాల నిడివి కలిగిన ఈ చిత్రాన్ని పూర్తిగా ఐఫోన్ ప్రో 14లో తీశాడు. యాపిల్ ఇండియా ఈ చిత్రాన్ని తన అధికారిక యూట్యూబ్ చానల్‌లో విడుదల చేస్తే 144 మిలియన్‌లకు పైగా వ్యూస్ వచ్చాయి.

సైన్స్-ఫిక్షన్ ఫిల్మ్‌మేకర్ ఆరతి కడవ్ ఐఫోన్‌ను ఉపయోగించి రెండు షార్ట్ ఫిల్మ్స్ తీసింది.

తొలి చిత్రం '55 ఎం/సెకండ్స్' కరోనా సమయంలో మారుమూల ప్రాంతాల్లో చిత్రీకరించింది.

రెండో చిత్రం ది ఆస్ట్రోనాట్ అండ్ ది ప్యారట్. తన చిత్రాలను ఎడిటింగ్ చేయడానికి మ్యాక్‌బుక్ ప్రోమోను ఉపయోగించింది.

ఆ రెండు చిత్రాలకు పెద్ద ఖర్చయితే కాలేదుగానీ పెద్ద పేరు మాత్రం వచ్చింది.

ఐఫోన్ 12 ప్రోమాక్స్ ఉపయోగించి చిత్రించిన 'ది ఆస్ట్రోనాట్ అండ్ ది ప్యారట్' ఫాంటసి ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ పోటీలో ఆరతికి 'బెస్ట్ డైరెక్టర్' అవార్డ్‌ను తెచ్చిపెట్టింది. ఇండియాలోని బెస్ట్-సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్‌మేకర్‌లలో ఒకరిగా పేరు తెచ్చింది.

దిల్లీకి చెందిన ఫొటోగ్రాఫర్ పారుల్ శర్మ తన ఫొటోబుక్ 'డైలెక్ట్స్ ఆఫ్ సైలెన్స్: దిల్లీ అండర్ లాక్‌డౌన్' కోసం ఐఫోన్ ప్రో11 ను ఉపయోగించింది. ఫొటోగ్రాఫర్ రితేష్ ఉత్తమ్‌చందానీ ముంబై జీవితాన్ని పట్టించే 'ది రెడ్ క్యాట్ అండ్ అదర్‌స్టోరీస్' కోసం ఐఫోన్ ఉపయోగించాడు. ఈ ఫొటోబుక్‌లోని 98 చిత్రాలను ఐమ్యాక్, మ్యాక్‌బుక్, ఐప్యాడ్‌లతో ఎడిట్ చేశాడు.



సాఫ్ట్‌వేర్ టు షార్ట్‌ఫిల్మ్స్

మధ్యతరగతిలో కుటుంబంలో పుట్టిన ఆరతి కడవ్ ఐఐటీ, కాన్పూర్‌లో ఇంజినీరింగ్ చేసింది. అమెరికాలో మైక్రోసాఫ్ట్ కంపెనీలో ఉద్యోగం చేసింది. తాను రాసుకున్న కథలను సెల్‌ఫోన్ కెమెరాతో షార్ట్ ఫిల్మ్స్ తీసేది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నప్పుడు కూడా 'సినీ కల' ఆమెను వదిలి వెళ్లలేదు. దీంతో ఉద్యోగానికి గుడ్‌బై చెప్పి కెమెరా చేతబట్టింది. ఐఫోన్ 12 ప్రో మాక్స్ తో తీసిన 'ది ఆస్ట్రోనాట్ అండ్ హిజ్ ప్యారట్' చిత్రంతో బెస్ట్ డైరెక్టర్‌గా గుర్తింపు పొందింది. 'మన టాలెంట్ నలుగురి దృష్టిలో పడడానికి ఇప్పుడు ఎన్నో మార్గాలు ఉన్నాయి. వాటి గురించి తెలుసుకోవడం కూడా మన ప్రయాణంలో భాగం కావాలి' అంటుంది ఆరతి కడవ్.

తాను ఉపయోగించే ఐఫోన్‌లను ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేస్తుండడం అతడి పాషన్. ఐఫోన్ 10,11,12,13 లను ఉపయోగించిన రితేష్ ప్రస్తుతం ఐఫోన్ 14 ప్రోమాక్స్ ఉపయోగిస్తున్నాడు. తన ఫొటోబుక్ కోసం ఐఫోన్ 5ఎస్, ఐఫోన్ 6ఎస్ ఉపయోగించాడు.

యాపిల్ కంపెనీ కొన్ని సంవత్సరాల క్రితం 'షాట్ ఆన్ ఐ ఫోన్' క్యాంపెయిన్ మొదలుపెట్టింది,

సక్సెస్‌ఫుల్ యూజర్ జెనరేటెడ్ కంటెంట్ క్యాంపెయిన్‌గా ఇది పేరు తెచ్చుకుంది. దీనికి కేవలం ఇన్‌స్టాగ్రామ్‌లోనే 27.9 మిలియన్‌ల పోస్ట్‌లు ఉన్నాయి.

ఐఫోన్ యూజర్లు ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్‌లో షేర్ చేసిన 'షాట్స్' ప్యానల్ జడ్జీల ద్వారా బిల్‌బోర్డ్, యాపిల్ రిటైల్ స్టోర్‌లలోకి వెళతాయి. దీని ద్వారా క్రియేటర్‌లకు మంచి గుర్తింపు లభిస్తోంది.

'షాట్ ఆన్ ఐఫోన్' అనేది యాపిల్ ఉత్పత్తుల ప్రచార వ్యూహం అయితే కావచ్చుగానీ దీని ద్వారా యువత సృజన మరో స్థాయికి చేరింది. సాంకేతిక విషయాలపై లోతైన అవగాహన ఏర్పడడానికి కారణం అయింది.

ఐఫోన్‌తో తీసిన చైనీస్ మూవీస్ చూసి అబ్బురపడిన విశాల్ భరద్వాజ్ 'ఫుర్సత్' కోసం ఐఫోన్ చేతపట్టాడు.

విశాల్ 'ఫుర్సత్' ఎంత హిట్ అయింది అనే విషయం పక్కన పెడితే, ఆయన మాటల్లో ఈ చిత్ర ప్రయాణాన్ని అర్థం చేసుకోవడానికి యూత్ (సినీ కలల యువతరం) ప్రాధాన్యత ఇచ్చింది.

'వెరీ లిబరేటివ్' అని తన ప్రయాణ అనుభవాన్ని చెబుతూ యూత్‌ను ఉద్దేశించి ఇలా చెప్పాడు విశాల్ భరద్వాజ్...

'సినిమా కెమెరాతో షూట్ చేయడం అనేది ఖర్చుతో కూడుకున్న పని. దీంతోపాటు ఒక బృందాన్ని కూడా ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఇది కూడా ఖర్చుతో కూడుకున్న పని. నిర్మాతను వెదుక్కుందామనుకుంటే మనం రాసుకున్న స్క్రిప్ట్‌లకు అతడి వ్యాపార లెక్కలకు పొంతన కుదరకపోవచ్చు. మన జేబులో ఒక ఫోన్ ఉంది అనే విషయాన్ని గుర్తు చేసుకుంటే ఖర్చు అవసరం లేదు. కంటెంట్‌పై దృష్టి పెడితే చాలు. ఇది ఫిల్మ్‌మేకర్స్‌కు అద్భుతమైన సమయం'



నితీశ్ రాణాపై రూ. 12 లక్షల జరిమానా

పంజాబ్ కింగ్స్ జట్టుతో సోమవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో నిర్ణీత సమయంలో పూర్తి ఓవర్ల కోటా పూర్తి చేయనందుకు కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు కెప్టెన్ నితీశ్ రాణాపై రూ. 12 లక్షలు జరిమానా విధించారు. స్లో ఓవర్ రేట్ కారణంగా ఈ సీజన్‌లో హార్దిక్ పాండ్యా (గుజరాత్), కోహ్లి, డుప్లెసిస్ (బెంగళూరు), సామ్సన్ (రాజస్తాన్), తాత్కాలిక కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (ముంబై), కేఎల్ రాహుల్ (లక్నో), వార్నర్ (ఢిల్లీ)లపై ఐపీఎల్ నిర్వాహకులు జరిమానా విధించారు.



అభిమన్యుతో అర్జున్ గేమ్ 'డ్రా'

టెపి సెగెమన్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ తొలి 'డ్రా' నమోదు చేశాడు. భారత సంతతికి చెందిన అమెరికా గ్రాండ్‌మాస్టర్, 14 ఏళ్ల అభిమన్యు మిశ్రాతో జరిగిన ఏడో రౌండ్ గేమ్‌ను 19 ఏళ్ల అర్జున్ 33 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. గ్రాండ్‌మాస్టర్ హోదా పొందిన అత్యంత పిన్న వయస్కుడిగా ప్రపంచ రికార్డు సృష్టించిన అభిమన్యు ఈ టోర్నీలో రెండు గేముల్లో నెగ్గి, నాలుగు గేమ్‌లను 'డ్రా' చేసుకొని నాలుగు పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.

'సూర్య' ప్రతాపం

- 35 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్స్‌లతో 83
- బెంగళూరుపై 16.3 ఓవర్లలో 200 లక్ష్యాన్ని ఛేదించిన ముంబై
- వధేరా అజేయ అర్ధ సెంచరీ
- మాక్స్‌వెల్, డుప్లెసిస్ మెరుపులు వృథా


సూర్యకుమార్

ముంబై: ఐపీఎల్‌లో మళ్లీ బంతి బలయ్యింది. బ్యాట్లు ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఓవర్‌కు 10 పైచిలుకు రన్‌రేట్ కూడా దిగొచ్చింది. ముందు బెంగళూరు అదరగొడితే... తర్వాత ముంబై అంత పెద్ద లక్ష్యాన్ని చెదరగొట్టింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 6 వికెట్ల తేడాతో బెంగళూరుపై ఘనవిజయం సాధించింది. తొలుత బెంగళూరు 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 199 పరుగుల భారీస్కోరు చేసింది. మ్యాక్స్‌వెల్ (33 బంతుల్లో 68; 8 ఫోర్లు, 4 సిక్సర్లు), డుప్లెసిస్ (41 బంతుల్లో 65; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) దంచేశారు. తర్వాత కొండంత లక్ష్యాన్ని ముంబై 16.3 ఓవర్లలోనే 4 వికెట్లే కోల్పోయి 200 పరుగులతో ఛేదించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్ యాదవ్ (35 బంతుల్లో 83; 7 ఫోర్లు, 6 సిక్సర్లు) తన ఐపీఎల్ కెరీర్‌లోనే అత్యధిక వ్యక్తిగత స్కోరుతో అదరగొట్టేశాడు. నేహల్ వధేరా (34 బంతుల్లో 52 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించాడు.

క్యాచ్ మిస్ చేయడంతో...

ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే వధేరా క్యాచ్ మిస్ చేయడంతో బతికిపోయిన డుప్లెసిస్ తర్వాత ఉతికి ఆరేశాడు. దీంతో ఆరంభంలోనే స్టార్ బ్యాటర్ కోహ్లి (1), అనూజ్ రావత్ (6) అవుటైనా ఆ ప్రభావం కనిపించలేదు. మ్యాక్స్‌వెల్, డుప్లెసిస్ ఉప్పెనతో పరుగుల ప్రవాహం బెంగళూరును కదం తొక్కించింది. ధాటిగా ఆడి ప్రత్యర్థుల్ని పరిగెత్తించారు.. బౌండరీలతో... వీలైతే సిక్సర్లతో స్కోరుబోర్డును ఉరకలెత్తించారు. 2.2 ఓవర్ నుంచి 12.3 ఓవర్ దాకా బ్యాటింగ్ జోరే స్టేడియం మొత్తాన్ని హోరెత్తించింది. తర్వాత వచ్చిన మ్యాక్స్‌వెలే ముందుగా (25 బంతుల్లో) ఫిఫ్టీ చేసుకోగా, కెప్టెన్ డుప్లెసిస్ (30 బంతుల్లో) ఆ తర్వాత అర్ధసెంచరీ చేశాడు. ఇద్దరు కలిసి మూడో వికెట్‌కు 61 బంతుల్లోనే 120 పరుగుల్ని జతచేశారు. ఎట్టకేలకు మ్యాక్స్‌వెల్‌ను అవుట్ చేసిన బెహ్రెన్‌డార్ఫ్ ముంబై శిబిరాన్ని హమ్మయ్య అనిపించాడు. తర్వాత స్వల్ప వ్యవధిలోనే మహిపాల్ (1), డుప్లెసిస్ కూడా పెవిలియన్ చేరగా వేగం తగ్గింది. దినేశ్ కార్తీక్ (18 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్), కేదార్ (12 నాటౌట్), హసరంగ (12 నాటౌట్) ధాటిగా ఆడలేకపోయారు.

ముంబై... డబుల్ వేగంతో!

కొండను కరిగించేందుకు ముంబై ఓపెనర్ ఇషాన్ కిషన్ (21 బంతుల్లో 42; 4 ఫోర్లు, 4 సిక్సర్లు) అదే తీరున ఆడి బెంగళూరు శిబిరాన్ని వణికించాడు. దీంతో ఆర్‌సీబీ (5.2) కంటే వేగంగా ముంబై 4.3 ఓవర్లలోనే 50 స్కోరు చేసింది. ఐదో ఓవర్ వేసిన హసరంగ ... ఇషాన్ కిషన్, కెప్టెన్ రోహిత్ శర్మ (7)లను అవుట్ చేసి బెంగళూరును ఆనందంలో ముంచాడు. అయితే ఈ ఆనందం మాత్రం కాసేపే నిలిచింది. ఆ తర్వాత ఓవర్ నుంచే బాదడంలో స్పెషలిస్టు సూర్యకుమార్ దూకుడు మొదలైంది. వధేరా కూడా ధాటిగా ఆడటంతో లక్ష్యం కరిగిపోయింది. దీంతో 10.1వ ఓవర్లో ముంబై స్కోరు 100కి చేరితే అక్కడ్నుంచి మరో 20 బంతుల్లోనే (13.3వ ఓవర్లో) 150 పరుగుల్ని వాయువేగంతో అందుకుంది. ఈ క్రమంలో సూర్య 26 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. బ్యాటింగ్‌కు కలిసొచ్చే పిచ్‌పై పేలవమైన బౌలింగ్‌తో బెంగళూరు ఏమీ చేయలేకపోయింది. సూర్యకుమారే కాదు... వధేరా కూడా మంచినీళ్లు తాగినంత సులభంగా సిక్సర్లను బాదేశారు. వైశాక్, హర్షల్ వేసిన చెత్త బంతుల్ని సూర్య సులువుగా చితగ్గొట్టేశాడు. సూర్య, డేవిడ్ (0) వరుస బంతుల్లో అవుటైనప్పటికీ విజయం ముంగిట నిలిచిన ముంబైని సిక్సర్‌తో వధేరా గెలిపించడంతోపాటు అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) ఇషాన్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 1; డుప్లెసిస్ (సి) సబ్–విష్ణు (బి) గ్రీన్ 65; అనూజ్ (సి) గ్రీన్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 6; మ్యాక్స్‌వెల్ (సి) వధేరా (బి) బెహ్రెన్‌డార్ఫ్ 68; మహిపాల్ (బి) కార్తికేయ 1; దినేశ్ కార్తీక్ (సి) వధేరా (బి) జోర్డాన్ 30; కేదార్ జాదవ్ (నాటౌట్) 12; హసరంగ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు)** 199. **వికెట్ల పతనం:** 1-2, 2-16, 3-136, 4-143, 5-146, 6-185. **బౌలింగ్:** బెహ్రెన్‌డార్ఫ్ 4-0-36-3, పీయూష్ చావ్లా 4-0-41-0, గ్రీన్ 2-0-15-1, జోర్డాన్ 4-0-48-1, కార్తికేయ 4-0-35-1, ఆకాశ్ 2-0-23-0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: ఇషాన్ (సి) అనూజ్ (బి) హసరంగ 42; రోహిత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) హసరంగ 7; సూర్యకుమార్ (సి) కేదార్ (బి) వైశాక్ 83; నేహల్ వధేరా (నాటౌట్) 52; టిమ్ డేవిడ్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) వైశాక్ 0; గ్రీన్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (16.3 ఓవర్లలో 4 వికెట్లకు)** 200. **వికెట్ల పతనం:** 1-51, 2-52, 3-192, 4-192. **బౌలింగ్:** సిరాజ్ 3-0-31-0, హాజల్‌వుడ్ 3-0-32-0, హసరంగ 4-0-53-2, వైశాక్ 3-0-37-2, హర్షల్ పటేల్ 3.3-0-41-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	11	8	3	0	16	0.951
చెన్నై	11	6	4	1	13	0.409
ముంబై	11	6	5	0	12	-0.255
లక్నో	11	5	5	1	11	0.294
రాజస్తాన్	11	5	6	0	10	0.388
కోల్‌కతా	11	5	6	0	10	-0.079
బెంగళూరు	11	5	6	0	10	-0.345
పంజాబ్	11	5	6	0	10	-0.441
హైదరాబాద్	10	4	6	0	8	-0.472
ఢిల్లీ	10	4	6	0	8	-0.529

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

చెన్నై x ఢిల్లీ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

'బెస్ట్' మెస్సీ, షెల్లీ ఫ్రేజర్

లారియస్ గ్లోబల్ స్పోర్ట్స్ అవార్డుల్లో ఉత్తమ క్రీడాకారులుగా ఎంపిక




పారిస్: గత ఏడాది అంతర్జాతీయ క్రీడా వేదికపై తమదైన ముద్ర వేసిన ఫుట్‌బాల్ స్టార్ లియోనెల్ మెస్సీ (అర్జెంటీనా), మహిళా అథ్లెట్ షెల్లీ ఆన్ ఫ్రేజర్ (జమైకా)లకు ప్రతిష్టాత్మక లారియస్ గ్లోబల్ స్పోర్ట్స్ అవార్డులు లభించాయి. 2022 సంవత్సరానికిగాను పురుషుల విభాగంలో ఉత్తమ క్రీడాకారుడిగా మెస్సీ... మహిళల విభాగంలో ఉత్తమ క్రీడాకారిణిగా షెల్లీ ఎంపికయ్యారు. మెస్సీ సారథ్యంలో గత ఏడాది అర్జెంటీనా జట్టు 36 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఫుట్‌బాల్ ప్రపంచకప్ టైటిల్‌ను మూడోసారి సొంతం చేసుకుంది. ఈ టోర్నీలో మెస్సీ ఏడు గోల్స్ చేయడంతోపాటు సహచరులు మూడు గోల్స్ చేయడానికి సహాయపడ్డాడు. ఈ మెగా ఈవెంట్‌లో ఉత్తమ ప్లేయర్‌గా నిలిచి 'గోల్డెన్ బాల్' పురస్కారాన్ని కూడా దక్కించుకున్నాడు. లారియస్ అవార్డు రావడం మెస్సీకిది రెండోసారి. 2020లోనూ మెస్సీకి ఈ పురస్కారం దక్కింది. మరోవైపు షెల్లీ ఆన్ ఫ్రేజర్ 100 మీటర్ల విభాగంలో ఐదోసారి ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాన్ని సాధించింది. ఓవరాల్‌గా షెల్లీ మూడు ఒలింపిక్స్ పసిడి పతకాలను, పది ప్రపంచ చాంపియన్‌షిప్ బంగారు పతకాలను గెల్చుకుంది. స్పెయిన్ టెన్నిస్ యువతార కార్లోస్ అల్‌కరాజ్‌కు 'బ్రేక్‌త్రూ ఆఫ్ ద ఇయర్' అవార్డు లభించింది. గత ఏడాది అల్‌కరాజ్ యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో విజేతగా నిలువడంతోపాటు ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. 1999 నుంచి లారియస్ గ్లోబల్ స్పోర్ట్స్ అవార్డులను అందజేస్తున్నారు.

సౌదీ లీగ్‌లో మెస్సీ!

పోర్చుగల్ ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో బాటలోనే మెస్సీ నడవనున్నాడు. ప్రస్తుతం ఫ్రాన్స్‌లో పారిస్ సెయింట్ జెర్మయిన్ (పీఎస్‌జీ) క్లబ్‌కు ఆడుతున్న మెస్సీ ఈ సీజన్ తర్వాత పీఎస్‌జీని వీడి రొనాల్డో ఆడుతున్న సౌదీ అరేబియా లీగ్‌లో అడుగు పెట్టనున్నాడు. ఇప్పటికే సౌదీ అరేబియా లీగ్‌లోని ఒక క్లబ్ మెస్సీతో కళ్లు చెదిరే మొత్తానికి ఒప్పందం చేసుకుందని సమాచారం.

పతకానికి విజయం దూరంలో...

క్వార్టర్ ఫైనల్లో నిశాంత్ దేవ్, దీపక్ • సచిన్, ఆకాశ్‌లకు నిరాశ


నిశాంత్


దీపక్

తాష్కెంట్: ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఇద్దరు భారత బాక్సర్లు నిశాంత్ దేవ్ (71 కేజీలు), దీపక్ భోరియా (51 కేజీలు) పతకం ఖరారు చేసుకోవడానికి మరో విజయం దూరంలో ఉన్నారు. మంగళవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ బౌట్లలో దీపక్ 5–0తో జాంగ్ జియామావో (చైనా)పై గెలుపొందగా... నిశాంత్ దేవ్ పంచ్‌ల ధాటికి అతని ప్రత్యర్థి ఫొకాహా నిదాల్ (పాలస్తీనా) చేతులెత్తేశాడు. నిశాంత్ పంచ్ పవర్‌కు తొలి రౌండ్‌లోనే ఫొకాహా రింగ్‌లో రెండుసార్లు కూలబడ్డాడు. దాంతో రిఫరీ బౌట్‌ను నిలిపివేసి నిశాంత్‌ను విజేతగా ప్రకటించాడు. మరోవైపు భారత్‌కే చెందిన సచిన్ సివాచ్ (54 కేజీలు), ఆకాశ్ సాంగ్వాన్ (67 కేజీలు)ల పోరాటం ప్రిక్వార్టర్ ఫైనల్లో ముగిసింది. సచిన్ 0–5తో సాబిర్ ఖాన్ (కజకిస్తాన్) చేతిలో, ఆకాశ్ 0–5తో దులాత్ (కజకిస్తాన్) చేతిలో ఓడిపోయారు.

సినిమా

రావణుడి గర్వాన్ని విరిచేయాలి


● ఓమ్ రౌత్, కృతీ సనన్, ప్రభాస్

''ఇది నా రాముడి కథ.. ఆయన మనిషిగా పుట్టి భగవంతుడైన మహనీయుడు..' అంటూ హనుమంతుడు పాత్రధారి దేవ దత్తా చెప్పే డైలాగ్‌తో 'ఆదిపురుష్' ట్రైలర్ విడుదలైంది. రాముడిగా ప్రభాస్, సీతగా కృతీ సనన్ నటించిన చిత్రం 'ఆదిపురుష్'. ఓమ్ రౌత్ దర్శకత్వంలో గుల్షన్ కుమార్ అండ్ టి. సిరీస్ సమర్పణలో భూషణ్ కుమార్, క్రిష్ణకుమార్, ఓమ్ రౌత్, ప్రసాద్ సుతారియా, రాజేష్ నాయర్, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ పాన్ ఇండియా మూవీ జూన్ 16న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ''నా ప్రాణమే జానకిలో ఉంది.. కానీ నా ప్రాణాలకన్నా మర్యాదే అధిక ప్రియమైనది', 'మనం జన్మతో కాదు చేసే కర్మతో చిన్నాపెద్ద అవుతాం', 'నాకోసం పోరాడొద్దు.. వేల సంవత్సరాల తర్వాత తల్లులు మీ వీర గాథలు చెప్తూ పిల్లల్ని పెంచాలి.. ఆ రోజు కోసం పోరాడండి.. పోరాడతారా? అయితే దూకండి ముందుకు.. అహంకారం రొమ్ము చీల్చి ఎగురుతున్న విజయ ధ్వజాన్ని పాతండి' అంటూ ప్రభాస్, 'రాఘవ నన్ను పొందడానికి శివధనస్సును విరిచారు.. ఇప్పుడు రావణుడి గర్వాన్ని విరిచేయాలి' అని కృతీ సనన్ చెప్పే సంభాషణలు ట్రైలర్‌లో ఉన్నాయి.

ఐకానిక్ షాట్స్ టచ్ చేయకూడదు

- దర్శకుడు వీవీ వినాయక్


● వినాయక్, బెల్లంకొండ సురేష్

''నేటి యువతలో చాలామంది తెలుగు 'ఛత్రపతి' (2005) సినిమాను చూసి ఉండరు. వారికి హిందీ రీమేక్ 'ఛత్రపతి' (2023) ఫ్రెష్‌గా ఉంటుంది. ఇక అప్పట్లో 'ఛత్రపతి'ని చూసినవారు తెలుగు 'ఛత్రపతి' సినిమాను పాడు చేయకుండా బాగా తీశారని అనుకుంటారు. లొకేషన్స్, సాంగ్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు కొత్తగా ఉంటాయి. ఓ ప్రాపర్ హిందీ సినిమా చూసిన ఫీలింగ్ కలుగుతుంది'' అన్నారు దర్శకుడు వీవీ వినాయక్. ప్రభాస్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో 2005లో వచ్చిన 'ఛత్రపతి' సినిమాను అదే టైటిల్‌తో హిందీలో రీమేక్ చేశారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా వీవీ వినాయక్ దర్శకత్వంలో జయంతి లాల్ గడ నిర్మించిన ఈ సినిమా మే 12న హిందీలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో దర్శకుడు వీవీ వినాయక్ మాట్లాడుతూ – ''తెలుగులో సాయి హీరోగా నటించిన సినిమాలు హిందీలో అనువాదమై, మంచి రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. 'ఛత్రపతి' హిందీ రీమేక్ కోసం తను ఫిజిక్ బాగా మెయిన్‌టైన్ చేశాడు. హిందీ నేర్చుకున్నాడు. ఇంట్రవెల్, కొన్ని యాక్షన్ సీక్వెన్సెస్‌లో సాయి నటన చూసి నేనే ఆశ్చర్యపోయాను. ఈ చిత్రంతో సాయి బాలీవుడ్‌లో హీరోగా నిలబడిపోతాడనే నమ్మకం ఉంది. రీమేక్ అంటే కొన్ని ఐకానిక్ షాట్స్‌ను టచ్ చేయకపోవడమే మంచిది. మేమూ అదే చేశాం. ఇక యాక్టింగ్ పరంగా ప్రభాస్‌కు, సాయికి పోలికలు వద్దు. అయితే 'ఛత్రపతి' సినిమాలో హీరో క్యారెక్టర్‌కు సాయి న్యాయం చేశాడని మాత్రం చెప్పగలను. హిందీ 'ఛత్రపతి' విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. ఈ సినిమాను కేవలం హిందీ భాషలోనే రిలీజ్ చేస్తున్నాం'' అని అన్నారు. ''మాస్ పల్స్ తెలిసిన దర్శకుల్లో వీవీ వినాయక్ గారు ఒకరు. తెలుగులో 'అల్లుడు శీను'తో మా అబ్బాయి (బెల్లంకొండ సాయి)ని ఇంట్రడ్యూస్ చేసిన వినాయక్‌గారు హిందీలోనూ పరిచయం చేస్తుండటం సంతోషంగా ఉంది. ఈ సినిమాను తెలుగులో కూడా డబ్ చేయవచ్చు. కానీ హిందీలో తీసిన సినిమాను హిందీ భాషలోనే ఆడియన్స్‌కు చూపిద్దామన్నారు వినాయక్‌గారు. రూ. 60 కోట్ల బడ్జెట్‌తో పెన్ స్టూడియోస్ లాంటి నిర్మాణసంస్థ మా అబ్బాయితో సినిమా నిర్మించడం నాకు గర్వంగా ఉంది'' అన్నారు నిర్మాత బెల్లంకొండ సురేష్.

చైతూ నా దగ్గర ఆ ప్రామిస్ తీసుకున్నాడు

- వెంకట్ ప్రభు



''మలయాళం మూవీ 'నాయట్టు' స్ఫూర్తితో 'కస్టడీ' స్టోరీలైన్ రాసుకున్నాను. అయితే 'నాయట్టు'లో కమర్షియల్ అంశాలు ఉండవు. 'కస్టడీ'లో తెలుగు, తమిళ ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లు కమర్షియల్ అంశాలు ఉంటాయి'' అన్నారు వెంకట్ ప్రభు. నాగచైతన్య, కృతీ శెట్టి జంటగా వెంకట్ ప్రభు డైరెక్షన్‌లో రూపొందిన ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం 'కస్టడీ'. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వెంకట్ ప్రభు చెప్పిన విశేషాలు.

– ఓ సాధారణ కుటుంబంలో పుట్టి, భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న పోలీస్ కానిస్టేబుల్ శివ పాత్రలో నాగచైతన్య కనిపిస్తారు. శివకు ఉన్న ప్రాబ్లమ్స్‌తో ఈ సినిమా కథ మొదలవుతుంది. అతని కుటుంబం, ప్రేయసి వంటి అంశాలతో మొదటి ఇరవై నిమిషాలు గడుస్తాయి. కానీ తనది కాని సమస్యలో శివ ఇరుక్కుంటాడు. కాలానికి వ్యతిరేకంగా పరిగెత్తాల్సి వస్తుంది. ప్రీ ఇంట్రవెల్ నుంచి క్లయిమాక్స్ వరకూ ఆడియన్స్ ఈ సినిమాను ఆసక్తికరంగా చూస్తారు. సీట్ ఎడ్జ్ థ్రిల్లర్. రీసెంట్‌గా 'కస్టడీ' స్టోరీ లైన్ చెప్పేశాను. ఆ తర్వాత సినిమా గురించి ఎక్కువ రివీల్ చేయవద్దని, సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్‌ను థియేటర్స్‌లో ఆడియన్స్ చూసి ఎగ్జయిట్ అయితే బాగుంటుందని చైతూ నా దగ్గర ప్రామిస్ తీసుకున్నాడు. సో.. ఇంతకంటే ఏమీ చెప్పలేను.

– యాక్టింగ్ పరంగా ఈ చిత్రంలో కొత్త చైతూను చూస్తారు. రేవతిగా కృతీ శెట్టి, రాజుగా అరవింద్ స్వామి, శరత్‌కుమార్‌ల పాత్రలు ఆసక్తికరంగా ఉంటాయి. 'కస్టడీ' యూనివర్సల్ సబ్జెక్ట్. సబ్ టైటిల్స్‌తో ఇతర భాషలవారు ఈ సినిమాను చూస్తే వారికీ నచ్చుతుంది. ఇక 'మానాడు' సినిమాను తెలుగులో శ్రీనివాసా చిట్టూరిగారు నిర్మించాల్సింది కానీ కుదర్లేదు. అయితే ఆయనతో ఓ ప్రాజెక్ట్ చేయాలన్న ఆశ 'కస్టడీ'తో తీరింది. 'కస్టడీ' సినిమాకు ఇళయరాజాగారు, యువన్‌ల సంగీతం చాలా పెద్ద ఎస్సెట్.


● వీడీ 12 పోస్టర్

డబుల్ ధమాకా


● విజయ్ దేవరకొండ, సమంత

హీరో విజయ్ దేవరకొండ పుట్టినరోజు (మే 9) కానుకగా అభిమానులకు డబుల్ ధమాకా ఇచ్చారు మేకర్స్. ఆయన నటిస్తున్న 'వీడీ 12 '(వర్కింగ్ టైటిల్) సినిమా నుంచి విజయ్ కొత్త పోస్టర్, 'ఖుషి' మూవీ నుంచి ఓ పాటని విడుదల చేశారు. విజయ్ దేవరకొండ, శ్రీలీల జంటగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. విజయ్ దేవరకొండ కెరీర్‌లో 12వ సినిమాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ నెల 3న ప్రారంభమైన ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ జూన్‌లో ప్రారంభం కానుంది. కాగా విజయ్‌కి బర్త్‌డే శుభాకాంక్షలు చెబుతూ ఈ చిత్రం మేకర్స్ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్, కెమెరా: గిరీష్ గంగాధరన్.

నా రోజా నువ్వే... విజయ్ దేవరకొండ, సమంత జంటగా శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఖుషి'. నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్న ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో సెప్టెంబర్ 1న రిలీజ్ కానుంది. ఈ సినిమా షూటింగ్ కొచ్చిలో జరుగుతోంది. కాగా విజయ్ బర్త్ డే స్పెషల్‌గా 'ఖుషి' మూవీ నుంచి 'నా రోజా నువ్వే.. నా దిల్ సే నువ్వే, నా అంజలి నువ్వే గీతాంజలి నువ్వే...' అంటూ సాగే మెలోడి సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకి హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతం అందించటంతో పాటు పాడారు. దర్శకుడు శివ నిర్వాణ ఈ పాటకి సాహిత్యం అందించడంతో పాటు నృత్యరీతులు సమకూర్చారు.

అఖిల్ ధీర?


● అఖిల్

అఖిల్ కొత్త సినిమాకు 'ధీర' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు ఫిల్మ్‌నగర్‌లో ప్రచారం జరుగుతోంది. 'సాహో' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేసిన అనిల్ కుమార్ ఇటీవల అఖిల్‌కు ఓ కథ వినిపించారట. ఫ్యాంటసీ బ్యాక్‌డ్రాప్‌లోని ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ నిర్మించనుందని టాక్. కాగా ఈ సినిమాకు 'ధీర' అనే టైటిల్‌ను పరిశీలిస్తోందట చిత్ర యూనిట్. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం.

విద్య.. వైద్యాన్ని జాతీయం చేయాలి

- ఆర్. నారాయణ మూర్తి



''పేపర్ లీకేజ్ వ్యవహారాలు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. గుజరాత్, మధ్య ప్రదేశ్, రాజస్థాన్‌లో కూడా జరిగాయి. ఇలాగైతే నిరుద్యోగులు ఏమైపోవాలి? అందుకే విద్య, వైద్యాన్ని జాతీయం చేయాలని చెప్పే చిత్రమే 'యూనివర్సిటీ'' అన్నారు ఆర్. నారాయణ మూర్తి. స్నేహచిత్ర పిక్చర్స్‌పై ఆర్. నారాయణ మూర్తి నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యూనివర్సిటీ'. ఈ నెల 26న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాను ప్రత్యేకంగా ప్రదర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆర్. నారాయణ మూర్తి మాట్లాడుతూ– ''భారత దేశంలో చాలా చోట్ల పేపర్ లీకేజీలు జరుగుతున్నాయి.. దీన్ని జాతీయ సమస్యగా పరిగణించాలని రాష్ట్రపతి, ప్రధానిగార్లకు విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ చిత్రంలోని ఐదు పాటలు ఆలోచింపజేసేలా ఉంటాయి'' అన్నారు. 'యూనివర్సిటీ' ప్రదర్శనకు హాజరైన పలువురు జర్నలిస్టులు ఇది అందరూ చూడాల్సిన సినిమా అన్నారు. ఈ చిత్రాన్ని వీక్షించిన ప్రముఖుల్లో తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి, ప్రొఫెసర్స్ లక్ష్మీ నారాయణ, కోయి కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

జీవితంలో అందరం నటులమే

- వాసుకి



''సిల్వర్ స్క్రీన్‌పై ఆర్టిస్టులు నటిస్తారు. కానీ మనుషులుగా మనందరం నిత్యం విభిన్నమైన సందర్భాలు, పరిస్థితుల్లో నటిస్తుంటాం. సో.. మనందరం నటులమే. ఇరవయ్యేళ్ల తర్వాత కెమెరా ముందుకు వచ్చినా నేను భయపడలేదు. సెట్స్‌లో ఎక్కువగా టేక్స్ తీసుకోకుండానే యాక్ట్ చేశాను. అయినా నా భర్త ఆనంద సాయి (ఆర్ట్ డైరెక్టర్)తో నిత్యం సినిమాలు గురించి మాట్లాడుతూ ఇండస్ట్రీకి దగ్గరగానే ఉన్నాను'' అన్నారు వాసుకి. సంతోష్ శోభన్, మాళవికా నాయర్ జంటగా నందినీ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. ప్రియాంకా దత్ నిర్మించిన ఈ చిత్రం మే 18న విడుదల కానుంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన వాసుకి మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ– ''తొలిప్రేమ' సినిమా తర్వాత నాకు అవకాశాలు వచ్చినా కాదనుకున్నాను. ఎందుకంటే నాకు కుటుంబ బాధ్యతలే ప్రాధాన్యంగా అనిపించాయి. ప్రస్తుతం ఫారిన్‌లో మా అమ్మాయి మెడిసిన్ ఫోర్త్ ఇయర్, అబ్బాయి ఆర్కిటెక్చర్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు. దాంతో నాకు ఖాళీ దొరికింది. నేను సైకాలజీలో పీహెచ్‌డీ చేస్తున్నాను. ఇటు నటిగా నాకు నచ్చే, నప్పే పాత్రలు చేస్తాను. 'అన్నీ మంచి..'లో సంతోష్ శోభన్‌కు అక్కగా నటించాను. తమ్ముడ్ని సపోర్ట్ చేసే అక్క పాత్ర ఇది. కథ బాగుంటే తల్లిగా చేయడానికి కూడా రెడీ'' అన్నారు.

జూన్‌లో అహింస


● అభిరామ్

నిర్మాత సురేష్ బాబు తనయుడు, హీరో రానా సోదరుడు అభిరామ్ హీరోగా ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'అహింస'. తేజ దర్శకత్వంలో పి. కిరణ్ నిర్మించిన ఈ సినిమా జూన్ 2న రిలీజ్ కానుంది. ''లవ్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'అహింస'. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై క్యూరియాసిటీని పెంచింది. సినిమా కూడా అందర్నీ అలరించేలా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఆర్పీ పట్నాయక్, కెమెరా: సమీర్ రెడ్డి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▲
3	2
61,761	18,266

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,196	▽	61
డోజోన్స్	33,575	▽	44
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,764	▽	14
డాక్స్	15,955	▲	3
షాంఘై	3,358	▽	37
నికాయ్	29,243	▲	293

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	61,553 ▲ 364
బంగారం (22 క్యారట్)	61,287 ▲ 362
వెండి (కిలో)	76,399 ▲ 84

పాలసీలపై రుణాన్ని క్రెడిట్ కార్డ్‌తో చెల్లించలేరు

- ఐఆర్‌డీఏఐ నిషేధం సానుకూల నిర్ణయం
- బీమా సంస్థల అభిప్రాయం



న్యూఢిల్లీ: జీవిత బీమా పాలసీలపై తీసుకున్న రుణాలను క్రెడిట్ కార్డులతో తిరిగి చెల్లించడాన్ని బీమా రంగ అభివృద్ధి, నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏఐ) విధించిన నిషేధాన్ని బీమా కంపెనీలు స్వాగతించాయి. ఈ నిర్ణయం పాలసీదారులకు మేలు చేస్తుందని, రుణ ఊబిలో పడిపోకుండా కాపాడుతుందని పేర్కొన్నాయి. భారీ వడ్డీ రేటుతో కూడిన క్రెడిట్ కార్డు రుణంతో పాలసీపై రుణాన్ని తిరిగి చెల్లించడం ప్రయోజనం కలిగించదని తెలిపాయి. క్రెడిట్ కార్డు బ్యాలన్స్ బకాయి పడితే భారీ వడ్డీ (రూ.3-4 రూపాయల వడ్డీ) వసూలు చేసే విషయాన్ని ప్రస్తావించాయి. ఇంతకుముందు వరకు బీమా పాలసీలపై తీసుకున్న రుణాన్ని క్రెడిట్ కార్డు నుంచి చెల్లించేందుకు బీమా సంస్థలు అనుమతించాయి. దీన్ని నిలిపివేయాలని ఐఆర్‌డీఏఐ ఇటీవలే ఆదేశించింది. ఆర్థిక క్రమశిక్షణకు ఎంతో ప్రాధాన్యం ఉందని, క్రెడిట్ కార్డు ద్వారా రుణాలు చెల్లించే విధానం సరికాదని నిపుణులు సైతం అభిప్రాయపడుతున్నారు. క్రెడిట్ కార్డుపై బకాయిని గడువులోపు చెల్లించకపోతే మిగిలిన బ్యాలన్స్‌పై అధిక వడ్డీ రేటు చెల్లించాల్సి రావడాన్ని నిపుణులు ప్రస్తావిస్తున్నారు. ''వ్యక్తిగత రుణాలతో పోలిస్తే పాలసీపై తీసుకునే రుణం వడ్డీ రేటు చాలా తక్కువ. కనుక ఈ రుణాలను క్రెడిట్ కార్డులతో చెల్లించడం తెలివైనది కాదు''అని కోటక్ మహీంద్రా లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ రిస్క్ ఆఫీసర్ సునీల్ శర్మ పేర్కొన్నారు. పాలసీపై రుణం కొనసాగించడంతో పోలిస్తే, దానికంటే అధిక వడ్డీ రేటుతో కూడిన క్రెడిట్ కార్డు నుంచి చెల్లించడం వల్ల పాలసీదారులు రుణ ఊబిలో కూరుకుపోతారన్న ఆందోళనతో ఐఆర్‌డీఏఐ ఈ నిర్ణయం తీసుకుని ఉండొచ్చని సెక్యూర్‌నౌ సహ వ్యవస్థాపకుడు కపిల్ మెహతా పేర్కొన్నారు. జీవిత బీమా పాలసీలపై ఇచ్చే రుణాలకు చాలా సంస్థలు 8-15 శాతం మధ్య రేటు వసూలు చేస్తుంటే, క్రెడిట్ కార్డు బ్యాలన్స్‌పై 36-44 శాతం మధ్య రేటు ఉండడం గమనార్హం.

మ్యాన్‌కైండ్ బంపర్ లిస్టింగ్

తొలి రోజు 32 శాతం హైజంప్



న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ కంపెనీ మ్యాన్‌కైండ్ ఫార్మా బంపర్ లిస్టింగ్ సాధించింది. ఇష్యూ ధర రూ. 1,080తో పోలిస్తే 20% పైగా ఎగసి రూ. 1,300 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. తదుపరి 32% పైగా జంప్‌చేసి రూ.1,430 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి దాదాపు 32% లాభంతో రూ.1,424 వద్ద ముగిసింది. వెరసి కంపెనీ మార్కెట్ విలువ రూ.57,046 కోట్లుగా నమోదైంది. రూ.4,326 కోట్ల సమీకరణతో 2023లో భారీ ఐపీవోగా నమోదైన మ్యాన్‌కైండ్ ఫార్మా బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టయ్యింది. ఎన్ఎస్ఈలో 3.31 కోట్లు, బీఎస్ఈలో 12 లక్షల చొప్పున షేర్లు ట్రేడయ్యాయి. కంపెనీ ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్స్ రూపొందిస్తోంది.

మార్కెట్లు అక్కడక్కడే

- లాభాలతో షురూ- ఆపై డీలా
- 3 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్
- 2 పాయింట్లు బలపడిన నిఫ్టీ
- పీఎస్‌యూ బ్యాంక్ షేర్లు వీక్



ముంబై: వరుసగా రెండో రోజు మార్కెట్లు హుషారుగా ప్రారంభమయ్యాయి. అయితే మిడ్ సెషన్ నుంచీ అమ్మకాలు ఊపందుకోవడంతో చివరకు అక్కడక్కడే అన్నట్లుగా ముగిశాయి. సెన్సెక్స్ 3 పాయింట్ల స్వల్ప నష్టంతో 61,761 వద్ద నిలవగా.. నిఫ్టీ 2 పాయింట్ల నామమాత్ర లాభంతో 18,266 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 264 పాయింట్లు ఎగసి 62,000ను అధిగమించింది. 62,028 సమీపానికి చేరింది. చివర్లో లాభాలను వీడటంతోపాటు 109 పాయింట్లు క్షీణించి 61,655ను తాకింది. ఈ బాటలో నిఫ్టీ సైతం 18,344- 18,230 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. ముందురోజు సెన్సెక్స్ 710, నిఫ్టీ 195 పాయింట్లు జంప్‌చేసిన నేపథ్యంలో రెండో సెషన్ నుంచీ ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగినట్లు స్టాక్ నిపుణులు పేర్కొన్నారు.

రియల్టీ నేలచూపు: ఎన్ఎస్ఈలో ప్రధానంగా ఐటీ, ఆటో, ఫార్మా 0.5 శాతంస్థాయిలో పుంజుకోగా.. పీఎస్‌యూ బ్యాంక్స్ 2.75 శాతం పతనమయ్యాయి. రియల్టీ 1 శాతం నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో దివీస్, ఇండస్‌ఇండ్, కోల్ ఇండియా, టీసీఎస్, యాక్సిస్, ఎంఅండ్ఎం, టాటా మోటార్స్, విప్రో, ఇన్ఫీ 3-1 శాతం మధ్య లాభపడ్డాయి. మరోపక్క యూపీఎల్, ఐటీసీ, ఎస్‌బీఐ, బజాజ్ ఫైనాన్స్, జేఎస్‌డబ్ల్యూ, గ్రాసిమ్ 3-1 శాతం మధ్య డీలాపడ్డాయి.

రూపాయి నేలచూపు...

డాలరుతో మారకంలో దేశీ కరెన్సీ డీలా పడింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో 28 పైసలు క్షీణించి 82.06 వద్ద ముగిసింది. ప్రపంచ ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు బలపడటం రూపాయిని దెబ్బతీసింది. ఈక్విటీ మార్కెట్లు నీరసించడం దీనికి జత కలిసింది.

జేపీ అసోసియేట్స్ రూ. 4 వేల కోట్లు డిఫాల్ట్



న్యూఢిల్లీ: సంక్షోభంలో చిక్కుకున్న జేపీ గ్రూప్ సంస్థ జైప్రకాశ్ అసోసియేట్స్ (జేఏఎల్) తాజాగా రూ. 3,956 కోట్ల రుణాల చెల్లింపులో డిఫాల్ట్ అయ్యింది. ఇందులో అసలు రూ. 1,642 కోట్లు ఉండగా, వడ్డీ రూ. 2,314 కోట్లు ఉంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి వివిధ రూపాల్లో తీసుకున్న ఈ మొత్తాన్ని ఏప్రిల్ 30న చెల్లించాల్సి ఉన్నప్పటికీ విఫలమైనట్లు ఎక్స్ఛేంజీలకు తెలిపింది. తాము 2037 నాటికి రూ.29,277 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇందులో రూ. 3,956 కోట్లు మాత్రమే ఈ ఏడాది ఏప్రిల్ 30 కల్లా కట్టాల్సి ఉందని జేఏఎల్ వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-5-2023	
విశాఖ	485-00
చిత్తూరు	498-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485-00
విజయవాడ	485-00
రిటైల్ ధర (డజను)	72.00
9-5-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	455-00
వరంగల్	457-00
రిటైల్ ధర	5.15

భారత్ వృద్ధి భేష్!

- స్టేబుల్ అవుట్‌లుక్‌తో 'బీబీబీ మైనస్' రేటింగ్ యథాతథం
- ప్రభుత్వాల ఆదాయ, వ్యయ తీరు మాత్రం బలహీనం
- ఫిచ్ తాజా విశ్లేషణ



న్యూఢిల్లీ: భారత్ సావరిన్ రేటింగ్ విషయంలో యథాతథ వైఖరిని అవలంభిస్తున్నట్లు అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజం- ఫిచ్ తన తాజా ప్రకటనలో పేర్కొంది. చక్కటి వృద్ధి తీరు, అంతర్జాతీయ అనిశ్చితి పరిస్థితులను తట్టుకొని నిలబడ్డం వంటి అంశాల నేపథ్యంలో రేటింగ్‌ను స్టేబుల్ అవుట్‌లుక్‌తో 'బీబీబీ మైనస్'గా కొనసాగిస్తున్నట్లు తెలిపింది. అయితే ప్రభుత్వ ఆదాయాలు-వ్యయాల విషయంలో పరిస్థితి బలహీనంగా ఉందని కూడా హెచ్చరించింది. 'బీబీబీ మైనస్' అతి తక్కువ ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్. చెత్త రేటింగ్‌కు ఒక అంచె అధికం. 2006 ఆగస్టు నుంచి ఇదే రేటింగ్‌ను ఫిచ్ కొనసాగిస్తోంది. మరో రెండు అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజాలు- మూడీస్, స్టాండర్డ్ అండ్ పూర్స్ (ఎస్అండ్‌పీ) కూడా భారత్‌కు ఇదే తరహా రేటింగ్‌ను ఇస్తున్నాయి. అంతర్జాతీయంగా దేశంలోకి పెట్టుబడులు రావడానికి ఆయా సంస్థలు ఇచ్చే రేటింగ్స్ కీలకం. ఫిచ్ విశ్లేషణలో కొన్ని ముఖ్యాంశాలు...


- లాంగ్-టర్మ్ ఫారిన్ కరెన్సీ ఇష్యూయర్ డిఫాల్ట్ రేటింగ్ (ఐడీఆర్) స్టేబుల్ అవుట్‌లుక్‌తో 'బీబీబీ మైనస్'గా కొనసాగుతుంది. పటిష్ట వృద్ధి ధోరణి సావరిన్ రేటింగ్‌కు మద్దతిస్తున్న ప్రధాన అంశం.
- చెక్కుచెదరని పెట్టుబడుల అవకాశాల నేపథ్యంలో భారత్ వృద్ధి 2023 ఏప్రిల్-2024 మార్చి (ప్రస్తుత ఆర్థిక సంవత్సరం) మధ్య 6 శాతంగా ఉంటుందని భావిస్తున్నాం. 2022-23లో 7 శాతం వృద్ధి రేటు అంచనాకాగా, 2024-25లో ఎకానమీ స్పీడ్‌ను 6.7 శాతంగా అంచనావేస్తున్నాం.
- తోటి ఎకానమీలతో పోల్చితే భారత్ వృద్ధి అవుట్‌లుక్ బాగుంది. దీనితోపాటు అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులను తట్టుకునే సామర్థ్యం వల్ల గత ఏడాది కాలంగా పురోగమన బాటలో పయనిస్తోంది.
- ప్రభుత్వం మౌలిక రంగంపై పెడుతున్న ప్రత్యేక దృష్టి నేపథ్యంలో గత కొన్నేళ్లుగా కార్పొరేట్, బ్యాంక్ బ్యాలెన్స్ షీట్‌లో సానుకూల ధోరణి కనిపిస్తోంది. దీనితో ప్రైవేట్ రంగం బలమైన పెట్టుబడితో వృద్ధి బాటపై ఉన్నట్లు కనిపిస్తోంది.
- సేవా రంగ ఎగుమతులకు భారత్ మంచి అవకాశాలు పొందవచ్చు.
- గత ఆర్థిక సంవత్సరం ద్రవ్యోల్బణం సగటును 6.7 శాతం ఉంటే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 5.8 శాతంగా నమోదుకావచ్చు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ)కి కేంద్రం నిర్దేశిస్తున్న 6% అప్పర్ బాండ్ కన్నా ఇది 20 బేసిస్ పాయింట్లు తక్కువ.

బలహీనతలు ఇవీ...

దేశం కొన్ని బలహీనతలనూ ఎదుర్కొంటోంది. ఆదాయాలు-వ్యయాలు, అధిక లోటు, దీనిని తగ్గించడానికి ప్రభుత్వ వ్యయాల కోత, రుణ భారం, ప్రపంచబ్యాంక్ గవర్నెన్స్ సూచీలుసహా, జీడీపీ తలసరి ఆదాయంసహా కొన్ని వ్యవస్థాగత సూచీలు ఇక్కడ ప్రస్తావనాంశాలు. ద్రవ్యోల్బణం సవాళ్లు, పెరుగుతున్న వడ్డీరేట్లు, అంతర్జాతీయంగా డిమాండ్ పరిస్థితుల మందగమనం, మహమ్మారికి సంబంధించి సమసిపోని సవాళ్లు- అనుమానాలు వంటివీ ఎకానమీ పురోగతికి సవాళ్లుగా ఉన్నాయి. కార్మిక శక్తి భాగస్వామ్యం ఎకానమీలో ఇంకా బలహీనంగానే ఉంది. సంస్కరణల అమలు బాట ఒడిదుడుకులుగానే ఉంది. భారత్ మార్కెట్ అంతర్జాతీయ సంస్థలను ఆకర్షిస్తున్నప్పటికీ, ఈ ప్రయోజనాలను అందిపుచ్చుకోవడానికి సంబంధించి తగిన సంస్కరణలతో భారత్ సంసిద్ధంగా ఉందా? లేదా అన్న అంశంపై అనిశ్చితి నెలకొంది. భారత్ ప్రభుత్వ రుణ భారం 2022-23లో 82.8%గా (జీడీపీలో) ఉంటుందని భావిస్తున్నాం.

రుణ చెల్లింపుపై అదానీ గ్రూప్ దృష్టి

రూ. 1,066 కోట్ల ముందస్తుకు రెడీ



న్యూఢిల్లీ: ఇటీవల రుణ భారాన్ని తగ్గించుకోవడంపై దృష్టి పెట్టిన అదానీ గ్రూప్ తాజాగా 13 కోట్ల డాలర్ల(సుమారు రూ. 1,066 కోట్లు) రుణాలను ముందస్తుగా చెల్లించే ప్రణాళికల్లో ఉంది. తద్వారా ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని బిలియనీర్.. గౌతమ్ అదానీ గ్రూప్ భావిస్తోంది. యూఎస్ షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ ఆరోపణల నేపథ్యంలో కంపెనీ కొద్ది రోజులుగా రుణాలను ముందుగానే చెల్లిస్తోంది. దీనిలో భాగంగా గత నెలలో 2024 జులైలో గడువు తీరనున్న 13 కోట్ల డాలర్ల విలువైన బాండ్లను బైబ్యాక్ చేసేందుకు అదానీ పోర్ట్స్ టెండర్‌కు తెరతీసింది. ఈ బాటలో మరో 4 రుణాలను తిరిగి చెల్లించే యోచనలో ఉన్నట్లు తెలిపింది. టెండర్‌కు 41.27 కోట్ల డాలర్ల విలువైన బాండ్లు దాఖలైనట్లు అదానీ పోర్ట్స్ తాజాగా వెల్లడించింది.

రేమండ్ లాభం క్షీణత

క్యూ4లో రూ. 197 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రేమండ్ లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం (2022-23) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 26 శాతం క్షీణించి రూ. 197 కోట్లకు పరిమితమైంది. రూ. 93 కోట్ల మేర అనుకోని నష్టాలు లాభాలను దెబ్బతీశాయి. అంతక్రితం ఏడాది (2021-22) ఇదే కాలంలో రూ. 265 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ. 3 చొప్పున డివిడెండు ప్రకటించింది. అయితే మొత్తం ఆదాయం 10 శాతం పుంజుకుని రూ. 2,150 కోట్లను అధిగమించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రెట్టింపై రూ. 537 కోట్లకు చేరింది. 2021-22లో రూ. 265 కోట్లు ఆర్జించింది. ఆదాయం సైతం రూ. 6,179 కోట్ల నుంచి రూ. 8,215 కోట్లకు ఎగసింది.

జాబ్ పాయింట్

ఇస్రోలో 65 సైంటిస్ట్/ఇంజనీర్ పోస్టులు

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డ్.. దేశవ్యాప్తంగా ఉన్న ఇస్రో కేంద్రాలు/యూనిట్‌లలో సైంటిస్ట్/ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులుకోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 65
- **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(సివిల్)-39, సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(ఎలక్ట్రికల్)-14, సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్)-09, సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(ఆర్కిటెక్చర్)-01, సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(సివిల్)-అటానమస్ బాడీ-పీఆర్‌ఎల్-01, సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(ఆర్కిటెక్చర్)-అటానమస్ బాడీ-పీఆర్‌ఎల్-01.
- **విభాగాలు:** సివిల్, ఎలక్ట్రికల్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్, ఆర్కిటెక్చర్.
- **అర్హత:** కనీసం 65% మార్కులతో సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, బీఆర్క్ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 24.05.2023 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
- **ప్రారంభ వేతనం:** నెలకు రూ.56,100 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 24.05.2023.
- **వెబ్‌సైట్:** www.isro.gov.in

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 157 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

బ్యాంక్ ఆఫ్ బరోడా సీ అండ్ ఐసీ విభాగంలో.. స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 157
- **పోస్టుల వివరాలు:** రిలేషన్‌షిప్ మేనేజర్-66, క్రెడిట్ అనలిస్ట్-74, ఫారెక్స్ ఆక్విజిషన్ మరియు రిలేషన్‌షిప్ మేనేజర్-17.
- **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.05.2023
- **వెబ్‌సైట్:** www.bankofbaroda.in

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో 76 ఫ్యాకల్టీ పోస్టులు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్.. ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 76
- **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు.
- **విభాగాలు:** సైన్సెస్, హ్యుమానిటీస్, ఎకనామిక్స్, సోషల్ సైన్సెస్, ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్ స్టడీస్.
- **అర్హత:** సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ, నెట్/స్లెట్/సెట్ ఉత్తీర్ణతతో పాటు బోధన/పరిశోధనానుభవం కలిగి ఉండాలి. **వయసు:** 65 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు ప్రొఫెసర్‌కు రూ.1,44,200 నుంచి రూ.2,18,200, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,31,400 నుంచి రూ.2,17,100, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.57,700 నుంచి రూ.1,82,400 ఉంటుంది.
- **ఎంపిక విధానం:** అభ్యర్థి అకడమిక్ రికార్డు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.05.2023
- **దరఖాస్తు హార్డ్‌కాపీ స్వీకరణకు చివరితేది:** 09.06.2023.
- **వెబ్‌సైట్:** www.uohyd.ac.in

బెల్, బెంగళూరులో 428 ఇంజనీర్ పోస్టులు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్).. ఒప్పంద ప్రాతిపదికన ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 428
- **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ ఇంజనీర్-327:ఎలక్ట్రానిక్స్-164, మెకానికల్-106, కంప్యూటర్ సైన్స్-47, ఎలక్ట్రికల్-07, కెమికల్-01, ఏరోస్పేస్ ఇంజనీరింగ్ ట్రెయినీ ఇంజనీర్-101: ఎలక్ట్రానిక్స్-100,ఏరోస్పేస్ ఇంజనీరింగ్-01.

అర్హత

- **ప్రాజెక్ట్ ఇంజనీర్:** సంబంధిత స్పెషలైజేషన్‌లో కనీసం 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులవ్వాలి. కనీసం 2 ఏళ్ల పని అనుభవం ఉండాలి. **వయసు:** 32 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.55,000 చెల్లిస్తారు.
- **ట్రెయినీ ఇంజనీర్:** సంబంధిత స్పెషలైజేషన్‌లో కనీసం 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.30,000 నుంచి రూ.40,000 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.05.2023
- **వెబ్‌సైట్:** www.bel-india.in

చిత్తూరు జిల్లాలో టైపిస్ట్ పోస్టులు

చిత్తూరు జిల్లా సెలక్షన్ కమిటీ(డీఎస్సీ) 2022-23 సంవత్సరానికి సంబంధించి చిత్తూరు జిల్లాలో రిజర్వ్ చేసిన టైపిస్ట్ పోస్టుల భర్తీకి అర్హులైన దివ్యాంగుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
- **అర్హత:** ఏదైనా డిగ్రీతో పాటు తెలుగులో టైప్‌రైటింగ్ హయ్యర్ గ్రేడ్ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 52 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును వ్యక్తిగతంగా అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, అంబేద్కర్ భవన్, న్యూ కలెక్టరేట్, చిత్తూరులో అందజేయాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 15.05.2023.
- **వెబ్‌సైట్:** www.chittoor.ap.gov.in

అణుశక్తి విభాగంలో అవకాశాలు

ముంబయిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ, డైరెక్టరేట్ ఆఫ్ పర్చేజ్ అండ్ స్టోర్స్.. జూనియర్ పర్చేజ్ అసిస్టెంట్/జూనియర్ స్టోర్ కీపర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ముంబయితోపాటు దేశవ్యాప్తంగా ఉన్న డీపీఎస్ యూనిట్లలో ఉద్యోగులను నియమించనున్నారు.

- **మొత్తం పోస్టులు:** 65(రిజర్వేషన్ల వారీగా: ఎస్సీ-23, ఓబీసీలకు-08, ఈడబ్ల్యూఎస్-22, అన్ రిజర్వ్‌డ్ అభ్యర్థులకు 12 కేటాయించారు)
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో బీఎస్సీ/బీకాం/డిప్లొమా(మెకానికల్ ఇంజనీరింగ్ /ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణులై ఉండాలి. గడువుతేదీ నాటికి సంబంధిత విద్యార్హతలు లేనివాళ్లు దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులు.
- **వయసు:** అభ్యర్థులకు 18-27ఏళ్ల మధ్య వయసు ఉండాలి. గరిష్ట వయసులో ఎస్సీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీలకు 10-15ఏళ్లు, ఎక్స్-సర్వీస్‌మెన్‌లకు 3ఏళ్ల మినహాయింపు ఉంటుంది.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 15.05.2023
- **ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ పరీక్షలు:** జూన్ రెండో వారంలో
- **వెబ్‌సైట్:** https://dae.gov.in

అడ్వాన్స్‌డ్.. విజయం నిశ్చయంగా!!

» జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 2,50,255 మంది ఎంపిక
» జూన్ 4న దేశవ్యాప్తంగా పరీక్ష నిర్వహణ
» రివిజన్, ప్రాక్టీస్‌తోనే సక్సెస్ అంటున్న నిపుణులు

జేఈఈ-అడ్వాన్స్‌డ్.. ప్రతిష్టాత్మక ఐఐటీల్లో.. బీటెక్, ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంటెక్‌ల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! జేఈఈ-మెయిన్ స్కోర్ ఆధారంగా..అడ్వాన్స్‌డ్‌కు అభ్యర్థులను ఎంపికచేస్తారు! ఇటీవల జేఈఈ-మెయిన్-2023 ఫలితాల ద్వారా 2,50,255 మంది అడ్వాన్స్‌డ్‌కు అర్హత పొందారు. వీరంతా ఐఐటీల్లో అందుబాటులో ఉన్న దాదాపు 16వేల సీట్లకు పోటీపడతారు. ఇందుకోసం జూన్ 4న దేశవ్యాప్తంగా అడ్వాన్స్‌డ్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో.. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విజయానికి మెలకువలు..



జేఈఈ-అడ్వాన్స్‌డ్ - 2023

దేశవ్యాప్తంగా 23 ఐఐటీల్లో అందుబాటులో ఉన్న సీట్లు 16,598 మాత్రమే. అంటే..అడ్వాన్స్‌డ్‌కు హాజరయ్యే అభ్యర్థుల్లో ఐఐటీ అవకాశం లభించేది కేవలం ఆరున్నర శాతం మందికే!! అయితే జేఈఈ మెయిన్‌కు ఎంపికైన విద్యార్థులు పూర్తి అంకితభావంతో ప్రిపరేషన్ సాగిస్తే.. విజయావకాశాలు మెరుగవుతాయని నిపుణులు పేర్కొంటున్నారు.

పునశ్చరణకు ప్రాధాన్యం

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో విద్యార్థులు ముఖ్యమైన అంశాల పునశ్చరణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఇప్పటికే తాము రాసుకున్న నోట్స్ లేదా రెడీ రెకనర్స్‌ను అనుసరిస్తూ..అందులోని అంశాలను పదే పదే చదవాలి.

అలా రివిజన్ చేస్తున్నప్పుడే సంబంధిత ప్రాథమిక భావనలు, సూత్రాలతోపాటు అన్వయ దృక్పథంపై దృష్టిపెట్టాలి. వెయిటేజీ ఆధారంగా ఆయా అంశాల రివిజన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇందుకోసం గత ప్రశ్న పత్రాలను పరిశీలించాలి.

అవగాహన ముఖ్యం

అడ్వాన్స్‌డ్‌కు ప్రిపరేషన్‌లో భాగంగా విద్యార్థులు ప్రధానంగా ప్రశ్నల సరళి,మార్కింగ్ విధానాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. సింగిల్ కరెక్ట్ కొశ్చన్స్;మల్టిపుల్ ఛాయిస్ కొశ్చన్స్;పేరాగ్రాఫ్ ఆధారిత ప్రశ్నలను సాధన చేయాలి. వీటిలో రాణించాలంటే.. కాన్సెప్ట్ ఆధారిత ప్రశ్నలు, అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ప్రిపరేషన్ కొనసాగించాలి. ప్రస్తుత సమయంలో ప్రశ్నల సాధనకు సమయం కేటాయించాలి.

నమూనా పరీక్షలు

విద్యార్థులు కనీసం వారానికి ఒక గ్రాండ్ టెస్ట్ రాసే విధంగా సమయం కేటాయించుకోవాలి. ఆ పరీక్ష ఫలితం విశ్లేషించుకుని..తాము చేస్తున్న పొరపాట్లపై అవగాహన పెంచుకోవాలి. వాటిని పునరావృతం కాకుండా చూసుకోవాలి. ముఖ్యంగా గత నాలుగేళ్లకు సంబంధించిన ప్రశ్న పత్రాల్లో కనీసం రెండు ప్రశ్న పత్రాలను సాధన చేయాలి.

పరీక్ష ప్యాట్రన్

అడ్వాన్స్‌డ్‌కు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష ప్యాట్రన్‌పై పూర్తి అవగాహన ఉండాలి. గత ఏడాది మొత్తం రెండు పేపర్లుగా 360 మార్కులకు పరీక్ష జరిగింది. పేపర్-1లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 18 ప్రశ్నలు చొప్పున మొత్తం 54 ప్రశ్నలు అడిగారు. పేపర్-2లో కూడా ఇదే విధంగా 54 ప్రశ్నలు అడిగారు. ఇంటీజర్స్, న్యూమరికల్ టైప్ ప్రశ్నలకు 2, 4 మార్కులు చొప్పున కేటాయించారు.

సిలబస్ మార్పులకు అనుగుణంగా

ఇప్పటి వరకు జేఈఈ-మెయిన్స్ దృష్టితో ప్రిపరేషన్ సాగించిన విద్యార్థులు..ఇప్పుడు పూర్తిగా అడ్వాన్స్‌డ్‌కే సమయం కేటాయించాలి. ఈ ఏడాది అడ్వాన్స్‌డ్ సిలబస్‌లో మార్పులు చేసిన విషయాన్ని గుర్తించాలి. మారిన సిలబస్ అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ.. ప్రిపరేషన్, రివిజన్ కొనసాగించాలి.

ఒత్తిడికి దూరంగా

జేఈఈ అడ్వాన్స్‌డ్ విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండటం ఎంతో ముఖ్యం. అనవసరపు ఒత్తిడికి గురి కాకుండా.. ప్రశాంతంగా పక్కా ప్రణాళిక ప్రకారం ప్రిపరేషన్ సాగించాలి. ఆయా సిలబస్ టాపిక్స్‌ను విశ్లేషించుకుంటూ.. నిర్దిష్ట సమయ పాలన పాటిస్తూ ప్రాక్టీస్ చేయాలి.

సిలబస్ ముఖ్యాంశాలు

మ్యాథమెటిక్స్: కోఆర్డినేట్ జామెట్రీ, డిఫరెన్షియల్ కాలిక్యులస్, ఇంటిగ్రల్ కాలిక్యులస్, మ్యాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్; 3-డి జామెట్రీ; కో ఆర్డినేట్ జామెట్రీ; వెక్టార్ అల్జీబ్రా; ఇంటిగ్రేషన్; కాంప్లెక్స్ నెంబర్స్; పారాబోలా; క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్; థియరీ ఆఫ్ ఈక్వేషన్స్; పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్; బైనామియల్ థీరమ్; లోకస్ అంశాలపై పూర్తి పట్టు సాధించాలి

ఫిజిక్స్: ఎలక్ట్రో డైనమిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, మెకానిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఆప్టిక్స్, ఎస్‌హెచ్ఎం అండ్ వేవ్స్‌కు ప్రాధాన్యమివ్వాలి. అదే విధంగా సెంటర్ ఆఫ్ మాస్, మొమెంటమ్ అండ్ కొలిజన్; సింపుల్ హార్మోనిక్ మోషన్, వేవ్ మోషన్ అండ్ స్ట్రింగ్ వేవ్స్‌పై లోతైన అవగాహన పెంచుకుంటే.. మెరుగైన స్కోర్‌కు అవకాశం ఉంటుంది.

కెమిస్ట్రీ: కెమికల్ బాండింగ్, ఆల్కైల్ హలైడ్; ఆల్కహాల్ అండ్ ఈథర్, కార్బొనైల్ కాంపౌండ్స్, అటామిక్ స్ట్రక్చర్ అండ్ న్యూక్లియర్ కెమిస్ట్రీ, థర్మోడైనమిక్స్ అండ్ థర్మో కెమిస్ట్రీ అంశాలపై ఎక్కువ దృష్టి సారించాలి. వీటితోపాటు మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ,ఆల్కహాల్,ఫినాల్స్, ఈథర్స్, పి-బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై పట్టు సాధించాలి.

పరీక్ష హాల్లో ఇలా

- పరీక్ష హాల్లో ప్రశ్న పత్రం పూర్తిగా చదివేందుకు కనీసం 10 నుంచి 15 నిమిషాలు కేటాయించాలి.
- దాని ఆధారంగా తమకు సులభంగా ఉన్న ప్రశ్నలను గుర్తించాలి. ముందుగా వాటికి సమాధానాలు ఇవ్వాలి.
- వీలైతే పరీక్ష ముగియడానికి ముందు పది లేదా పదిహేను నిమిషాలు సమాధానాల రివ్యూకు కేటాయించాలి.
- సమాధానాలు ఇచ్చే సమయంలో ఏమైనా సందిగ్ధత ఉంటే మార్క్ ఫర్ రివ్యూ బటన్‌పై క్లిక్ చేసి.. చివరలో నిశ్చితాభిప్రాయానికి వచ్చి సదరు సమాధానాన్ని సేవ్ చేయాలి.
- పరీక్ష హాల్లో.. కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపించే కౌంట్‌డౌన్ టైమర్‌ను చూసుకుంటూ ఉండాలి.
- ఇలా ప్రతి విషయంలోనూ వ్యూహాత్మకంగా ముందుకు సాగితే.. మెరుగైన ఫలితం ఆశించొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

అడ్వాన్స్‌డ్.. ముఖ్యాంశాలు

- ప్రస్తుతం వీలైనంత ఎక్కువ సమయాన్ని రివిజన్‌కే కేటాయించాలి.
- ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమిస్తూ అప్లికేషన్ ఓరియెంటెడ్ కొశ్చన్స్ సాధన చేయాలి.
- ఇంటీజర్స్, ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- కనీసం నాలుగు మోడల్ టెస్ట్‌లకు హాజరు కావాలి.
- అన్ని సబ్జెక్ట్‌లలో కాన్సెప్ట్స్, ఫార్ములాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి.
- పరీక్షకు రెండు రోజుల ముందు నుంచి ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉండాలి.

జేఈఈ-అడ్వాన్స్‌డ్-2023 ముఖ్య తేదీలు

- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం:** మే 29-జూన్ 4, 2023
- **జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష తేదీ:** జూన్ 4(ఉదయం 9 నుంచి 12 వరకు; మధ్యాహ్నం 2:30 నుంచి 5 :30 వరకు).
- **వివరాలకు వెబ్‌సైట్:** https://jeeadv.ac.in



4,293 వాహనాలకు ఒకే ట్రాఫిక్ పోలీస్!



- సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలోని ట్రాఫిక్ విభాగాలను మానవ వనరుల కొరత వేధిస్తోంది. చాలీచాలని సిబ్బందితో వాహనాల నియంత్రణకు అధికారులు తంటాలు పడుతున్నారు. కొన్నేళ్ల క్రితం నుంచి పోలీసు పోస్టులకు బదులు హోంగార్డులను వినియోగించుకోవడం మొదలెట్టారు. కానీ వాటిలోనూ వందల సంఖ్యలో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. ట్రాఫిక్ సిబ్బంది అంశంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ బాగా వెనకబడి ఉందన్న విమర్శలు ఉన్నాయి. 2022 నాటి ఆర్టీఏ లెక్కల ప్రకారం.. రాష్ట్రంలో 1,51,13,129 వాహనాలు ఉన్నాయి. బ్యూరో ఆఫ్ పోలీసు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్ అండ్ డీ) నివేదిక ప్రకారం అన్ని స్థాయిల్లోని ట్రాఫిక్ పోలీసుల సంఖ్య 3,520 మాత్రమే. అంటే రాష్ట్రంలో ప్రతి 4,293 వాహనాల నియంత్రణకు ఒకే ట్రాఫిక్ పోలీసు ఉన్నట్టు స్పష్టమవుతోంది.

25 ఏళ్ల నాటి కేటాయింపులే ఇప్పటికీ అమలు

చాలీచాలని సిబ్బందితో నెట్టుకొస్తున్న అధికారులు
కేటాయించిన పోస్టుల్లో ఖాళీగా ఉన్నవి 813
పోలీసులతో సమానంగా ట్రాఫిక్ హోంగార్డులు
ఆ పోస్టుల్లోనూ వందల సంఖ్యలో ఖాళీగానే..

వాహనాల సంఖ్య వేగంగా పెరుగుతున్నా..

రాష్ట్రంలో ఏటా లక్షల సంఖ్యలో కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి. 2019లో వాహనాల సంఖ్య 1,33,22,334 కాగా.. 2022 నాటికి 1,51,13,129కి చేరింది. ప్రజా రవాణా వ్యవస్థ అవసరమైన స్థాయిలో లేకపోవడంతో ద్విచక్ర వాహనాలు, చిన్నకార్లు వంటివాటి కొనుగోళ్లు పెరుగుతున్నాయి. ఇలా రోడ్లపై పెరిగిన వాహనాల నియంత్రణపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సి వస్తోంది.

→ ఢిల్లీ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో ట్రాఫిక్ సిబ్బంది సంఖ్య తక్కువ. ఉన్న సిబ్బందితోనే అధిక సమయం పని చేయిస్తున్న పరిస్థితి. షిఫ్టులు, వీక్లీ ఆఫ్‌లు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. జంక్షన్లలో వేళాపాళా లేకుండా విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వాయు, ధ్వని కాలుష్యంతో రోగాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న చాలా మందికి శ్వాసకోశ, చెవి, ముక్కు, గొంతు సంబంధ సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్టు చెప్తున్నారు.

→ ఇతర పోలీసు విభాగాల మాదిరిగా ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న వారికి డ్యూటీ సమయంలో కొంత విరామం కూడా లభించదు. డ్యూటీలోకి వచ్చింది మొదలు పూర్తయ్యే వరకు నిలబడి, అప్రమత్తంగా ఉండి పనిచేయాల్సిందే. రద్దీ వేళల్లో వారి ఇబ్బంది మరీ ఎక్కువ.

ఇతర రాష్ట్రాల 'ట్రాఫిక్'తో పోలిస్తే..	రాష్ట్రం	మహారాష్ట్ర	కర్ణాటక	తమిళనాడు	గుజరాత్	ఢిల్లీ	తెలంగాణ
	మొత్తం పోస్టులు	14,290	8,872	8,603	8,228	5,831	4,333
	ఉన్న సిబ్బంది	9,615	7,912	6,628	4,509	5,481	3,520

→ ట్రాఫిక్ ఉన్నతాధికారులు గత ఐదారేళ్లలో వివిధ రకాలైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. స్పాట్ చలాన్లకు బదులు పూర్తిస్థాయిలో ఈ-చలాన్లను అమలు చేస్తూ.. నాన్-కాంటాక్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. హెచ్-ట్రిమ్స్ వంటి పథకాలతో సిగ్నల్స్ ఉన్న జంక్షన్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇవన్నీ సిబ్బంది కొరతతో ఉన్న ట్రాఫిక్ విభాగానికి కాస్త ఊరట ఇస్తున్నాయి.

→ ప్రభుత్వం ఇటీవల వేల సంఖ్యలో పోలీసు పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. అందులో సింహభాగం హైదరాబాద్‌కు వస్తారని, అవసరమైన సంఖ్యలో ట్రాఫిక్ వింగ్‌కు సిబ్బందిని కేటాయించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ప్రోత్సాహకంతో పరిస్థితి మెరుగైంది

గతంతో పోలిస్తే ట్రాఫిక్ విభాగంలో సిబ్బంది పరిస్థితి చాలా మెరుగైంది. అప్పట్లో ఈ విభాగాన్ని అప్రాధాన్యమైనదిగా భావించేవారు. కానీ ట్రాఫిక్ వింగ్‌లో పనిచేస్తున్న వారికి 30 శాతం పొల్యూషన్ అలవెన్స్ మంజూరు చేయడంతో పరిస్థితి మారింది. పోస్టింగ్స్ కోసం పోటీ పెరిగింది. ప్రస్తుతం జరుగుతున్న రిక్రూట్‌మెంట్ నుంచి ట్రాఫిక్ విభాగానికి గణనీయంగా సిబ్బందిని కేటాయిస్తే ఈ సమస్య తీరుతుంది.

- ఆర్వీ నరహరి, ట్రాఫిక్ విభాగం మాజీ అధికారి

బిర్లా ప్లానిటోరియంలో జీరో షాడో





పెద్ద ఎత్తున తిలకించిన నగరవాసులు

గన్‌ఫౌండ్రీ(హైదరాబాద్): నగరవాసులు ఆసక్తిగా ఎదురుచూసిన జీరో షాడోడే (నీడలేని రోజు) మంగళవారం ఆవిష్కృతమైంది. మధ్యాహ్నం 12:12 గంటల నుంచి 12:14 గంటల వరకు నీడ కన్పించలేదు. దీనిపై అవగాహన కల్పించేందుకు ఆదర్శ్‌నగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో పలు ఏర్పాట్లు చేయడంతో నగరవాసులు తిలకించారు. రెండు నిమిషాలపాటు నీడ కనిపించకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్లానిటోరియం డైరెక్టర్ కేజీ కుమార్ శాస్త్రీయంగా జీరో షాడో డే గురించి వివరించారు. ఒక తెల్లని ఉపరితలంపై పలు వస్తువులను నిలబెట్టి 12 గంటల నుంచి 12:12 నిమిషాల వరకు ఉన్న స్థితిని, ఆ తర్వాత 2 నిమిషాల పాటు నీడ మాయమవడం గురించి వెల్లడించారు. ఇటువంటివి ప్రతియేటా ఏదో ఒక చోట రెండు సార్లు జరుగుతుందని, ఈ ఏడాది హైదరాబాద్‌లో జరిగిందన్నారు. ఆగస్టు 3వ తేదీన ఈ జీరో షాడో డే తిరిగి రానున్నట్లు తెలిపారు. అయితే రెండు మూడు రోజులుగా నీడ కనిపించదంటుంటే నమ్మలేదని, ఈ రోజు ఇలా నేరుగా చూడటం సంతోషంగా ఉందని తెలిపారు.

నీడ మాయం సాధారణమే..



జీరో షాడో డే గురించి వివరిస్తున్న రఘునందన్

పంజగుట్ట(హైదరాబాద్): నీడ కనిపించకపోవడం కొత్తకాదని, పాశ్చాత్యంశాల్లో ఉన్నదేనని శాస్త్రవేత్త రఘునందన్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం నీడ కనిపించని సమయంలో ఆయన సోమాజి గూడ ప్రెస్‌క్లబ్‌లో విద్యార్థులకు జీరో షాడో డే గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇది మూఢనమ్మకం కాదని ప్రకృతి సహజంగా జరిగేదన్నారు. మనం ఎక్కడా చూడకపోవడంతో నీడ మాయం అనే ప్రచారం జరుగుతోందని, ఇటీవలే బెంగళూరులో జరగడంతో ప్రజల్లో కుతూహలం పెరిగిందని తెలిపారు. భూమి సూర్యుని చుట్టూ తిరిగే క్రమంలో ఇవి చోటు చేసుకుంటాయన్నారు. ఈ నెల 10న విశాఖపట్నంలో, 11న వరంగల్‌లో, 12న శ్రీకాకుళం, విజయనగరంలోనూ ఇది జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కోశాధికారి రాజేష్ పాల్గొన్నారు.

జూన్ 5 నుంచి రేషన్ డీలర్ల నిరవధిక సమ్మె

పంజగుట్ట(హైదరాబాద్): జూన్ 4వ తేదీలోపు కనీస గౌరవ వేతనం ప్రకటించకుంటే జూన్ 5వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తామని తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘాల ఐక్య వేదిక ప్రకటించింది. గౌరవ వేతం ఇస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ తొమ్మిదేళ్లుగా చెబుతున్నారు కానీ అమలు చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వేదిక చైర్మన్ నాయకోటి రాజు, వైస్ చైర్మన్ బత్తుల రమేష్ బాబు, కన్వీనర్ దొమ్మాటి రవీందర్, కో కన్వీనర్ గడ్డం మల్లిఖార్జున్ గౌడ్‌లు సోమవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంత రేషన్ డీలర్లకు 30 వేలు, పట్టణ ప్రాంతం వారికి 40వేల గౌరవ వేతనం ప్రకటించాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా ఆగిపోయిన కమీషన్‌ను వెంటనే ప్రకటించాలని, ప్రస్తుతం ఇస్తున్న కిలోకి 70 పైసల కమీషన్‌ను 2 రూపాయలకు పెంచాలన్నారు. కుటుంబాలతో సహా వర్తించేలా డీలర్లకు హెల్త్‌కార్డులు, డీలర్ చనిపోతే 25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీలో హెల్త్ వలంటీర్లు



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల ఆరోగ్యపరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యమివ్వనున్నట్లు ఎండీ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తార్నాక ఆస్పత్రిని అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరించినట్లు తెలిపారు. కొత్తగా నిర్మించిన 4 సూపర్ స్పెషాలిటీ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లతో పాటు 15 పడకల మెడికల్, మరో 10 పడకల సర్జికల్ ఐసీయూలను మంగళవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలోని 50 వేల మంది ఆర్టీసీ సిబ్బందికి గ్రాండ్ హెల్త్ చాలెంజ్‌లో భాగంగా ఇప్పటికే రోగ నిర్ధారణ పరీక్షలు చేసి 'హెల్త్ ప్రొఫైల్' రూపొందించిన సంస్థ.. వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు హెల్త్ వలంటీర్ల సేవలను వినియోగించుకోనుంది. కొత్తగా నియమితులైన హెల్త్ వలంటీర్లతో ఎండీ సజ్జనార్ సమావేశమయ్యారు. ఉద్యోగులతో ఆరోగ్యకరమైన అలవాట్లపైన సంభాషించడం, నిత్యం కౌన్సెలింగ్ చేయడం, వారి ఆరోగ్యంపై డిస్పెన్సరీ వైద్యుల సహాయం తీసుకోవడం వంటి విషయాలపై హెల్త్ వలంటీర్లు ప్రధానంగా దృష్టి సారించాలని ఆయన సూచించారు.

స్టాఫ్ నర్స్.. ఇక నర్సింగ్ ఆఫీసర్

పలు హోదాల పేర్లు మార్పు చేసిన కేంద్రం



సాక్షి, హైదరాబాద్: స్టాఫ్ నర్సు హోదాను నర్సింగ్ ఆఫీసర్‌గా కేంద్ర ప్రభుత్వం మార్పు చేసింది. అలాగే అనేక నర్సింగ్ పోస్టుల హోదాలను మార్చింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎయిమ్స్, ఈఎస్ఐ, రైల్వే ఆసుపత్రులు సహా ఇతర ఆసుపత్రుల్లో కొత్త హోదాను అమలు చేస్తోంది. దీన్ని కొన్ని రాష్ట్రాలు కూడా అమలు చేస్తున్నాయి. ఆ ప్రకారం తెలంగాణలోనూ నర్సింగ్ పోస్టుల్లో ఉన్న వారికి కొత్త హోదాలు ఇవ్వాలని నర్సులు కోరుతున్నారు. హోదాను మార్చడం వల్ల సమాజంలో గౌరవం ఏర్పడుతుందన్న ఉద్దేశంతో కేంద్రం వీటిని తెచ్చింది. హోదాను మార్చడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థికపరమైన భారం ఏమీ ఉండదంటున్నారు. బీఎస్సీ నాలుగేళ్లు, ఎంఎస్సీ రెండేళ్లు, పీహెచ్‌డీ ఏళ్లు చదివినా కూడా ప్రాథమికంగా స్టాఫ్ నర్సు పోస్టే ఉంటుంది. దీనివల్ల ఉన్నతస్థాయిలోని నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన వారు సరైన గౌరవం పొందలేకపోతున్నారని చెబుతున్నారు. ఆసుపత్రుల్లో అనేక విధానపరమైన నిర్ణయాల్లో డాక్టర్లు భాగస్వాములుగా ఉంటున్నారని, అధిపతులుగా కూడా వారే ఉంటున్నారన్న విమర్శలున్నాయి. ఇలా నర్సులపై వివక్ష కొనసాగుతోందన్న ఆందోళన ఉంది. పైగా నర్సింగ్ డైరెక్టరేట్ లేకపోవడం వల్ల కూడా ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు నర్సులు చెబుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం మార్చిన హోదాలు ఇలా...

ప్రస్తుత హోదా	కొత్త హోదా
స్టాఫ్ నర్స్	నర్సింగ్ ఆఫీసర్
నర్సింగ్ సిస్టర్	సీనియర్ నర్సింగ్ ఆఫీసర్
సీనియర్ ట్యూటర్	అసిస్టెంట్ ప్రొఫెసర్
లెక్చరర్	అసోసియేట్ ప్రొఫెసర్
ప్రిన్సిపాల్	ప్రొఫెసర్ కమ్ ప్రిన్సిపాల్
వైస్ ప్రిన్సిపాల్	ప్రొఫెసర్ కమ్ వైస్ ప్రిన్సిపాల్

నర్సింగ్ దినోత్సవం రోజున ప్రకటించాలి



ఈ నెల 12న నర్సింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం నర్సుల హోదాను మార్చాలి. తద్వారా సమాజంలో వారి గౌరవ మర్యాదలు పెంచాలి. హోదాలు మార్చడం వల్ల ప్రభుత్వంపై ఆర్థికంగా ఎటువంటి భారం పడదు. కొత్త హోదాలను ప్రభుత్వం అమలు చేస్తే, ప్రైవేట్ ఆసుపత్రులూ అనుసరిస్తాయి. అంతేగాక రాష్ట్రంలో నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు చేసి, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌ను దానికి డైరెక్టర్‌గా నియమించాలి.

– డాక్టర్ రాజేశ్వరి, అధ్యక్షురాలు, ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.